కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు వద్ద మహిళల సందడి

పూల వాకిలి.. సంబరాల లోగిలి

ఆడపడుచుల పాటలు.. యువతుల కోలాటాలు.. దాండియా ఆటలు.. చిన్నారుల సందళ్లు.. ఇలా నగరవ్యాప్తంగా గురువారం సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ఉదయం బతుకమ్మలను పేర్చి.. సాయంత్రం ప్రధాన కూడళ్లకు తీసుకొచ్చి ఆడిపాడారు. ట్యాంక్‌బండ్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో, కూకట్‌పల్లి, ఖైరతాబాద్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

- న్యూస్‌టుడే, నారాయణగూడ, కూకట్‌పల్లి, ఖైరతాబాద్



కూకట్‌పల్లి హనుమాన్ ఆలయం నుంచి ఐడీఎల్ చెరువు వరకు భారీ బతుకమ్మలతో శోభాయాత్ర



గోపన్‌పల్లి టీఎన్జీవోస్ కాలనీలో బతుకమ్మతో విదేశీ మహిళ





గుస్సాడి నృత్య ప్రదర్శన



హుస్సేన్‌సాగర్ వద్ద ..



ట్యాంక్‌బండ్‌పై బాణసంచా మిరుమిట్లు



బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు



ట్యాంక్‌బండ్‌పై ఆడటానికి సిద్ధం చేసిన బతుకమ్మలు





కూకట్‌పల్లి హనుమాన్ ఆలయం వద్ద..



విలువల రతనానికి టాటా

రతన్ టాటా మృతి నేపథ్యంలో నగరంతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని ప్రజలు గుర్తు చేసుకున్నారు. టీహబ్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అందరిలోనూ స్ఫూర్తి నింపారు. అప్పటి మంత్రి కేటీఆర్, యువకులతో కలిసి టీహబ్‌లో ఆయన సెల్ఫీ దిగారు.

నగరానికి నగిషీలు

కూడళ్ల విస్తరణ, రంగులు, కాలిబాటల అభివృద్ధికి రూ.178.87 కోట్లు



ప్రధాన రహదారుల అభివృద్ధిపై జీహెచ్ఎంసీ దృష్టిపెట్టింది. ముఖ్యంగా కూడళ్లను విస్తరించి, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఇంజినీరింగ్, యూబీడీ విభాగాల ఆధ్వర్యంలో 329 పనులను రూ.178.87 కోట్లతో చేపట్టేందుకు కమిషనర్ ఆమ్రపాలి ఇటీవల ఆమోదం తెలిపారు. దాదాపు సగం పనులు మొదలవగా, మిగిలినవి టెండరు దశలో ఉన్నాయి. రెండు ప్రాంతాల్లో నైట్‌బజార్ అభివృద్ధికి జీహెచ్ఎంసీ ప్రణాళిక సిద్ధం చేసింది. విద్యుద్దీపకాంతులు, స్ట్రీట్ ఫర్నీచర్‌తో ఆయా ప్రాంతాల సుందరీకరణ, ఇతర పనులను ఏడాది చివరికి పూర్తి చేస్తామని అధికారులు అంటున్నారు.

విభాగాల వారీగా పనులు..

విభాగం	పనులు	వ్యయం (రూ.కోట్లలో)
ఇంజినీరింగ్	224	149.84
నైట్‌బజార్	2	0.50
యూబీడీ	88	22.04
ఎలక్ట్రికల్	15	6.49

ఈనాడు, హైదరాబాద్

జోన్లవారీగా ఆమోదించిన పనులు (రూ.కోట్లలో వ్యయం)..

జోన్	పనులు	వ్యయం
ఎల్బీనగర్	19	24.34
చార్మినార్	55	30.00
ఖైరతాబాద్	121	34.94
శేరిలింగంపల్లి	51	30.00
కూకట్‌పల్లి	26	29.97
సికింద్రాబాద్	57	29.62
మొత్తం	329	178.87

వేగంగా పనులు..

గత సర్కారు చేపట్టిన కూడళ్ల సుందరీకరణ పనులను కొనసాగిస్తూనే.. మరిన్ని కొత్త వాటికి జీహెచ్ఎంసీ తాజాగా ఆమోదం తెలిపింది. ఇప్పటికే ఓ చోట పని పూర్తయ్యిందని, 125 కూడళ్లలో చేపట్టిన పనులు పురోగతిలో ఉన్నాయని ఇంజినీరింగ్ విభాగం చెబుతోంది. మరో 89 పనులు టెండరు దశలో ఉన్నాయి. ఆయా పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని, టెండరు పూర్తయిన నెలలో పూర్తి చేయాలని కమిషనర్ జోనల్ కమిషనర్లు, ఇంజినీరింగ్ ఉన్నతాధికారులకు సూచించారు. పంజాగుట్ట, ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ సర్కిల్, తదితర కూడళ్లలో విస్తరణ పనులు మొదలయ్యాయి. ఇటీవలి వర్షాలతో రోడ్లపై ఏర్పడ్డ గుంతలను వెంటనే పూడ్చాలని జోనల్ కమిషనర్లు, ఇంజినీర్లకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

ఆహ్లాదం.. అందం

అక్టోబరు నెల దాటితే వర్షాలు దాదాపుగా ఉండవు. తర్వాత చలికాలం మొదలవుతుంది. డిసెంబరు, జనవరిలో రహదాల పొడవునా రంగురంగుల పూలను ఇచ్చే మొక్కలను నాటుతున్నాం. కూడళ్లలో కొత్త విద్యుద్దీపాలను, డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేస్తున్నాం. పైవంతెనలకు ప్రకృతి, ప్రముఖులు, వేర్వేరు వృత్తులు, తెలంగాణ కళలను ప్రతిబింబించే చిత్రాలతో రంగులద్దుతున్నాం. ప్రధాన రహదారులపై ఏ ప్రాంతానికి ఎంత దూరం అని తెలిపే సూచిక బోర్డులు, ప్రధాన వీధుల పేర్లతో సూచిక బోర్డులను ఏర్పాటు చేశాం. పనులన్నీ ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయి. వేగంగా పూర్తి చేసి నగర వాతావరణాన్ని ఆహ్లాదకరంగా, అందంగా తీర్చిదిద్దుతాం.

- ఆమ్రపాలి కాటా, కమిషనర్, జీహెచ్ఎంసీ

హైడ్రా.. చలో బెంగళూరు



ఈనాడు, హైదరాబాద్: బెంగళూరు నగరంలో మాదిరిగా హైదరాబాద్ చెరువులకు జీవం పోయాలన్న ఉద్దేశంతో హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ అక్కడికి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన ఆనంద్ మల్లిగవాడ్‌తో ఆయన గురువారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. బెంగళూరు నుంచి సమావేశంలో పాల్గొన్న ఆనంద్ మాట్లాడుతూ.. తక్కువ ఖర్చుతో, పర్యావరణహిత సాంకేతికతతో చెరువులకు ప్రాణం పోయగలిగామని చెప్పారు. మురుగుతో నిండిన చెరువులు, నీరు లేని తటాకాలు, మురుగు కుంటలను కలిపి 35 నీటి వనరులు మంచినీటితో జీవం పోసుకున్న విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ 'బెంగళూరులో చేపట్టిన విధానం బాగుంది. కనుమరుగైన మాదాపూర్ ఈర్లకుంటను, ఆక్రమణలు, వ్యర్థాలతో నిండిన మాదాపూర్ సున్నం చెరువు, గగన్‌పహాడ్ అప్పా చెరువు, ప్రగతినగర్ ఎర్రకుంట, కూకట్‌పల్లి నల్లచెరువులను మొదటి దశలో పునరుద్ధరిస్తాం. నిర్వహణను చుట్టుపక్కల కాలనీలకే అప్పగిస్తాం."అని వివరించారు.

నిధుల సేకరణపై నజర్

నగరంపై తనదైన ముద్రకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యత్నం

ఈనాడు- సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి

అభివృద్ధిపరంగా హైదరాబాద్ మహానగరంపై వచ్చే నాలుగేళ్లలో తనదైన ముద్రవేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. కొన్ని ముఖ్యమైన అభివృద్ధి పనులకు దాదాపు రూ.లక్ష కోట్ల వరకు వ్యయం చేయాలని అనుకుంటున్నారు. వివిధ రూపాల్లో నిధుల సేకరణపై ఆయన దృష్టిపెట్టారు. ఇప్పటికే ఏషియన్ బ్యాంక్‌తోపాటు వివిధ ఆర్థిక సంస్థలతోనూ జరుపుతున్నారు. ప్రపంచ బ్యాంక్‌నూ ఒప్పంచి నిధులు తేవాలని అనుకుంటున్నారు.

మూసీ సుందరీకరణకు ప్రాధాన్యం



నగరానికి తలమానికం కాబోతున్న ప్రాజెక్టుల్లో మూసీ సుందరీకరణ ఒకటి. ప్రాజెక్టు రిపోర్టును తయారు చేయడానికి సలహా సంస్థను కూడా ఎంపిక చేసి బాధ్యతలను అప్పగించనున్నారు. దీనికి ప్రధాన అవరోధం మూసీ గర్భంలో, బఫర్ జోన్‌లోని నిర్మాణదారులే. వీరిని అక్కడి నుంచి పంపించడం కష్టమైన పనే. నిర్వాసితుల కోసమే దాదాపు రూ.15 వేల కోట్ల వరకు అవసరం. ఉన్న ఇంటి విస్తీర్ణాన్ని బట్టి వంద గజాల స్థలాలు ఇస్తే ఎలా ఉంటుందనేది పరిశీలిస్తోంది. మరోవైపు నగరంలో మలక్‌పేట రేస్ కోర్సు, అంబర్‌పేట పోలీసు గ్రౌండ్స్‌ను అక్కడి నుంచి ఖాళీ చేయించాలని అనుకుంటోంది. దాదాపు 400 ఎకరాల వరకు అక్కడ ఉంది. దీన్ని ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చి గృహ నిర్మాణ ప్రాజెక్టు చేపడితే ఈ రూపంలో వచ్చే నిధులతో నిర్వాసితులను అక్కడి నుంచి ఖాళీ చేయించొచ్చని సర్కార్ భావిస్తోంది. మరోవైపు నదిలోకి నీటిని తీసుకువచ్చేందుకు కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి పైపులు నిర్మాణం ప్రాజెక్టుకు రూ.5500 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. దీనికి నిధులు అడ్డంకి ఏమీలేదని అధికారులు చెబుతున్నారు. నెల రోజుల్లో దీనికి శంకుస్థాపన చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నాలుగేళ్లలో మెట్రో విస్తరణ



నగరంలో మరో 5 దశల కింద మెట్రో రైలు నిర్మాణ ప్రాజెక్టుకు రూ.24,229 కోట్లు అవసరమని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టును కేంద్రానికి పంపించి నిధుల కేటాయించేలా ఒత్తిడి తేవాలని నిర్ణయించారు. మొదటి దశలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు కేంద్రం అనుమతితో పనులు మొదలుపెట్టాలని ప్రభుత్వం అనుకుంటోంది.

- రూ.1500 కోట్లతో గోషామహల్‌లో నయా ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు.
- నాలుగో నగరంపై సీఎం ప్రత్యేకంగా దృష్టిసారించారు. నిధుల సేకరణపై వచ్చే 2 నెలల్లో అనేక ఆర్థిక సంస్థలతో ప్రభుత్వం చర్చలు జరుపుతుందని అధికారులు తెలిపారు.
- రాజీవ్ రహదారి, మేడ్చల్ జాతీయ రహదారిలో ఆకాశమార్గాల నిర్మాణానికి రక్షణ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఈ పనులను వచ్చే మూడు నెలల్లో మొదలపెట్టాలని అనుకుంటున్నారు. రూ.2500 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఆర్థిక సంస్థల దగ్గర రుణం తీసుకోవాలని నిర్ణయించారు.

అధ్వాన కేంద్రాలు

రూ.5 భోజన కేంద్రాల్లో ఎలుకలు, బొద్దింకలు, చెత్త



అన్నపూర్ణ కేంద్రం వద్ద ఎలుకల సంచారం

ఈనాడు పరిశీలన

పేదలు, అల్పాదాయ వర్గాలను ఆదరించే అన్నపూర్ణ భోజన కేంద్రాలు నిరాదరణకు గురవుతున్నాయి. పదేళ్ల క్రితం ఇనుప రేకుతో తయారైన డబ్బాల్లో మొదలైన రూ.5 భోజన కేంద్రాలు.. ఇప్పటికే అవే డబ్బాల్లో కొనసాగుతున్నాయి. కాలానుగుణంగా ఆధునికీకరణకు నోచుకోలేదు. కనీసం.. మరమ్మతులు కూడా జరగలేదు. దాంతో లోపలి ఫ్లోరింగ్ దెబ్బతింది. ఎలుకలు, పందికొక్కులు బొరియలు చేసుకుని భోజన కేంద్రాల్లో ఆవాసం ఏర్పరుచుకున్నాయి. అక్కడ పోగయ్యే ఆహార వ్యర్థాలను సిబ్బంది సకాలంలో శుభ్రం చేయట్లేదు. ఇలాంటి దుర్భర పరిస్థితుల మధ్య నగరవాసులు ఆకలి తీర్చుకోవాల్సిన దుస్థితి తలెత్తింది. భోజన కేంద్రాల దుస్థితిపై 'ఈనాడు' క్షేత్రస్థాయి పరిశీలన కథనం.

అసౌకర్యాల మధ్యనే..

2014లో అన్నపూర్ణ భోజన కేంద్రాల సేవలు మొదలయ్యాయి. ప్రస్తుతం 150 డివిజన్లకు 141 కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటిల్లో రోజూ 40 వేల మంది రూ.5కే మధ్యాహ్న ఆకలి తీర్చుకుంటున్నారు. కేంద్రాలను ఆధునికీకరించాలన్న ప్రతిపాదనా ఆగిపోయింది. నాలుగేళ్ల కిందట.. 6 జోన్లలోని 12 కేంద్రాల ఆధునికీకరణ పనులను చేపట్టినా మధ్యలోనే నిలిచిపోయాయి. మాదాపూర్ మెట్రో స్టేషన్, కూకట్‌పల్లి జోనల్ ఆఫీసు, బాలనగర్ రోడ్డు, మరికొన్ని కేంద్రాలను మాత్రమే అధికారులు ఆధునికీకరించారు. అపరిశుభ్రత, బొద్దింకలు, ఎలుకలు, పందికొక్కులు, తాగునీటి, మరుగుదొడ్ల సమస్యలు కేంద్రాలను వేధిస్తున్నాయి.



మింట్ కాంపౌండ్ కేంద్రం లోపల

- నాంపల్లి రైల్వేస్టేషన్, మింట్ కాంపౌండ్ తదితర ప్రాంతాల్లో కేంద్రాలను ఏర్పాటు చేయగా మింట్ కాంపౌండ్ కేంద్రాన్ని 'ఈనాడు' పరిశీలించింది. దాదాపు 200 మంది భోజనం చేశారు. వ్యర్థాలను సిబ్బంది ఓ నల్ల సంచిలో వేసి పక్కన ఉంచగా.. లోపల ఉన్న ఎలుకలు వచ్చి వ్యర్థాలను లోపలికి తీసుకెళ్లాయి. కేంద్రంలో దుర్వాసన, మట్టి, బొద్దింకలు, పాత సామాన్లు, బూజు పట్టిన పరిసరాలతో అపరిశుభ్రత దర్శనమిచ్చింది.

ఇవిగో సాక్ష్యాలు..

- జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయం ఎదుట కేంద్రం కూడా శిథిలావస్థకు చేరుకుంది. మురుగు, చెత్త, నాలా నుంచి వెలువడే దుర్వాసన మధ్యనే జనం ఆకలి తీర్చుకుంటున్నారు.
- రెడ్‌హిల్స్ రాయలసీమ రుచులు హోటల్ ఎదుట, పురానాపూల్ బ్రిడ్జి వద్ద, ఉస్మానియా జనరల్ ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద కేంద్రాల్లోనూ దాదాపు ఇవే దృశ్యాలు కనిపించాయి.

ఈనాడు, హైదరాబాద్









కోఠి ఆశలతో పూర్తి

కోఠిలోని ఉస్మానియా యూనివర్సిటీ మహిళా కళాశాల (ఓయూసీడబ్ల్యూ) 19వ స్నాతకోత్సవం గురువారం సందడిగా సాగింది. ఈ సందర్భంగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థినులకు పట్టాలు ప్రదానం చేశారు. పలు విభాగాల్లో ప్రతిభ చూపిన 13 మందికి బంగారు పతకాలు, పీహెచ్‌డీ చేసిన అధ్యాపకులకు ధ్రువపత్రాలు అందించారు. - న్యూస్‌టుడే, సుల్తాన్‌బజార్

ఎల్ఆర్ఎస్ కింద క్రమబద్ధీకరణకు ఆటంకం

ఈనాడు, హైదరాబాద్: హెచ్ఎండీఏలో వందల సంఖ్యలో పంచాయతీ లేఅవుట్లను నిషేధిత జాబితాలో ఉంచడంతో దాదాపు 3.2 లక్షల దరఖాస్తులు ఎల్ఆర్ఎస్ కోసం పెండింగ్‌లో ఉన్నాయి. ఈ తరుణంలో దాదాపు 400కు పైగా లేఅవుట్లను నిషేధిత జాబితా 22-ఏ(1)(ఈ)లో ఉండటం వల్ల ఆయా లేఅవుట్లల్లో ఎల్ఆర్ఎస్ సంక్లిష్టంగా మారింది. హెచ్ఎండీఏ ఏర్పడక ముందు వందల సంఖ్యలో గ్రామపంచాయతీ లేఅవుట్లు ఉన్నాయి. హెచ్ఎండీఏ వచ్చాక పంచాయతీ లేఅవుట్లను నిషేధించారు. అప్పటికే ఉన్న వాటిలో క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించారు. ఇప్పటికీ కొన్ని పంచాయతీ అనుమతుల లేఅవుట్లే ఉన్నాయి. ఎల్ఆర్ఎస్‌లోనూ ఈ జాబితాకు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లో నిషేధిత జాబితా లో చేర్చడంతో ఎల్ఆర్ఎస్ కింద క్రమబద్ధీకరణకు అవకాశం లేకుండా పోయిందని వాపోతున్నారు.

ఎల్.బి.నగర్

•ఎల్.బి.నగర్ • మలక్‌పేట

దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయం



వివిధ సంఘాల నేతలతో వీరయ్య

అక్బర్‌బాగ్, న్యూస్‌టుడే: దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయంగా నిత్యం అందుబాటులో ఉంటానని దివ్యాంగుల కార్పొరేషన్ శాఖ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య తెలిపారు. కార్పొరేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను సైతం పరిష్కరిస్తామన్నారు. మలక్‌పేటలోని దివ్యాంగుల సహకార సంస్థ కార్యాలయంలో గురువారం పలువురు దివ్యాంగులు, సంస్థ ఉద్యోగులు, వివిధ అసోసియేషన్ల నాయకులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల 18న కార్పొరేషన్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి, సమస్యలను పరిష్కరిస్తామన్నారు. వివిధ సంఘాల నాయకులు ఎస్.రాములు, ప్రభాకర్, చారి, రవీందర్, సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



సూర్యప్రభ వాహనంపై స్వామి

వనస్థలిపురం, న్యూస్‌టుడే: సచివాలయ నగర్‌లోని పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. గురువారం ఏడో రోజు సుప్రభాత సేవ, సువర్ణ పుష్పార్చన, అభిషేకం, హయగ్రీవ హోమం, సూర్యప్రభ వాహనంపై తిరువీధి ఉత్సవం, సాయంత్రం చంద్రప్రభ వాహనంపై తిరువీధి నిర్వహిచారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో మహిళలు బతుకమ్మ ఆడారు. ఆలయ ఛైర్మన్ కె.లక్ష్మయ్య, ప్రతినిధులు గణపతి, సత్యనారాయణ, పాపారావు, జగదీశ్, సత్తయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

ఇలపై పూల సింగిడి.. ఇంతుల సందడి



వనస్థలిపురం జనప్రియ హోమ్స్‌లో..



విజయపురి కాలనీ ఫేజ్-Iలో..



వనస్థలిపురం వినాయక ఓల్డేజీ హోమ్‌లో..



మన్సూరాబాద్ పెద్ద చెరువు ప్రాంగణంలో..



లక్ష్మారెడ్డిపాలెం పరిధిలోని శ్రీధరణి హైట్స్‌లో..



జడ్పీ రోడ్డు పరిధిలోని అగ్రికల్చర్ కాలనీలో..



సాగర్ రోడ్డు పద్మావతినగర్ కాలనీలో..



సద్దుల బతుకమ్మ సందడితో ఎల్బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలోని కాలనీలు మార్మోగాయి. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా మహిళలంతా రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చారు. కాలనీ ప్రధాన మార్గాల్లో ఒక్కచోటకు చేరి, అక్కడే జానపద పాటలతో ఆడిపాడారు. చిరు జల్లులను సైతం లెక్కజేయకుండా సంబురాల్లో పాల్గొన్నారు. 'చిత్తూ చిత్తుల బొమ్మ.. శివుని ముద్దుగుమ్మ', 'పసుపులో పుట్టేనమ్మా, పసుపులో పెరిగెనమ్మా.. పోయి రావమ్మా గౌరమ్మా' అనే పాటలు పాడుతూ జలాశయాల్లో బతుకమ్మలను సాగనంపారు. –న్యూస్‌టుడే యంత్రాంగం



నాగోలు కోఆపరేటివ్ బ్యాంక్ కాలనీలో..



శ్రీపురంకాలనీ మహిళ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..



చైతన్యపురి డివిజన్ విద్యుత్తునగర్‌లో..



సలీంనగర్ బాబాసంస్థాన్ వద్ద..



శ్రీఇంద్రప్రస్థ కాలనీలో..



దిల్‌సుఖ్‌నగర్ శ్రీసాయి రెసిడెన్సీలో..



దిల్‌సుఖ్‌నగర్‌లో..



పల్టన్ హరిహర క్షేత్రంలో..

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట మధ్య

ఎల్బీనగర్: 76759 19030	మలక్‌పేట: 80085 73284
	హయత్‌నగర్: 98336 64897
	కర్మన్‌ఘాట్: 94400 32872
	బండ్లగూడ: 96034 78579
	మూసారాంబాగ్: 79933 00559

సైదాబాద్, న్యూస్‌టుడే: ? సైదాబాద్ రెవెన్యూ బోర్డు కాలనీలో పక్షం రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. సుమారు పది దీపాలకు మరమ్మతులు చేపట్టాలి. – అచ్యుతరామయ్య, సైదాబాద్

✓ క్షేత్రస్థాయిలో పరిశీలన చేయించి, తగిన పరిష్కార చర్యలు చేపడతాం. – రాజు, ఏఈ, వీధిదీపాల విభాగం, మలక్‌పేట

బాలికను వేధించిన యువకుడి రిమాండ్

హయత్‌నగర్: ప్రేమిస్తున్నానంటూ బాలికను వేధిస్తున్న యువకుడిని హయత్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. హయత్‌నగర్ పరిధిలోని బంజారా కాలనీకి చెందిన కొర్రా సంతోశ్(20) కొద్దిరోజులుగా ప్రేమిస్తున్నానంటూ ఓ బాలిక (16) వెంట పడుతున్నాడు. పెళ్లి చేసుకుంటానంటూ వేధిస్తున్నాడు. విసిగిపోయిన బాలిక.. విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. యువకుడిని అరెస్టు చేసినట్లు సీఐ నాగరాజుగౌడ్ తెలిపారు.

పూల కోసం వస్తే.. ఫోన్లు కొట్టేశారు

ఆసిఫ్‌నగర్: గుడిమల్కాపూర్ పూల మార్కెట్లో సెల్‌ఫోన్ దొంగలు రెచ్చిపోయారు. మార్కెట్‌లో రద్దీని అనుకూలంగా మలచుకుని పెద్దఎత్తున చరవాణులు చోరీ చేశారు. సద్దుల బతుకమ్మ, విజయ దశమి నేపథ్యంలో రెండో రోజులుగా పూల మార్కెట్ కొనుగోలుదారులతో కిక్కిరిసింది. రద్దీలో కలిసిపోయిన దొంగలు బుధ, గురువారాల్లో చెలరేగిపోయారు. గురువారం ఉదయం 10 గంటల వరకు దాదాపు 20 మంది సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. బాధితులంతా గుడిమల్కాపూర్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. బుధవారం మరో 20 మంది బాధితులు ఠాణాలో ఫిర్యాదు చేశారు. కొందరి వద్ద సెల్‌ఫోన్లకు సంబంధించిన బాక్సులు, బిల్లులు లేకపోవడంతో పోలీసులు ఫిర్యాదు స్వీకరించలేదని సమాచారం. బుధ, గురువారాల్లో 28 మంది బాధితులు ఫిర్యాదులు చేశారని సౌత్ వెస్ట్ జోన్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి తెలిపారు.


ఎనిమిది మంది జూదరుల అరెస్టు

నాగోలు, న్యూస్‌టుడే: జూదమాడుతూ న్యూసెన్స్ సృష్టిస్తున్న ఎనిమిది మందిని నాగోలు పోలీసులు అరెస్టుచేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నాగోలు మమతానగర్ రోడ్డు నంబరు-1బీలో లక్ష్మీప్రైడ్ రెసిడెన్సీ అపార్టుమెంట్ 301 ఫ్లాట్ పలువురు జూదమాడుతూ న్యూసెన్స్ చేస్తున్నారన్న గురువారం సాయంత్రం 5 గంటల సమయంలో పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు అక్కడకు వెళ్లి.. మేకపాటి శ్యాంసుందర్‌రావు(52), కర్న లలిత కిశోర్(52), వేముల కృష్ణారెడ్డి(55), బట్టాడ్ నందకిశోర్(57), మందాడి శ్రీనివాస్‌రెడ్డి(52), సురెడ్డి గోపాల్‌రెడ్డి(47), మాదాల శివకుమార్(36), నిమ్మల శేఖర్(30)లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.79,250 నగదు, తొమ్మిది ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి

ఖైరతాబాద్: ముదిరాజ్ సామాజికవర్గం అన్ని రంగాల్లో వెనుకబాటులో ఉందని ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు అల్లాదుర్గం సురేశ్ అన్నారు. వీరి అభివృద్ధికి బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాల్సిన అవసరం ఉందన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడారు. 2009లో బీసీ-ఏలో చేర్చగా, కొందరు కోర్టుకు వెళ్లడంతో నిలిపివేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో ఈ అంశంపై హామీ ఇచ్చిందని తెలిపారు. అంతకు ముందు బీసీ కమిషన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

కెనడా రేడియోలో కవితా ప్రసారం



అశోక చక్రవర్తి

సైదాబాద్, న్యూస్‌టుడే: అంతర్జాతీయ శాంతి దినోత్సవ సందర్భంగా సైదాబాద్ మాధవనగర్‌కు చెందిన ఆంగ్ల కవి, విశ్రాంత ఉద్యోగి డాక్టర్ అశోక చక్రవర్తి రాసిన ఆంగ్ల కవిత కెనడా రేడియోలో ప్రసారమైంది. 'కల్టివేటింగ్ ఏ కల్చర్ ఆఫ్ పీస్' అంశంపై రాసిన కవితను ఈనెల 3న ప్రసారం చేసినట్లు గురువారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎమ్మెల్యే వద్దకు పారిశుద్ధ్య పంచాయితీ

సైదాబాద్, న్యూస్‌టుడే: మలక్‌పేట బల్దియా పారిశుద్ధ్య విభాగంలో పనిచేసే ఇద్దరు అధికారుల మధ్య ముసలం నెలకొంది. ఏఎంహెచ్‌వోగా ఇటీవల స్వీకరించిన అధికారి, రెండున్నరేళ్లుగా విధుల్లో కొనసాగుతున్న మరో అధికారి పనితీరుపై అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ఇద్దరికి పడకపోవడంతో ఎస్ఎస్ఏలు, పారిశుద్ధ్య కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. విభేదాలు తారాస్థాయికి చేరుకోవడంతో, పలువురు ఎస్ఎఫ్ఏలు గురువారం సమస్యను మలక్‌పేట ఎమ్మెల్యేకు వివరించారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానంటూ వారికి తెలిపారు.

మ్యాన్‌హోల్ వ్యర్థాల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

కర్మన్‌ఘాట్: హస్తినాపురం డివిజన్ శ్రీరమణ కాలనీ ఫేజ్-1 రోడ్డు నంబర్-3లో మ్యాన్‌హోల్‌లో పూడిక పేరుకుపోయి, మురుగు రోడ్డుపై పారుతోంది. ఈ సమస్యను వివరిస్తూ 'మ్యాన్‌హోల్ నిండి.. మురుగు పొంగి' శీర్షికన ఈ నెల 10న 'ఈనాడు'లో చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన జలమండలి మేనేజర్ సురేశ్ పర్యవేక్షణలో గురువారం సిబ్బంది వ్యర్థాలను తొలగించారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి: ఎమ్మెల్యే



సాయిప్రకాశ్ నగర్‌కాలనీ ముఖ ద్వారాన్ని ప్రారంభిస్తున్న సుధీర్‌రెడ్డి, స్థానికులు

కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: అభివృద్ధిలో కాలనీ సంక్షేమ సంఘాలు భాగస్వాములు కావాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సూచించారు. హస్తినాపురం డివిజన్ సాయిప్రకాశ్ నగర్‌లో ప్రభుత్వ నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డుతో పాటు కాలనీవాసులు రూ.5లక్షలతో నిర్మించిన ముఖ ద్వారాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీల అభివృద్ధికి ప్రణాళిక ప్రకారం నిధులు విడుదల చేయించి, ప్రగతి పనులు చేపడతామన్నారు. త్వరలో ఎల్బీనగర్, సాగర్ రింగ్ చౌరస్తా మీదుగా మెట్రో సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన వ్యాపారులకు అండగా ఉంటామన్నారు. భారాస నేతలు సత్యంచారి, గజ్జల మధుసూదన్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు రాఘవేంద్ర, రామకృష్ణ గుప్తా, ప్రవీణ్‌కుమార్, హరికృష్ణ గుప్తా పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత

నాగోలు, న్యూస్‌టుడే: తప్పిపోయిన బాలికను పోలీసులు తల్లిదండ్రుల చెంతకు చేర్చిన ఘటన ఎల్బీనగర్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్బీనగర్ మజీద్ లేన్‌లో నివసించే పార్థసారథి- వైష్ణవి దంపతుల కుమార్తె వేదవల్లి (11) మాట్లాడలేదు. ఉదయం 11 గంటల సమయంలో తల్లి ఇంట్లో పని చేసుకుంటుండగా, ఆడుకుంటూ బయటకు వెళ్లింది. కొంతసేపటికి గమనించిన తల్లి.. కుమార్తె కనిపించకపోవడంతో కుటుంబసభ్యులతో కలిసి స్థానికంగా వెతికారు. ఫలితం లేకపోవడంతో మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదుచేశారు. అప్రమత్తమైన పోలీసులు స్థానికంగా సీసీ కెమెరాలను పరిశీలించారు. బాలిక విజయవాడ జాతీయ రహదారిని దాటినట్లు గుర్తించి, గాలింపు చేపట్టారు. ఎస్‌బీహెచ్ కాలనీలో కనిపించడంతో తీసుకొచ్చి, తల్లిదండ్రులకు అప్పగించారు.

రెండు పడక గదుల ఇళ్లలో.. నీటి సమస్య పరిష్కారం



సరఫరా ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: మూసీ నిర్వాసితులకు కేటాయించిన రెండు పడక గదుల ఇళ్ల వద్ద సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. మలక్‌పేట నియోజకవర్గ పరిధిలోని వినాయక వీధి, శంకర్ నగర్, రసూల్‌పుర తదితర బస్తీలకు చెందిన పలువురికి చావునిలోని రెండు పడకల గృహ సముదాయంలో ఇళ్లు కేటాయించిన విషయం తెలిసిందే. అయితే అక్కడ తాగునీటి సమస్య తలెత్తడంతో జలమండలి అధికారులు రోజు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. శాశ్వత పరిష్కారానికి 100 ఎంఎం పైపులైన్ ఏర్పాటుచేశారు. ఈ పైపులైనును గురువారం మలక్‌పేట శాసన సభ్యుడు అహ్మద్ బలాల ప్రారంభించారు. స్థానికంగా నివసిస్తున్న 285 మంది కుటుంబాలకు సరిపడా నీరు సరఫరా అవుతుందని జలమండలి అధికారులు తెలిపారు.

యూసీడీ అధికారుల సర్వే

రెండు పడక గదుల గృహ సముదాయంలో చేరిన వారి పరిస్థితిపై మలక్‌పేట యూసీడీ అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. నిర్వాసితులకు ఇబ్బందులు తలెత్తకుండా, వారికి ఉపాధి అవకాశాలు, పిల్లలకు విద్యా సదుపాయాల కల్పనకు చేపట్టాల్సిన చర్యలను తెలుసుకునేందుకు వారితో మాట్లాడి వివరాలు సేకరిస్తున్నారు. నిర్వాసితులకు రేషన్ కార్డు ఉందా? స్వయం సహాయక బృందాల్లో సభ్యులుగా ఉన్నారా? ఏవిధమైన ఉపాధి కోరుకుంటున్నారు? తదితర వివరాలు తెలుసుకుంటున్నట్లు యూసీడీ అధికారి యుగేందర్‌రెడ్డి తెలిపారు. మరోవైపు నిర్వాసితుల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్యే బలాల గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలితో చర్చించారు. నిర్వాసితులకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసేందుకు నిధులు విడుదల చేయాలని కోరారు.

మెట్రో డివైడర్



మలక్‌పేట వంతెన వద్ద రాళ్లతో నిండి..



చాదర్‌ఘాట్ మార్గంలో మట్టి దిబ్బలు..



చాదర్‌ఘాట్ ధ్వంసమై ఇలా..

● ప్రమాదకరంగా విభాగినులు

మలక్‌పేట నియోజకవర్గ పరిధిలో మెట్రో డివైడర్లు (విభాగినులు) ప్రమాదకరంగా మారాయి. గోడలు కూలి.. మట్టి, ఇతర వ్యర్థాలు రహదారులపైకి చేరుతున్నాయి. పలు ప్రాంతాల్లో చెత్త, ఇతర వ్యర్థాలు పేరుకుపోయాయి. మొక్కలు పెంచుతామని గతంలోనే మెట్రో అధికారులు ప్రకటించినా, ఆ దిశగా అడుగులు పడలేదు. నల్గొండ చౌరస్తా నుంచి ఎంజీబీఎస్ వరకు ఇదే సమస్య నెలకొంది. గతంలో కూలిన డివైడర్ల కారణంగా వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. ఈ విషయమై మలక్‌పేట జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారి మల్లికార్జున్ మాట్లాడుతూ.. సమస్యను గతంలోనే మెట్రో అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. మరోమారు తెలియజేసి, పరిష్కార చర్యలు చేపడతామన్నారు. –న్యూస్‌టుడే, చంచల్‌గూడ

అయిగిరి నందిని.. నందిత మేదిని



సామూహిక హోమాలు.. ప్రత్యేక పూజలతో దేవీ శరన్నవరాత్రి వేడుకలు అంగరంగవైభవంగా కొనసాగుతున్నాయి. కర్మన్‌ఘాట్ పోచమ్మ తల్లి ఆలయంలో గురువారం ఎల్బీనగర్ ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పూజలు నిర్వహించారు. ఓల్డ్ మలక్‌పేట నల్ల పోచమ్మ ఆలయంలో సరస్వతీ పూజ చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించి.. రాత పుస్తకాలు అందజేశారు.

ఓల్డ్ మలక్‌పేట నల్ల పోచమ్మ ఆలయంలో..



మన్సూరాబాద్ సాయినగర్‌లో..

ఇష్టారీతిన రహదారుల తవ్వకాలు

సైదాబాద్, న్యూస్‌టుడే: మలక్‌పేట నియోజకవర్గంలోని ప్రధాన, అంతర్గత రహదారులను ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. అభివృద్ధి పనుల పేరిట ప్రభుత్వ విభాగాలు, సేవల సాకుతో ప్రైవేటు సంస్థలు, బహుళ అంతస్తుల భవనాలకు పైపులైన్ల కోసం రహదారులను ఛిద్రం చేసేస్తున్నారు. రాత్రికి రాత్రే గుట్టుచప్పుడు కాకుండా తవ్వేస్తున్నారు. స్థానికులు ఫిర్యాదు చేసినా, చర్యలు తీసుకునేందుకు బల్దియా అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. కొందరు రాజకీయ నేతల ఒత్తిడితో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.



కరణ్‌బాగ్‌కాలనీ మార్గంలో తవ్వకాలిలా..

అనుమతులు లేకుండానే..

నియోజకవర్గ పరిధిలో కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టారు. జలమండలి ఆధ్వర్యంలో మురుగు, తాగునీరు పైపులైన్లు వేశారు. ఆయా పనుల సమయంలో గుత్తేదారులు ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టి, పనులు పూర్తి చేశారు. తదనంతరం మరమ్మతులు సైతం వారే చేపట్టాలి. కానీ క్షేత్రస్థాయిలో చూస్తే, రహదారులు అలాగే అధ్వానంగా ఉన్నాయి. బల్దియా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో, గుత్తేదారులు ఎడాపెడా తవ్వేసి వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నారు. పలు ప్రైవేటు సంస్థలు సైతం రోడ్డు కేబుల్ కోసం, స్తంభాలు వేసేందుకు, పైపులైన్ల పనులకు ఒకచోట అనుమతి తీసుకుని, అదే పత్రాలు చూపుతూ మరో చోట అక్రమంగా తవ్వకాలు చేపడుతున్నారు.

భవనాలకు అక్రమ కనెక్షన్లు..

పలు ప్రాంతాల్లో పెద్దఎత్తున భవన నిర్మాణాలు చేపడుతున్నారు. ఆయా నిర్మాణాలకు తాగునీరు, మురుగు పారుదల పైపులైన్ల కోసం అనుమతులు తీసుకోకుండా.. సెలవు రోజుల్లో రహదారులను తవ్వుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసిన.. సెలవు రోజు రారనే ధైర్యంతో పనులు చేస్తున్నారు. ఫిర్యాదు చేసినా బల్దియా అధికారులు పట్టించుకోవట్లేదని పలు ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. ఈ విషయమై బల్దియా మలక్‌పేట సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్‌సింగ్ వివరణ కోరగా.. అనుమతులు లేకుండా చేపడుతున్న తవ్వకాలు పరిశీలించి, అందుకు బాధ్యులైన వారికి జరిమానాలు విధిస్తామని తెలిపారు.



మలక్‌పేట బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్క వీధిలో రోడ్డు దుస్థితి

దళారుల ప్రమేయం లేకుండా విదేశాల్లో ఉద్యోగాలు


అభ్యర్థులకు నిబంధనలు వివరిస్తున్న టాంకాం జనరల్ మేనేజర్ నాగభారతి

కార్వాన్: దళారుల ప్రమేయం లేకుండా నేరుగా విదేశాల్లోని ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వ ఆధ్వర్యంలోని టాంకాం (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ) పనిచేస్తోందని సంస్థ జనరల్ మేనేజర్ కె.నాగభారతి తెలిపారు. గురువారం మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలోని టాంకాం కార్యాలయంలో దుబాయ్ (యూఏఈ)లోని డెలివరీ బాయ్స్ ఉద్యోగులకు ఇంటర్వ్యూలు, అభ్యర్థులకు నిబంధనలపై అవగాహన కల్పించారు. గల్ఫ్ దేశాలకు వెళ్లేవారికి అక్కడి ఆహార వ్యవహారాలు, భాషపై ప్రాథమిక పరిజ్ఞానం కోసం ఇప్పటికే పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మేనేజర్ షబ్బు, రితేశ్, శారద తదితర అధికారులు పాల్గొన్నారు.

చార్మినార్

• చార్మినార్ • కార్వాన్ • నాంపల్లి • గోషామహల్ • చాంద్రాయణగుట్ట • యాకుత్‌పుర • బహదూర్‌పుర

విధుల్లో ఒత్తిడికి లోను కావద్దు: సీపీ


ఆయుధ పూజ చేస్తున్న పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్

చార్మినార్, న్యూస్‌టుడే: దుర్గామాత ఆశీస్సులతో అందరూ ఆరోగ్యంగా ఉండాలని, ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా పోలీసులు విధులు నిర్వహించాలని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. గురువారం పేట్ల బుర్జు సిటీ పోలీసు సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి నగర పోలీసు కమిషనర్ ఆయుధ, వాహన పూజలు నిర్వహించారు. సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన సబ్సిడరీ క్యాంటీన్‌ను ప్రారంభించారు. అందరికీ సభ్యత్వ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా, సీసీఎస్‌డీడీ డీసీపీ శ్వేత, సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్, అదనపు డీసీపీలు తదితరులు పాల్గొన్నారు.

జగదాంబికా అమ్మవారి ఆలయ ఈవోగా వసంత

గోల్కొండ: చారిత్రక గోల్కొండలోని జగదాంబికా అమ్మవారి ఆలయ నూతన ఈవోగా వసంత నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం గోల్కొండకోటలోని జగదాంబికా ఆలయంతో పాటు నానల్‌నగర్‌లోని కోవెల రంగనాయకస్వామి ఆలయం ఈవోగా ఉండనున్నారు. గురువారం కోవెల రంగనాయక స్వామి ఆలయంలో నిర్వహించిన పూర్ణాహుతి పూజల్లో ఆమె పాల్గొన్నారు.

షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

కార్వాన్, న్యూస్‌టుడే: పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించటానికి మజ్లిస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ పేర్కొన్నారు. లబ్ధిదారులకు గురువారం షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను టప్పాచబుత్రలో పంపిణీ చేశారు. కార్వాన్ కార్పొరేటర్ ఎం.స్వామియాదవ్‌తోపాటు పలువురు నాయకులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఊరెళుతున్నారా.. ఇల్లు జాగ్రత్త!



చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: వివిధ రాష్ట్రాలు, జిల్లాలకు చెందిన కుటుంబాలు అనేకం పాతనగరంలో నివసిస్తున్నాయి. ఉపాధి కోసం వలస వచ్చి ఇక్కడ స్థిర నివాసం ఏర్పరచుకున్న వారు పెద్దసంఖ్యలో ఉన్నారు. దసరా పండుగ వచ్చిందంటే వీరు కుటుంబసభ్యులతో కలిసి తమ సొంత గ్రామాలకు వెళుతుంటారు. రెండు మూడు రోజులపాటు తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగలు చోరీకి పాల్పడే ఆస్కారం ఉంటుంది. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో చోరీల నియంత్రణ, నేరాల అదుపు, చోరీ సొత్తు రికవరీకి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో ప్రత్యేక విభాగం ఉంటుంది. చోరీలు జరగకుండా ఉండాలంటే ఇంటి యజమానులు కొన్ని జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు.

వీటిని పాటిస్తే మేలు

- ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్తే వారు సంబంధిత పోలీసుస్టేషన్‌లో సమాచారం అందిస్తే పోలీసులు ఆ ప్రాంతంలో ప్రత్యేక నిఘా పెట్టి గస్తీ పెంచుతారు.
- విలువైన నగలు, నగదు ఇంట్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో లేదా బంధువుల ఇళ్లలో దాచి వెళ్లడం మంచిది.
- మెయిన్ డోర్‌కు లోపలి నుంచి గడియ పెట్టి, వెనుక డోర్‌కు తాళం వేయాలి. తాళం కనిపిస్తే దొంగలు చోరీలకు పాల్పడే అవకాశం ఉంటుంది.
- ఇంటిని చీకట్లో ఉంచకుండా హాలులో లేదా వరండాలో విద్యుత్తు బల్బు వెలిగేలా స్విచ్ వేసి ఉంచాలి.
- ఇంటికి సెక్యూరిటీ అలారం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలు జరగడానికి అవకాశం ఉండదు. సీసీ కెమెరాలను వారి ఫోన్‌కు అనుసంధానం చేసుకుంటే ఇంటి వద్దకు ఎవరు వచ్చి వెళుతున్నారో తెలుసుకోవచ్చు.
- తిరిగి వచ్చే వరకు ఇరుగు పొరుగు వారికి తరచుగా ఫోన్ చేసి ఇంటి సమాచారం తెలుసుకోవాలి.
- నమ్మకస్తులు లేదా సమీప బంధువులు రాత్రిపూట ఇంటిలో ఉండేలా చూసుకోవడం ఉత్తమం.

పోలీసులకు సమాచారం ఇవ్వండి



సీహెచ్ చంద్రశేఖర్, ఏసీపీ, ఫలక్‌నుమా

ఇంటికి తాళం వేసి గ్రామాలకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు సంబంధిత పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి. ఇంటి లోకేషన్‌ను కూడా షేర్ చేస్తే ఆ ప్రాంతంపై ప్రత్యేక నిఘా పెట్టి గస్తీ పెంచుతాం. సాధారణంగా తెల్లవారు జామున ఇళ్లలో దొంగతనాలు జరుగుతుంటాయి. ఇంట్లో విలువైన నగలు, వస్తువులు, నగదు లేకుండా చూసుకోవాలి. బస్తీల్లో 24/7 పోలీసు పెట్రోలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఆలయాలను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి


దర్శనానికి వస్తున్న జస్టిస్ వేణుగోపాల్ దంపతులు

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ ఆలయాలను గురువారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ. వేణుగోపాల్ దంపతులు దర్శించుకున్నారు. అర్చకులు, ఈవో పురేందర్, ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ధర్మకర్త సభ్యులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి వారికి అభిషేకం, జోగులాంబ అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు

చాంద్రాయణగుట్ట: గౌలిపురాలోని లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో స్వామి వారి 722వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారికి వివిధ పూజలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్, ధర్మకర్త ఎం.వి.శేషాద్రి అయ్యంగార్, ప్రధాన పురోహితుడు సుందర్ అయ్యంగార్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు. శుక్రవారం స్వామివారి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

పండుగలు కలిసిమెలిసి జరుపుకోవడంలోనే ఆనందం

ధూల్‌పేట: ఏ పండుగలు వచ్చినా కుల, మతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి జరుపుకోవడం హైదరాబాద్ నగర ప్రత్యేకత అని తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. గోడే కీ ఖబర్‌లోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించి ప్రత్యేక పూజా కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొని పూజలు చేశారు. కాలనీ సంఘం ఆయన్ను ఘనంగా సత్కరించింది.

దేవీ విగ్రహాల నిమజ్జనానికి సౌకర్యాలు కల్పించాలి

గోషామహల్, న్యూస్‌టుడే: దేవీ విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన సౌకర్యాలను ప్రభుత్వ యంత్రాంగం కల్పించాలని భజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు కోరారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహారాజ్‌గంజ్‌లో కాలభైరవ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. సంఘం నేతలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని జీహెచ్‌ఎంసీ గుత్తేదారుల వినతి

కేశవగిరి, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టి.వెంకన్నకు వినతి పత్రం అందజేశారు. బల్దియా కార్యాలయంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఎ.మాజిద్ ఆధ్వర్యంలో కాంట్రాక్టర్లు జడ్సీని కలిశారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే మంజూరు చేయాలని కోరారు. సీనియారిటీ ప్రకారం బకాయిలు విడుదల చేయాలని విన్నవించారు.

మిత్రాక్లబ్ వ్యాయామశాల నూతన కమిటీ ఏర్పాటు

చాంద్రాయణగుట్ట న్యూస్‌టుడే: గౌలిపురా మిత్రా క్లబ్ వ్యాయామశాల నూతన కార్యవర్గం ఏర్పాటైంది. గురువారం గౌలిపురాలోని ఆలె నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన సమావేశంలో సభ్యులు నూతన కమిటీని ఎన్నుకున్నారు. వ్యాయామశాల కమిటీ అధ్యక్షుడిగా ఆర్.సూర్యప్రకాశ్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎన్.మారుతీరావు, ప్రధాన కార్యదర్శిగా ఎ.కృష్ణారావు, కన్వీనర్‌గా ఎం.రమేశ్, కోశాధికారిగా కె.ముత్తయ్య, గ్రౌండ్ ఇన్‌ఛార్జిగా ఆర్.నందు, కార్యవర్గ సభ్యులుగా భాస్కర్‌యాదవ్, శైలేందర్ యాదవ్, బాలాజీ, గౌరిశంకర్, రవిచారి, పవన్, జీవన్‌సింగ్, కళ్యాణ్ ఎన్నికయ్యారు.

దుర్గాదేవిగా శక్తి స్వరూపిణి దర్శనం

న్యూస్‌టుడే బృందం: దేవీ శరన్నవరాత్రులు కనుల పండువగా సాగుతున్నాయి. ఎనిమిదో రోజున దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ఆలయాలు, మండపాల్లో హోమాలు ప్రత్యేక పూజలు చేశారు. ఉస్మానియా ఆసుపత్రిలోని వివిధ విభాగాల్లో చేపట్టిన ఆయుధ పూజల్లో ఆసుపత్రి సూపరింటెండెంటు డా.రాకేశ్ సహాయ్ పాల్గొన్నారు.


చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం వద్ద


మీరాలంమండి మహాంకాళేశ్వర ఆలయంలో..


గుడిమల్కాపూర్ మహారాజులకాలనీలో..


చాంద్రాయణగుట్ట కుమ్మరివాడిలో..


కార్వాన్ బాంజావాడిలో ఎమ్మెల్యే దానం


దుర్గాదేవి అలంకరణలో ఉప్పుగూడ మహంకాళి


నాగులబండ అంబేడ్కర్ నగర్‌లో పూజలు


చాంద్రాయణగుట్ట శ్రీదేవిదేవాలయంలో చండీహోమం

సందడిగా సద్దుల బతుకమ్మ వేడుక

న్యూస్‌టుడే బృందం: సద్దుల బతుకమ్మ వేడుకలు గురువారం రాత్రి ఘనంగా జరుపుకొన్నారు. వివిధ పూలతో అందంగా తీర్చిదిద్దిన బతుకమ్మ, గౌరమ్మకు మహిళలు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ పాడుతూ నృత్యాలు చేశారు. అనంతరం బతుకమ్మకు వీడ్కోలు పలికి నిమజ్జనం చేశారు.






పురానాపూల్‌లో..


లంగర్‌హౌస్ మధుపార్క్ రిడ్జ్ అపార్టుమెంటులో..


బతుకమ్మ వేడుకల్లో జూపార్కు అధికారులు, సిబ్బంది


ఆసిఫ్‌నగర్ దత్తాత్రేయ కాలనీలో మహిళల సందడి


జూపార్కు సమీప మోచీ కాలనీలో..

గర్బా, దాండియా విజేతలకు బహుమతులు


విజేతలకు బహుమతులు అందజేసిన గోవింద్ రాఠీ తదితరులు

అబిడ్స్, న్యూస్‌టుడే: రాజస్థానీ ప్రగతి సమాజ్, ఎగ్జిబిషన్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న దాండియా, గర్బా వేడుకలు కనుల పండువగా సాగుతున్నాయి. ఈ నెల 6న ప్రారంభమైన ఈ వేడుకల్లో విజేతలుగా నిలిచి వారికి గురువారం ఉత్సవ సమితి చీఫ్ కన్వీనరు గోవింద్ రాఠీ, ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి సురేందర్‌రెడ్డితో కలిసి బహుమతులు అందజేశారు. సొసైటీ సభ్యులు వంశతిలక్, హన్మంత్‌రావు, ఉత్సవ సమితి నేతలు పాల్గొన్నారు.

పీడియాట్రిక్ డెర్మటాలజీ శిక్షణ కేంద్రం ప్రారంభం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: నిలోఫర్ ఆసుపత్రి, ఉస్మానియా మెడికల్ కళాశాలలో పీడియాట్రిక్ డెర్మటాలజీ శిక్షణ కేంద్రాన్ని గురువారం నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ ప్రారంభించారు. పీడియాట్రిక్ డెర్మటాలజీ ప్రోగ్రామ్ డైరెక్టర్, ఉస్మానియా ఆసుపత్రి ప్రొఫెసర్, ఐఏడీవీఎల్ జాతీయ గౌరవ కార్యదర్శి డాక్టర్ భుమేష్‌కుమార్ కటకం అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఉస్మానియా జనరల్ ఆసుపత్రి నుంచి ఆచార్యులు, పీజీ విద్యార్థులు ప్రతీ గురు, శనివారాల్లో నిలోఫర్ ఆసుపత్రికొచ్చి పీడియాట్రిక్ డెర్మటాలజీ ఓపీ నిర్వహిస్తున్నారన్నారు. 'స్కిన్ హెల్త్ ఫర్ ది వరల్డ్' అనే అంశంపై శిక్షణ ఇచ్చారు.

దసరా నేపథ్యంలో గంజాయి, డ్రగ్స్‌పై ప్రత్యేక నిఘా

అబిడ్స్, న్యూస్‌టుడే: దసరా పండగను పురస్కరించుకుని గంజాయి, డ్రగ్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ డైరెక్టరు వీబీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. దీని కోసం జిల్లాల వారీగా ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపినట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాటు సారా తయారీ ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో దాడులు ముమ్మరం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతూ వస్తున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్‌టీఎఫ్, డీటీఎఫ్, స్థానిక స్టేషన్ల అధికారులతో ప్రత్యేక బృందాలు నిరంతరం దాడులు నిర్వహించాలని కోరినట్లు పేర్కొన్నారు.

2011 జనాభా ప్రకారం వర్గీకరణతో మాలలకు అన్యాయం


ఐక్యత చాటుతున్న చెన్నయ్య, బేర బాలకిషన్ తదితరులు

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: పాత 2011 జనాభా లెక్కల ఆధారంగా వర్గీకరణను ఎలా అమలుచేస్తారని, దీని వల్ల మాలలు తీవ్రంగా నష్టపోతారని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఛైర్మన్ జి.చెన్నయ్య ఆందోళన వ్యక్తం చేశారు. 2024 దళితుల జనాభాను పరిగణనలోకి తీసుకుని వివరాలు సేకరించి దళితుల స్థితిగతులను అధ్యయనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి కో-ఛైర్మన్ బేర బాలకిషన్, ప్రతినిధులు బత్తుల రాంప్రసాద్, గోపోజు రమేష్‌బాబు, వెంకటేశ్వర్లు, లింగస్వామి, జంగా శ్రీనివాస్, మన్నె శ్రీరంగ తదితరులతో కలిసి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం రాజ్యాంగ విరుద్ధమన్నారుఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలోని మంత్రుల ఉపసంఘాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

వైభవంగా మాతాకీ జాగరణ్


కార్యక్రమంలో సినీ నటుడు తనికెళ్ల భరణి తదితరులు

ఐఎస్ సదన్, న్యూస్‌టుడే: భాజపా నాయకుడు చీకోటి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వినయ్ నగర్ కాలనీలోని ఆంజనేయ స్వామి ఎదురుగా ఏర్పాటు చేసిన దుర్గామాత మందిరంలో మాతాకీ జాగరణ్ వైభవంగా సాగింది. ప్రముఖ కళాకారులతో భక్తి గీతాలు, భజనలతో ఆ ప్రాంతం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. కార్యక్రమంలో ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్ రావు, డాక్టర్ లక్ష్మణ్ పాల్గొన్నారు. సినీ నటుడు తనికెళ్ల భరణి భక్తి గీతాలు ఆలపించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

ధూల్‌పేట: ధూల్‌పేట కేంద్రంగా గంజాయి విక్రయాలు సాగిస్తున్న ముగ్గురిని ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు ముగ్గురు నిందితులను అరెస్టు చేసి మూడు మోటారు సైకిళ్లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌టీఎఫ్ ఈఎస్ అంజిరెడ్డి వివరాల ప్రకారం.. ధూల్‌పేట, పురానాపూల్, జుమ్మేరాత్‌బజార్ ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జరుపుతున్నారని సమాచారం అందడంతో గురువారం సాయంత్రం దాడులు నిర్వహించగా 2.310 కిలోల గంజాయి లభించింది. జియాగూడకు చెందిన రాజు, వికాస్‌యాదవ్, విఠల్‌ను అరెస్టు చేశారు. ఈ కేసులో ధూల్‌పేటకు చెందిన మరికొందరు పరారీలో ఉన్నారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐలు మధుబాబు, జీడీ గోపాల్, ఎస్సైలు సైదులు, మధు, సిబ్బంది పాల్గొన్నారు.

కత్తితో సంచరిస్తున్న వ్యక్తికి జైలు

ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: కత్తితో సంచరిస్తున్న వ్యక్తికి న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు కథనం ప్రకారం.. మల్లేపల్లిలోని అఫ్జల్‌సాగర్ ప్రాంతనికి చెందిన కె.దివాకర్ (19) బుధవారం రాత్రి మాంగార్‌బస్తీలో అనుమానాస్పదంగా సంచరిస్తూ పెట్రోలింగ్ పోలీసుల కంట పడ్డాడు. దివాకర్‌ను తనిఖీ చేయగా అతడి జేబులో కత్తి కనిపించింది. అతడిని అరెస్టు చేసి గురువారం నాంపల్లిలోని 2వ ప్రత్యేక మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. నిందితుడికి ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి ఎం.స్వామి తీర్పు చెప్పారు.

డిజిటల్ అరెస్టు అంటూ బెదిరించి రూ.8.30 లక్షలు స్వాహా

నారాయణగూడ, న్యూస్‌టుడే: మనీలాండరింగ్ కేసులో ప్రమేయం ఉన్న మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తామని బెదిరించి రూ.8.30 లక్షలు కొట్టేశారంటూ 85 ఏళ్ల విశ్రాంత ఉద్యోగి హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేశారు. నగరానికి చెందిన బాధితుడికి 82848 80588 నెంబరు నుంచి కాల్ వచ్చింది. మీకు మనీలాండరింగ్ కేసులో ప్రమేయం ఉందని, ముంబైలో ఖాతా తెరిచి, దాని ద్వారానే లావాదేవీలు జరిపారంటూ మోసగాడు బెదిరించాడు. ఇంతలో వీడియో కాల్ వచ్చింది. అందులో పోలీసు దుస్తుల్లో కనిపించిన వ్యక్తి మిమ్మల్ని 'డిజిటల్ అరెస్టు' చేస్తున్నామని, మీరు, మీ భార్య, పిల్లలు ఇల్లు వదిలిపెట్టి బయటకు వెళ్లడానికి వీలులేదని హెచ్చరించాడు. మీపై ఇప్పటికే అరెస్టు వారెంట్ జారీ అయ్యిందంటూ ప్రతిని చూపించాడు. మీరు కోరితే బెయిల్ ఇస్తామనీ.. దానికి సొంత పూచీకత్తు కింద రూ.8.30 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని చెప్పాడు. బాధితుడు అదంతా నిజమే అనుకొని రెండు విడతల్లో ఆన్‌లైన్ ద్వారా ఆ మొత్తాన్ని పంపించారు. ఆ తర్వాత మోసపోయినట్లు గ్రహించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రవర్తన మార్చుకోవాలని చెప్పినందుకే హత్య

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: తన భార్యతో మాట్లాడవద్దని, ప్రవర్తన మార్చుకోవాలని చెప్పినందుకే మహ్మద్ సాజిద్‌ను సిద్ధిఖ్ అనే యువకుడు హత్య చేసినట్లు తెలుస్తోంది. ఫలక్‌నుమా పోలీసుసేషన్ పరిధిలోని ఫాతిమానగర్‌లో బుధవారం రాత్రి పాతిమానగర్ గుఫారియా మసీదు ప్రాంతానికి చెందిన స్క్రాప్ వ్యాపారి సాజిద్ (37) హత్యకు గురైన విషయం విదితమే. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. సాజిద్ భార్యతో ఫాతిమానగర్‌కు చెందిన సిద్ధిఖ్(26) తరచుగా ఫోన్‌లో మాట్లాడుతుండడంతో గతంతో పెద్దలు సిద్ధిఖ్‌ను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా సిద్ధిఖ్ పద్ధతి మార్చుకోలేదు. బుధవారం రాత్రి సాజిద్ ఇంటి వద్దకు వచ్చిన సిద్ధిఖ్ అతడితో గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో కత్తితో పొడిచి పరారయ్యాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సాజిద్ మృతి చెందాడు. ఫలక్‌నుమా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై మొఘల్‌పురా పోలీసులు కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి 15.9 క్వింటాళ్ల బియ్యం, 4.2 క్వింటాళ్ల గోధుమలు, ఆటో ట్రాలీ స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ పీఎస్‌డీ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం నసీమా నగర్ హనుమాన్ మందిర్ ప్రాంతంలో షేక్ అయాజ్, సయ్యద్ అబ్దుల్ ఖదీర్‌లు ఆటో ట్రాలీలో రేషన్ బియ్యం, గోధుమలు అక్రమంగా తరలిస్తుండగా పౌర సరఫరాల శాఖ అధికారులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మొఘల్‌పురా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గుడిమల్కాపూర్ మార్కెట్ రహదారిలో ట్రాఫిక్ నియంత్రణ


మార్కెట్ రోడ్డులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డివైడర్లు

ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: గుడిమల్కాపూర్ మార్కెట్ ప్రధాన రహదారిలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. పండుగలు, పర్వదినాల్లో పూలు, కూరగాయలు కొనుగోలు చేసేందుకు వినియోగదారులు వేల సంఖ్యలో తరలిరావడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. సద్దుల బతుకమ్మ పండుగ కోసం బుధవారం పెద్ద ఎత్తున ప్రజలు పూల మార్కెట్‌కు వచ్చారు. దీంతో గుడిమల్కాపూర్ వివేకానంద చౌరస్తా నుంచి పీవీ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబరు 67 (లక్ష్మినగర్ చౌరస్తా) వరకు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. దసరా పర్వదినం నేపథ్యంలో శుక్ర, శనివారాల్లో పూల మార్కెట్‌లో జనం భారీగా వస్తారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులను దూరం చేసేందుకు సౌత్ వెస్ట్ ఏసీపీ ధనలక్ష్మి గురువారం రంగంలోకి దిగారు. ఉదయం నుంచి మార్కెట్ ప్రధాన రహదారిలో ట్రాఫిక్ నియంత్రణకు శ్రీకారం చుట్టారు. పూల మార్కెట్ ప్రధాన గేటు నుంచి రిటైల్ కూరగాయాల మార్కెట్ గేటు వరకు తాళ్లతో తాత్కాలిక డివైడర్లు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్లు రాజు, బాలకృష్ణాగౌడ్, సుధాకర్, ఎస్సైలతో ట్రాఫిక్‌పై సమీక్ష జరిపారు. ఇతర రాష్ట్రాల నుంచి పూలు తీసుకొచ్చే వాహనాల పార్కింగ్‌కు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మార్కెట్ రహదారిలో వన్‌వే నిబంధనలు విధిస్తున్నట్లు ప్రకటించారు.

పూల కోసం వస్తే... సెల్‌ఫోన్లు కొట్టేశారు

ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: గుడిమల్కాపూర్ హోల్‌సేల్ పూల మార్కెట్లో సెల్‌ఫోన్ దొంగలు రెచ్చిపోయారు. మార్కెట్‌లో రద్దీని తమకు అనుకూలంగా మలచుకుని పెద్దఎత్తున చరవాణులు చోరీ చేశారు. సద్దుల బతుకమ్మ, విజయ దశమి నేపథ్యంలో రెండో రోజులుగా పూల మార్కెట్‌లో కొనుగోలుదారులతో కిక్కిరిసింది. రద్దీలో కలిసి పోయిన దొంగలు బుధ, గురువారాల్లో చెలరేగిపోయారు. గురువారం ఉదయం 10 గంటల వరకు దాదాపు 20 మంది సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. బాధితులంతా గుడిమల్కాపూర్ ఠాణాకు చేరుకుని ఫిర్యాదు చేశారు. బుధవారం మరో 20 మంది బాధితులు గుడిమల్కాపూర్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కొందరి వద్ద సెల్‌ఫోన్లకు సంబంధించిన బాక్సులు, బిల్లులు లేకపోవడంతో పోలీసులు ఫిర్యాదు స్వీకరించలేదని సమాచారం. బుధ, గురువారాల్లో 28 మంది బాధితులు తమకు అధికారికంగా ఫిర్యాదులు చేశారని సౌత్ వెస్ట్ జోన్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి చెప్పారు. పండుగలు, పర్వదినాల సమయాల్లో సెల్‌ఫోన్ దొంగలు మార్కెట్‌లో యథేచ్ఛగా సంచరిస్తుంటే పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రాజేంద్రనగర్

•రాజేంద్రనగర్ • షాద్‌నగర్ • చేవెళ్ల

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే



కల్యాణలక్ష్మి చెక్కు అందిస్తున్న యాదయ్య

షాబాద్, న్యూస్‌టుడే: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం ఆయన జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి షాబాద్‌లో వివిధ గ్రామాలకు చెందిన 74మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అన్వర్, చంద్రశేఖర్, చెన్నయ్య, వెంకట్‌రెడ్డి, రాహుల్, జనార్దన్‌రెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.

దుర్గామాత విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు



పత్తికుంట వద్ద..

రాజేంద్రనగర్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాలను నిమజ్జనం చేయడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పత్తికుంటలో ప్రత్యేకంగా నిర్మించిన నీటికొలనులో తాజా నీటిని నింపారు. రెండు రోజుల పాటు బతుకమ్మ ఉత్సవాలు ఉండటంతో బతుకమ్మ నిమజ్జనాలను ఈ కొలనులోనే చేయనున్నారు. అనంతరం అదే కొలనులో అమ్మవారి విగ్రహాల నిమజ్జనానికి చేయడానికి అధికారులు ఏరాట్లు చేస్తున్నారు. 13, 14 తేదీల్లో నిమజ్జనం నేపథ్యంలో ఒకరోజు ముందు క్రేన్ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పల్లెచెరువు, మీరాలం చెరువుల్లోనూ నిమజ్జనం ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు.

వాడవాడల్లే.. పూల వనమాయే

ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



చేవెళ్లలో బతుకమ్మ వేడుకలు



చిలుకూరులో బతుకమ్మలతో..



రాజేంద్రనగర్, నార్సింగి, బండ్లగూడజాగీర్, చేవెళ్ల, షాద్‌నగర్ టౌన్, మొయినాబాద్, షాబాద్, కొత్తూరు, న్యూస్‌టుడే: తీరొక్క పూలను ఒక్కచోట పేర్చి.. సుందరంగా అలంకరించిన బతుకమ్మతో మహిళలు, యువతులు, చిన్నారులు అంతా సంప్రదాయబద్ధంగా సద్దుల బతుకమ్మను ఆడిపాడి సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పే బతుకమ్మ వేడుకలను గురువారం రాత్రి రాజేంద్రనగర్, షాద్‌నగర్, చేవెళ్ల నియోజకవర్గాల్లో వైభవంగా నిర్వహించారు. బస్తీలు, కాలనీలు, అపార్టుమెంట్లు, నివాసాలతోపాటు ప్రధాన కూడళ్ల వద్ద సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటేలా జరిపారు. బతుకమ్మ బతుకమ్మ ఉయాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. చిత్తూచిత్తూల బొమ్మ.. శివుడీ ముద్దుల గుమ్మా.. ఒక్కేసి పువ్వేసి చందమామ ఒక్క జాములాయే చందమామ.. రామ రామ రామ ఉయ్యాలో.. ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ తదితర బతుకమ్మ పాటలు హోరెత్తాయి. బతుకమ్మ ఆటపాటలతో పాటు దాండియా, కోలాటాలు ఆడుతూ.. పాడుతూ చివరకు వాటిని నిమజ్జనం చేశారు. షాద్‌నగర్‌లో బతుకమ్మ ఉత్సవాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి పాల్గొన్నారు. ప్రకృతి, పూలను దైవంగా భావించి కొలిచే సంప్రదాయం మనదని ఆయన అన్నారు.



ముడిమ్యాలలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



షాద్‌నగర్ వీరాంజనేయ స్వామి దేవాలయంలో..



నార్సింగిలో బతుకమ్మలతో మహిళలు



షాబాద్‌లో బతుకమ్మలతో ఊరేగింపుగా..



బతుకమ్మనెత్తుకున్న వీర్లపల్లి



ఖానాపూర్‌లో..



షాబాద్‌లో చిన్నారి



కోకాపేటలో..



గండిపేట జలాశయంలో నిమజ్జనం చేస్తూ..

మేమున్నాం.. మీకు తోడుగా..

రాజేంద్రనగర్: 8008573330
శంకర్‌పల్లి : 8008573266
షాద్‌నగర్: 8008573907
శంషాబాద్: 9963096353

షాద్‌నగర్ న్యూటౌన్, కేశంపేట, న్యూస్‌టుడే

? షాద్‌నగర్ పురపాలిక 8 వవార్డు వెంకటరమణ కాలనీలోని పార్కు సమీపంలో మురుగునీరు దిగువకు పారక నెలనుంచి దుర్గంధం వెదజల్లుతోంది. పందుల సంచారం, విష కీటకాలతో కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. –పాండు, వెంకటరమణ కాలనీవాసి

✓ కాలనీకి పురపాలిక సిబ్బందిని పంపించి సమస్య తీవ్రత పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తాం. కాలనీవాసుల ఇబ్బందులు తొలగిస్తాము. –వెంకన్న, పురపాలిక కమిషనర్

? మా వ్యవసాయ పొలంలో నుంచి వెళ్లే విద్యుత్తు లైన్‌లో వైర్లు పూర్తిగా కిందికి సాగి ప్రమాదకరంగా ఉన్నాయి. అక్కడ పనులు చేసుకోవడం ఇబ్బందిగా ఉంటుంది. – శ్రీశైలం, రైతు, ఎక్లాస్‌ఖాన్‌పేట

✓ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు వైర్లను సరిచేసేందుకు చర్యలు చేపడతాం. అవసరమైతే అక్కడ అదనంగా స్తంభాన్ని ఏర్పాటు చేస్తాం. –ఈశ్వర్, ట్రాన్స్‌కో ఏఈ, కేశంపేట

వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వినతి

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ సాయిబాబానగర్, బాబుల్‌రెడ్డినగర్ ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నామని అక్కడ స్థానికులు వాపోయారు. వెంటనే అక్కడ వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ వెంకటేష్ ఆధ్వర్యంలో వారు గురువారం సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. కొన్ని రోజులుగా తమ బస్తీల్లో చాలాచోట్ల విద్యుత్ దీపాలు వెలగండలేని, దీనిపై గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా పటింటచుకోలేదన్నారు. దసరా పండగ నేపథ్యంలో అధికారులు వాటిని వెంటనే బాగు చేసేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంతో యువతకు ప్రయోజనం



కార్యక్రమంలో తన అనుభవాలను వివరిస్తున్న మెక్సికో విద్యార్థి బ్లాంకో దియాజ్

నార్సింగి, న్యూస్‌టుడే: రేపటి యువత గ్లోబల్ సిటిజన్స్‌గా ఎదగటానికి యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం తోడ్పడుతుందని రోటరీక్లబ్ ఆఫ్ కోకాపేట ఏకం ప్రతినిధులు అన్నారు. రోటరీ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో భాగంగా నగరానికి వచ్చిన బ్రెజిల్ దేశానికి చెందిన విద్యార్థి ఆథర్ కిరెల్ఫ్ దాట్ మౌర, మెక్సికోకు చెందిన బ్లాంకో దియాజ్‌లతో గురువారం మైహోం అపార్టుమెంట్ క్లబ్ హౌజ్‌లో సెకండరీ స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ విద్యార్థులు రోటరీక్లబ్ సభ్యుల ఇళ్లలో ఏడాదిపాటు ఉంటారు. ప్రోగ్రాం సలహాదారు రొటేరియన్ నరేష్ సి.రమణ్ ఈ కార్యక్రమం ఉద్దేశాలను వివరించారు. రోటరీక్లబ్ ఆఫ్ కోకాపేట ఏకం అధ్యక్షుడు రవి ముత్తినేని మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా 9 వేల మంది విద్యార్థులకు రోటరీక్లబ్‌ల ద్వారా ఈ ఏడాది యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం తోడ్పడుతోందని వివరించారు. కార్యక్రమంలో మైహోం అవతార్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీధర్ చేబ్రోలు, అసిస్టెంట్ గవర్నర్ రొటేరియన్ రమణిరావు తదితరులు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై శ్రీవారు



చేవెళ్ల, న్యూస్‌టుడే: చేవెళ్లలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారిని హనుమంత వాహనంపై ఊరేగించారు. మహిళా భక్తులు ఊరేగింపునకు వాహనం ముందట కోలాటం ఆడుతూ కనిపించారు. అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పుణ్యభూమి రక్షణ బాధ్యత అందరిదీ: ఆరెస్సెస్



కొత్తూరులో స్వయం సేవకుల పథసంచాలన్

కొత్తూరు: ప్రపంచంలో ఏ దేశంలో లేని సరిహద్దులు ప్రకృతి పరంగా భారత దేశానికి మాత్రమే ఉన్నాయని, ప్రకృతి ప్రసాదించిన పుణ్యభూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పాలమూరు మాననీయ సంఘ్ సంచాలకుడు వసంతం వెంకటేష్ అన్నారు. ఆరెస్సెస్ ఆధ్వర్యంలో గురువారం కొత్తూరులో పథసంచాలన్ నిర్వహించారు. షాద్‌నగర్ గ్రామీణ ఖండ్ మండలాల నుంచి 100 మంది స్వయం సేవకులు ఇందులో పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో విజయదశమి ఉత్సవం చేపట్టారు. పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ ప్రకృతికి అనుకూలమైన వస్తువులు వాడాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో పట్లోళ్ల సుభాష్ రెడ్డి, బండి కిరణ్ కుమార్, ఎర్రవెల్లి నాగరాజు చారి, రఘుపతి రెడ్డి పాల్గొన్నారు.

కొత్త పురపాలికల ఏర్పాటున్నట్టా..? లేనట్టా..?

ఏ నిర్ణయమూ ప్రకటించని ప్రభుత్వం ● చేవెళ్ల నియోజకవర్గంలో సందిగ్ధత

'హైదరాబాద్ మహానగరానికి అంతర్భాగంగా మారిన శివారుల్లో కొత్త పురపాలికల ఏర్పాటుపై ఎలాంటి కదలిక కనిపించడం లేదు. గతంలోని ప్రతిపాదనలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాన్ని ప్రకటించలేదు. ఇక అవుటర్ రింగు రోడ్డు లోపలున్న పుర, నగరపాలికలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసే ప్రతిపాదనపై దాదాపుగా నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం.. ఓఆర్ఆర్ బయటున్న మేజర్ పంచాయతీలను పురపాలికలుగా మార్చాలన్న ప్రతిపాదనపై నాన్చుడు ధోరణి అవలంబిస్తోంది. మరోవైపు పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని కసరత్తు చేపట్టి ఇప్పటికే ఓటరు జాబితాను వెలువరించింది'



మొయినాబాద్ గ్రామం

మొయినాబాద్, న్యూస్‌టుడే: చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో మొయినాబాద్, శంకర్‌పల్లి, చేవెళ్ల, షాబాద్, నవాబ్‌పేట మండలాలున్నాయి. నియోజకవర్గంలో ఇప్పుడు శంకర్‌పల్లి మాత్రమే మున్సిపాలిటీగా కొనసాగుతోంది. చేవెళ్లను సైతం మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని యోచించినప్పటికీ ప్రభుత్వం నుంచి జీవో జారీ ఆలస్యం కావడంతో పంచాయతీ ఎన్నికలు జరపాల్సి వచ్చింది. పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ముగిసి ఆరు నెలలవుతుండటంతో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. చేవెళ్ల, మొయినాబాద్‌లను మున్సిపాలిటీలుగా మార్చాలన్న గత ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టేసినట్లుగా కనిపిస్తోంది. దీంతో ఈసారీ పంచాయతీ ఎన్నికలే నిర్వహించే పరిస్థితులు నెలకొన్నాయి.

గతంలో ఇదీ ప్రతిపాదన..

☛ చేవెళ్ల మండలంలోని పామెన, మల్లారెడ్డిగూడ, చేవెళ్ల, దామరగిద్ద, ఇబ్రహీంపల్లి, కేసారం, మల్కాపూర్, కందవాద, దేవునిఎర్రవల్లి గ్రామాలతో చేవెళ్ల మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

☛ మొయినాబాద్ కేంద్రంగా మున్సిపాలిటీ ఏర్పాటు అంశం తెరపైకి వచ్చింది. ప్రధానంగా ఈ మండలం బాహ్యవలయ రహదారికి ఆనుకొని ఉండటం, మొయినాబాద్ పంచాయతీ పరిధి విస్తరించడమే కాకుండా ఇక్కడ 15కు పైగా కొత్త కాలనీలు వెలిశాయి. మండలంలోని పెద్దమంగళారం, అమీర్‌గూడ, అప్పోజిగూడ, చిలుకూరు, ముర్తుజగూడ, సురంగల్ గ్రామాలను మొయినాబాద్ కేంద్రంగా మున్సిపాలిటీ ఏర్పాటు చేయాలని తలపోయగా ఎన్కేపల్లి, హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ, బాకారంజాగీర్, కాశీంబౌలి, అమ్డాపూర్ గ్రామపంచాయతీలను అజీజ్‌నగర్ పురపాలిక పేరిట ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించి నివేదించారు.

☛ ఇరవై ఏళ్ల క్రితమే కనకమామిడి కేంద్రంగా మండలాన్ని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉండగా ఇదీ బుట్టదాఖలుకే పరిమితమైంది. ప్రతిపాదత కనకమామిడి మండలంలో కంచిమోనిగూడ, కనకమామిడి, వెంకటాపూర్, శ్రీరాంనగర్, చాకలిగూడ, కేతిరెడ్డిపల్లి, అప్పారెడ్డిగూడ, చిన్నషాపూర్, సజ్జన్‌పల్లి, తోల్కట్ట, ఎత్బార్‌పల్లి, నక్కలపల్లి, మేడిపల్లి, కుత్బుద్దీన్‌గూడ, ఎల్కగూడ, వీరన్నపేట్, చిన్నమంగళారం, చందానగర్, రెడ్డిపల్లి, మోత్కుపల్లి గ్రామాలను చేర్చాలని తలపోశారు.



కాశీ అన్నపూర్ణ సత్రం కమిటీ ఉపాధ్యక్షుడిగా మలిపెద్ది శంకర్, కార్యవర్గ సభ్యుడిగా మలిపెద్ది శ్రీనివాసులు ఇటీవల ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో వారిని గురువారం షాద్‌నగర్‌లో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. –నూస్‌టుడే, షాద్‌నగర్ న్యూటౌన్

కార్మికులకు దుస్తుల అందజేత



కార్మికులకు దుస్తులు అందజేస్తున్న కార్పొరేటర్ పద్మావతిపాపయ్యయాదవ్

బండ్లగూడజాగీర్, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య నిర్వహణ కార్మికులను మానవతాదృక్పథంతో ఆదుకోవాలని బండ్లగూడజాగీర్ కార్పొరేషన్ ఏడో డివిజన్ కార్పొరేటర్ క్యాతం పద్మావతిపాపయ్యయాదవ్ అన్నారు. దసరా పండుగను పురస్కరించుకొని గురువారం కార్మికులకు సొంతంగా దుస్తులు, పండుగ వస్తువులు అందించారు.


కాన్షీరాం సేవలు ఎనలేనివి

కొందుర్గు, న్యూస్‌టుడే: బహుజన సమాజ నిర్మాణానికి బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ చేసిన సేవలు ఎనలేనివని ధర్మసమాజ్ పార్టీ మండల కన్వీనర్ డప్పు రవీందర్ అన్నారు. కాన్షీరామ్ వర్ధంతి సందర్భంగా గురువారం కొందుర్గులో ఆయన చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెంటయ్య, సాయన్న, రాములు, నవీన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

'లక్ష్యం మేరకు భాజపా సభ్యత్వాలు చేపడదాం'

షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి లక్ష్యం మేరకు భాజపా సభ్యత్వాల నమోదు చేపడదామని ఆ పార్టీ సభ్యత్వ నమోదు అభియాన్ జిల్లా సహ ఇన్‌ఛార్జి కట్టా సుధాకర్ పిలుపునిచ్చారు. షాద్‌నగర్‌లో గురువారం జరిగిన సభ్యత్వ నమోదు సమీక్షా సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి పోలింగ్‌బూత్‌లో 200కు పైగా సభ్యత్వాలను చేయించాలని, 13, 14, 15 తేదీల్లో అన్ని బూత్‌ల పరిధిలో ఇంటింటికి తిరిగి సభ్యత్వ నమోదు చేపట్టాలని సూచించారు. కష్టపడిన వారికి పార్టీలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో సభ్యత్వ నమోదు నియోజకవర్గ ఇన్‌ఛార్జి అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సుధాకర్‌రావు, భూపాలచారి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతగా అమ్మవారు



చేవెళ్ల మండలం గొల్లగూడలో భక్తుల పూజలు

బండ్లగూడజాగీర్, షాద్‌నగర్, చేవెళ్ల, కొత్తూరు, నందిగామ, షాబాద్, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన గురువారం అమ్మవారు దుర్గామాతగా దర్శనమిచ్చారు. వివిధ దేవాలయాలతో పాటు కూడళ్లలో ఏర్పాటు చేసిన మండపాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆయా మండపాల వద్ద అన్నప్రసాద వితరణ చేపట్టారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ బండ్లగూడజాగీర్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసిన దుర్గామాతల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఆయన వెంట పీఏసీఎస్ ఛైర్మన్ బొర్ర రాందాస్ ముదిరాజ్, బి.మహేందర్‌గౌడ్ తదితరులున్నారు. షాద్‌నగర్, కొత్తూరు, నందిగామ మండలం వీర్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన మండపాల్లో జరిపిన పూజల్లో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన వెంట షాద్‌నగర్ మున్సిపల్ ఛైర్మన్ కొందూటి నరేందర్ తదితరులున్నారు. షాబాద్‌లోని గణేష్ చౌక్ మండపం వద్ద ఏర్పాటు చేసిన మండపంలో ఎమ్మెల్యే యాదయ్య పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



బండ్లగూడజాగీర్‌లో పూజల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



షాద్‌నగర్‌లో దుర్గామాత పూజలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి



షాబాద్‌లో ఎమ్మెల్యే యాదయ్య, గ్రామస్థులు

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

నందిగామ, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన నందిగామ పాత జాతీయ రహదారిపై బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వివరాల ప్రకారం.. నందిగామకు చెందిన యాదగిరిగౌడ్(49) పని నిమిత్తం షాద్‌నగర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్లి రాత్రి సమయంలో తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో కమల్ వైనరీస్ పరిశ్రమ సమీపంలో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలు కావడంతో షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కారు ఢీకొట్టిన ప్రమాదంలో వృద్ధురాలు..

మొయినాబాద్, న్యూస్‌టుడే: కారు ఢీకొన్న ప్రమాదంలో వృద్ధురాలు మృతిచెందిన ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. చిలుకూరు గ్రామానికి చెందిన డప్పు రుక్కమ్మ(75) బాలాజీ దేవాలయం వద్ద భిక్షాటన చేస్తూ జీవిస్తోంది. మధ్యాహ్నం ఆలయం వద్ద భిక్షాటన చేస్తుండగా మితిమీరిన వేగంతో వచ్చిన కారు ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రుక్కమ్మకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది.

పత్తికుంటలో ఇనుప చువ్వలకు వెళ్లి వ్యక్తి మృతి

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: పత్తికుంటలో ఇనుప చువ్వల కోసం వెళ్లిన ఒకరు మృతిచెందిన ఘటన రాజేంద్రనగర్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్సై పాండునాయక్ వివరాల ప్రకారం.. హనుమాన్‌నగర్‌కు చెందిన నిరంజన్(45)కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కూలి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 8న ఉదయం పనికి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లాడు. సాయంత్రమైనా తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారందరిని వాకబు చేశారు. గురువారం పత్తికుంటలో మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వెళ్లిచూసి నిరంజన్‌గా గుర్తించారు. ఇటీవల గణేష్ నిమజ్జనాలు జరిగిన నేపథ్యంలో కుంటలో ఉన్న ఇనుమచువ్వలు తీసుకోవడానికి వెళ్లి మృతిచెందినట్లు భావిస్తున్నారు.

స్వగ్రామానికి బయల్దేరిన యువకుడి అదృశ్యం

శంషాబాద్, న్యూస్‌టుడే: శంషాబాద్ మండల పరిధిలో ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. శంషాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా అప్పారెడ్డిపల్లికి చెందిన వెంకటయ్య- అలివేలు దంపతులు రోజువారీ కూలీలు. ఉపాధి కోసం ఇటీవల కుమారుడితో కలిసి శంషాబాద్‌కు వచ్చి తొండుపల్లిలో ఉంటున్నారు. ఈ నెల 1న వారి కుమారుడు జగదీష్ స్వగ్రామానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయల్దేరి అదృశ్యమయ్యాడు. తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆచూకీ దొరకలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదుతో గురువారం పోలీసులకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విమానాశ్రయంలో క్యాబ్ డ్రైవర్‌పై దాడి

శంషాబాద్: క్యాబ్ డ్రైవర్‌పై పదునైన ఇనుపరాడ్‌తో ఓ సూపర్‌వైజర్ దాడి చేసిన సంఘటన శంషాబాద్ విమానాశ్రయంలో గురువారం చోటు చేసుకుంది. ఎయిర్‌పోర్ట్ అధికారుల వివరాల ప్రకారం.. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధి పహాడిషరీఫ్‌కు చెందిన అష్ఫాక్ ఓహెచ్‌ఎం క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఎప్పటిలా ఎయిర్‌పోర్ట్ డీ1 పార్కింగ్ వద్ద క్యాబ్‌లో ప్రయాణికులను ఎక్కించుకునే క్రమంలో ఓహెచ్‌ఎం క్యాబ్ కంపెనీ సూపర్‌వైజర్ స్టాలిన్‌తో గొడవ జరిగింది. ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తుడైన స్టాలిన్ ఇనుప రాడ్‌తో అష్ఫాక్ ముఖంపై బలంగా బాదాడు. తీవ్ర గాయాలు కావడంతో అతడు స్పృహ కోల్పోయాడు. తోటి క్యాబ్ డ్రైవర్లు వెంటనే ఆయన్ను ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆర్జీఐఏ పోలీసులు కేసు నమోదు చేశారు.

యువత క్రీడల్లో రాణించాలి



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న చేవెళ్ల ఏసీపీ కిషన్, ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి

షాబాద్, న్యూస్‌టుడే: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడల్లో రాణించాలని చేవెళ్ల ఏసీపీ కిషన్ సూచించారు. గురువారం షాబాద్ పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో పీఆర్ఆర్ క్రీడా ప్రాంగణంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఇందులో 12 జట్లు పాల్గొనగా కుమ్మరిగూడ జట్టు ప్రథమ, అంతారం ద్వితీయ, షాబాద్ జట్టు తృతీయ విజేతలుగా నిలిచాయి. విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సైలు నవీన్‌రెడ్డి, సతీష్, ఏఎస్సై రాంలాల్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభం

తలకొండపల్లి, న్యూస్‌టుడే: తలకొండపల్లి మండలం రామకృష్ణపురం గ్రామంలో ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధి పనులను గురువారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. శతాబ్దిటౌన్ షిప్ అధినేత కాసు శ్రీనివాస్‌రెడ్డి.. ఆలయ అభివృద్ధికి రూ.20 లక్షలు ఇవ్వడం అభినందనీయమన్నారు.

ఆమనగల్లు, కడ్తాల్, న్యూస్‌టుడే: 40మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అందించారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యాట నర్సింహ తదితరులు పాల్గొన్నారు.


ముఖద్వారం నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

మహేశ్వరం

• మహేశ్వరం • ఇబ్రహీంపట్నం • కల్వకుర్తి

పిస్తోల్ షూటర్ మణిశంకర్‌కు సత్కారం

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: డిగ్రీ చదువుతూ పిస్తోల్ షూటింగ్‌లో రాణిస్తున్న అబ్దుల్లాపూర్‌మెట్ జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీకి చెందిన కిక్కుర మణిశంకర్‌యాదవ్‌ను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సత్కరించారు. ఈనెల 13 నుంచి జరిగే నేషనల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో తలపడేందుకు మణిశంకర్ వెళుతున్నాడు.

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం ప్రజాభవన్‌లో 101మంది లబ్ధిదారులకు రూ.33.16 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.


మణిశంకర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఆధ్యాత్మిక కేంద్రం.. శివగంగ రాజరాజేశ్వరుడి క్షేత్రం

మహేశ్వరం, న్యూస్‌టుడే: వందల ఏళ్ల చరిత్ర కలిగిన ప్రతిష్ఠాత్మక ఆలయం. నాటి శిల్పులు అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన ఆధ్యాత్మిక కేంద్రం. చూడముచ్చటైన ఈ కోవెల నీటి కొలను మధ్యలో నిర్మించారు. చూపరులను అబ్బురపరిచే అందమైన కోనేరు.. చుట్టూ అష్టాదశ లింగాలతో కూడిన ఆలయాలు.. మధ్యలో సమ్మోహన రూపంతో రాజరాజేశ్వరస్వామి.. ఆయన నీడలో ఆలయం దిగువ భాగంలో కొలువైన రాజరాజేశ్వరీదేవి అమ్మవారు.. ఈ దేవతామూర్తులను దర్శించుకునేందుకు కోనేటి మధ్యన వంతెన. ఇదీ మహేశ్వరంలో భక్తులకు కనిపించే సుందర దృశ్యం. శివగంగ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఏటా వైభవంగా నిర్వహిస్తారు. ఇక్కడ శైవ సంప్రదాయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగుతాయి. పాండవులు జమ్మిచెట్టు మీద దాచిన ఆయుధాలను తీసుకుని యుద్ధంలో శత్రువులను ఓడించిన వృత్తాంతాన్ని గుర్తు చేసుకుంటూ దసరా రోజు సాయంత్రం ప్రజలు ఆలయ ప్రాంగణంలో జమ్మి చెట్టుకు పూజలు చేస్తారు. అనంతరం శమీపత్రాలను తల్లిదండ్రులు, పెద్దలకు సమర్పించి వారి ఆశీర్వాదం తీసుకుంటారు. ఆలయం ముందు రావణ దహనం చేపడతారు. ప్రతిరోజు భక్తులకు అన్నదానం చేస్తారు. కొత్తగా పెళ్లైన ఆడబిడ్డలు పుట్టింటికి వస్తారు.. ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ పండగ నిర్వహిస్తారు. రకరకాల పిండివంటలు చేసుకుంటారు. పరిసరాల్లోని ప్రతి గ్రామంలో నెలకొల్పే దుర్గామాత మండపాల వద్ద కోలాటాలు, బతుకమ్మ ఆటలతో సాంస్కృతిక శోభ ఉట్టిపడుతుంది.


విద్యుత్తు దీపాలంకరణలో ఆలయం

దేవీశరణం గచ్ఛామి..

ఆధ్యాత్మిక శక్తి ప్రపంచాన్ని ముందడుగు వేసేలా చేస్తోంది. శక్తికి మరోపేరు అమ్మవారు. అమ్మవారిని ఏకాగ్రచిత్తంతో ఆరాధిస్తే ధైర్యం ఆవహిస్తుంది. మంచి పనులకు మనసును పురిగొల్పుతుంది. శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా రాజరాజేశ్వరీ క్షేత్రంలో దశమి వరకు రోజుకో రకంగా దివ్యమైన పూజలు జరుగుతున్నాయి. రంగారెడ్డి జిల్లాతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల నుంచి భారీగా తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరాలను విద్యుత్తు దీపాలతో అలంకరించారు.

రోజుకో అవతారంలో దర్శనం..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో తొమ్మిది రోజులు అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో విశేష పూజలు చేస్తున్నారు.


రాజరాజేశ్వరుడు, రాజరాజేశ్వరీ అమ్మవారు

మత్స్యావతార వేంకటేశ్వరుడి చెంత శరన్నవరాత్రి ఉత్సవాలు

మీర్‌పేట, న్యూస్‌టుడే: మీర్‌పేట కార్పొరేషన్ జిల్లెలగూడలోని మత్స్యావతార వేంకటేశ్వరస్వామి ఆలయం అరుదైన విశిష్టత కలిగినదిగా ప్రసిద్ధి. అయిదు వందల ఏళ్ల క్రితం కాకతీయుల కాలంలో నిర్మించిన ఈ ఆలయంలో వేంకటేశ్వరుడు మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిస్తారు. దశావతారాల్లో తొలిదైన ఈ అవతారంలో స్వామి వారిని దర్శించుకొనే భాగ్యం ప్రపంచంలో ఈ ఒక్క ఆలయంలోనే ఉందని స్థలపురాణం చెబుతోంది. విష్ణుమూర్తిని మత్స్యావతారమూర్తిగా, వేంకటేశ్వరమూర్తిగా కొలిచేది జిల్లెలగూడ ఆలయంలో నేనని అంటారు. ఈ దేవాలయానికి ఉన్న మరో ప్రత్యేకత ఉత్తరం అభిముఖంగా నిర్మించడం. ఏడాదికి ఒకసారి మాత్రమే వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఇతర ఆలయాల్లో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఉంటుంది. అందుకోసం ఆయా ఆలయాల్లో స్వామివారి ఉత్సవ మూర్తులను ఉత్తర దిశలో ఏర్పాటు చేయడం ఆనవాయితీ. వైకుంఠ ఏకాదశి మినహా మిగతా రోజుల్లో ఉత్తర ద్వార దర్శనం ఎక్కడా ఉండదు. ఇక్కడ మాత్రం నిత్యం మూల విరాట్ స్వయంగా ఉత్తర దిశలోనే భక్తులకు దర్శనమిస్తారు. ఆలయ రాజగోపురం ఉత్తర దిశలోనే నిర్మించడం విశేషం. దీంతో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు తప్పనిసరిగా ఉత్తర ద్వారం నుంచి ఆలయ ప్రవేశం చేయాల్సి ఉంటుంది. గర్భాలయానికి ఆనుకొని ఉన్న చింతచెట్టు మూడు వందల ఏళ్లుగా ఉన్నట్లు పెద్దలు చెబుతుంటారు. ప్రాంగణంలోని అద్దాల మేడలోని విష్ణుపురాణం, ఆళ్వారులు, చరిత్ర తెలిపే పలు చిత్రాలను ప్రఖ్యాత తంజావూరు చిత్రకారులు, శిల్పులు ప్రత్యేకమైన చెట్ల జిగురు, రంగుల మిశ్రమంతో చిత్రించారు. నిజాం నవాబు వద్ద 1901లో ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన సర్ కిషన్‌ప్రసాద్ ఈ ఆలయాన్ని ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి చేసినట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది. ఆలయ ప్రాంగణంలో పెద్ద తోట, భవనం, కోనేరు ఉన్నాయి. ఆ కాలంలో కిషన్‌ప్రసాద్ భార్య రాణి సాహెబా ఏటా వైశాఖ శుక్ల నవమి నుంచి పది రోజులపాటు జరిగే జాతర సమయంలో ఈ భవనంలోనే బస చేసేవారట. ఇప్పటికీ ప్రతి ఏడాది అదే సమయంలో పది రోజులపాటు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. శ్రీమహావిష్ణువు మత్స్యావతారం దాల్చి సోమకాసురుడి నుంచి వేదాలను రక్షించినట్లు పేర్కొంటారు. వేదాలకు హిందూ మతంలో ఎంతో ప్రాధాన్యం ఉందని తెలిసిందే. మత్స్యావతార పూజతో విద్య, ఐశ్వర్యం, సంపూర్ణ ఆయురారోగ్యం, అభివృద్ధి లభిస్తాయని భక్తుల విశ్వాసం. ఇప్పటికీ కిషన్‌ప్రసాద్ వంశీయులే ఈ ఆలయానికి వ్యవస్థాపక ధర్మకర్తలుగా వ్యవహరిస్తున్నారు.


ఆలయ ముఖద్వారం


స్వామి మూలవిరాట్


కొలువుదీరిన అమ్మవారు

ప్రత్యేక పూజలతో..

ఆలయ ప్రాంగణంలోని శివాలయం వద్ద ఏటా దసరా ఉత్సవాలు గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం దశాబ్దాలుగా ఆనవాయితీ. తొమ్మిది రోజుల పాటు అమ్మవారు రోజుకో అవతారంలో దర్శనమిస్తున్నారు. ఉదయం, సాయంత్రం ఇక్కడ అమ్మవారికి ప్రత్యేక అలంకారం, నైవేద్యాలతో పూజలు, భజనలు నిర్వహిస్తున్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం కొత్త కమిటీ ఎన్నిక

తుర్కయంజాల్ పురపాలిక, న్యూస్‌టుడే: తుర్కయంజాల్ మున్సిపాలిటీ కోహెడ గ్రామం రెడ్డి సంక్షేమ సంఘం కొత్త కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా బద్దం కృష్ణారెడ్డి, రామిడి జంగారెడ్డి, ఉపాధ్యక్షులుగా కొత్త రాజిరెడ్డి, నల్ల యాదిరెడ్డి, కోశాధికారిగా సింగిరెడ్డి రాంరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఏనుగు వెంకట్‌రెడ్డి, పలువురు సభ్యులు ఎన్నికయ్యారు.

ముగిసిన మంచినీటి సహాయకుల శిక్షణ

మహేశ్వరం, న్యూస్‌టుడే: మహేశ్వరం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన గ్రామ మంచినీటి సహాయకులకు నైపుణ్య శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్ఈ ఆంజనేయులు, ఈఈలు రాజేశ్వర్, నర్సింహులుగౌడ్, డీఈఈలు జగన్మోహన్‌రెడ్డి, వినయ్, ఏఈలు పాల్గొని పలు సూచనలు చేశారు.

పాడి రైతులకు దసరా బోనస్

యాచారం: యాచారం మండలం కుర్మిద్ద పాడి రైతులకు దసరా బోనస్ అందజేసినట్లు పాల ఉత్పత్తిదారుల సొసైటీ ఛైర్మన్ బందె మహేందర్‌రెడ్డి తెలిపారు. 90 మంది రైతులకు రూ.2.50లక్షల నగదు పంపిణీ చేసినట్లు చెప్పారు.

అనారోగ్యంతో టిస్ విద్యార్థి బలవన్మరణం

తుర్కయంజాల్ పురపాలిక, న్యూస్‌టుడే: బ్రాహ్మణపల్లి రోడ్డులోని టిస్ కళాశాలలో చదువుతున్న అలోక్ కుమార్(28) ఎంఏ చదువుతున్నాడు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన కుమార్ తుర్కయంజాల్‌లో ఓ అద్దె గదిలో ఉంటున్నాడు. బుధవారం రాత్రి తాను ఉంటున్న గదిలో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. అనారోగ్యం కారణంతోనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడినట్లు విచారణలో తేలిందని ఎస్సై రాజు తెలిపారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

ఆదిభట్ల, న్యూస్‌టుడే: ఆదిభట్ల పురపాలిక కార్యాలయం ఆవరణలో కార్మికులకు ఛైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ యాదగిరి, కమిషనర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా సద్దుల బతుకమ్మ వేడుకలు

మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని ఆయా గ్రామాల్లో గురువారం సందడిగా సద్దుల బతుకమ్మ ఉత్సవాలు జరిగాయి. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ కూడళ్లలో మహిళలు ఆటపాటలతో కోలాహలంగా వేడుకలు నిర్వహించారు. దేవాలయాల వద్ద బతుకమ్మలను ఉంచి ఆట పాటలతో సందడి చేశారు. అనంతరం చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. – న్యూస్‌టుడే బృందం


వాసవీ కాలనీలో


దేవునిపడకల్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు






కొత్తగూడలో..


అల్మాపురి కాలనీలో ..


అబ్దుల్లాపూర్‌మెట్‌లో

నవరాత్రి పూజలు

మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని ఆలయాల్లో అమ్మవారు గురువారం దుర్గాదేవిగా దర్శనమిచ్చారు.


జాపాలలో దుర్గామాతగా ఓ చిన్నారి..


తారామతిపేట్‌లోని మహంకాళి ఆలయంలో...


ఆమనగల్లు వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి


తారామతిపేట్‌లోని మహంకాళి ఆలయంలో...


కడ్తాల్‌లో జరిగిన అన్నదానంలో మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్

సరూర్‌నగర్, ఆర్కేపురం, కడ్తాల, తుర్కయంజాల్ పురపాలిక, న్యూస్‌టుడే:

? సరూర్‌నగర్ డివిజన్‌లోని ఎస్‌బీఐ కాలనీలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. సమస్య పరిష్కరించండి.
– దేవరాజు, విజయపురి కాలనీ

✓ సిబ్బందిని పంపించి కుక్కలను పట్టిస్తాం.
–సుజాత, ఉప కమిషనర్, సరూర్‌నగర్ సర్కిల్

? అల్కాపురి కాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది
– సుమన్, అల్కాపురి కాలనీ

✓ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం– సుజాత, సరూర్‌నగర్, సర్కిల్ డీసీ

? గోవిందాయపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది.
– శంకర్‌నాయక్, గోవిందాయపల్లి

✓ రహదారి పనులకు నిధులు రావాలి. వచ్చిన వెంటనే పనులు చేస్తాం.
– పరమేశ్, ఏఈ, పంచాయతీరాజ్‌శాఖ, కడ్తాల్

? తుర్కయంజాల సూరజ్‌నగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారు. –సతీష్, స్థానికుడు

✓ పనులు పూర్తి చేయిస్తాం. –చంద్రశేఖర్, ఏఈఈ, తుర్కయంజాల్

స్పందనకు వందనం

పహాడీషరీఫ్, న్యూస్‌టుడే: ఈనెల 5న మేమున్నాం మీకు తోడుగాలో జల్‌పల్లి పీ7 రహదారి మధ్యలో కొట్టేసిన కొమ్మలను అక్కడే వదిలేశారని, వాకర్లకు ఆటంకంగా ఉందని వార్త ప్రచురితమైంది. దీనికి బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ పారిజాత స్పందించారు. అడ్డుగా ఉన్న కొమ్మలను తొలగించారు.

విమానాశ్రయంలో క్యాబ్ డ్రైవర్‌పై దాడి

శంషాబాద్, న్యూస్‌టుడే: క్యాబ్ డ్రైవర్‌పై పదునైన ఇనుపరాడ్‌తో ఓ సూపర్‌వైజర్ దాడి చేసిన సంఘటన శంషాబాద్ విమానాశ్రయంలో గురువారం చోటు చేసుకుంది. ఎయిర్‌పోర్ట్ అధికారుల వివరాల ప్రకారం.. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధి పహాడిషరీఫ్‌కు చెందిన అష్పాక్ ఓహెచ్‌ఎం క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఎప్పటిలా ఎయిర్‌పోర్ట్ డీ1 పార్కింగ్ వద్ద క్యాబ్‌లో ప్రయాణికులను ఎక్కించుకునే క్రమంలో ఓహెచ్‌ఎం క్యాబ్ కంపెనీ సూపర్‌వైజర్ స్టాలిన్‌తో గొడవ జరిగింది. ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తుడైన స్టాలిన్ ఇనుప రాడ్‌తో అష్పాక్ ముఖంపై బలంగా బాదాడు. తీవ్ర గాయాలు కావడంతో అతడు స్పృహ కోల్పోయాడు. తోటి క్యాబ్ డ్రైవర్లు వెంటనే ఆయన్ను ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆర్జీఐఏ పోలీసులు కేసు నమోదు చేశారు.

సీ-డాక్‌లో ఉపాధ్యాయులకు శిక్షణ

మహేశ్వరం, న్యూస్‌టుడే: హార్డ్‌వేర్ సీ-డాక్‌లో ఎలక్ట్రానిక్స్ మరియు ఐసీటీ అకాడమీ.. జావా డిమిస్టిఫైడ్ 5 రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎఫ్‌డీపీ) నిర్వహించింది. పలు రాష్ట్రాల నుంచి ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్(ఐటీఐ)పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో ఉపాధ్యాయులు, స్కూల్ టీచర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్.వి.కె.నాగేష్, ఎ.పుల్లయ్య, డా.పి.ఆర్.లక్ష్మి, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా పీఠంలో కమిషనర్ పూజలు

మీర్‌పేట న్యూస్‌టుడే: మీర్‌పేటలోని సాయిబాబా పీఠంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక పూజలో మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, మేనేజరు చంద్రప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు. ఏఈ శ్రీనివాసులు, రమేష్, రాజు పాల్గొన్నారు.


హిందూ ధర్మ పరిరక్షణకు కృషి

తలకొండపల్లి, న్యూస్‌టుడే: తలకొండపల్లిలో గురువారం ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. హిందూ సంస్కృతి సంప్రదాయాలపై పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏంరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


తలకొండపల్లిలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల ప్రదర్శన

రతన్‌టాటాకు నివాళి

మహేశ్వరం: భారత దిగ్గజ పారిశ్రామికవేత్త దివంగత రతన్‌టాటాకు మన్‌సాన్‌పల్లి చౌరస్తాలో భాజపా నాయకులు గురువారం ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాజపా నాయకులు మాధవచారి, పాపయ్యగౌడ్, యాదయ్య గౌడ్, యాదీష్, ఉపేందర్, మాధవ్, వెంకటేష్‌గౌడ్, మహేష్, విజయ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


మన్‌సాన్‌పల్లిలో నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

కడ్తాల్, న్యూస్‌టుడే: కడ్తాల్‌లో గురువారం భారాస ఆధ్వర్యంలో రతన్‌టాటాకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో ఛైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వీరయ్య, నర్సింహా, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

తలకొండపల్లి, న్యూస్‌టుడే: వెల్జాల్ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో 2006-07లో పదో తరగతి చదివిన వారు గురువారం సమావేశమయ్యారు. అప్పటి ఉపాధ్యాయులు శ్యాంసుందర్‌రావు, అంజయ్య, నరసింహ్మాయ్య, శ్రీనివాసరావు, రాజశేఖర్, హేమచంద్, శంషాదిన్, కృష్ణయ్య, నర్సింహులును పూర్వ విద్యార్థులు సన్మానించారు.

బ్యాంకు ఏర్పాటుకు వినతి

తలకొండపల్లి, న్యూస్‌టుడే: గట్టుఇప్పలపల్లి గ్రామంలో బ్యాంకు ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవికి కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా పండగలు చేసుకోండి


ఇబ్రహీంపట్నంలో గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: తెలుగు ప్రజలు దసరా, దీపావళి పండగలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని భారాస జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సూచించారు. గురువారం భారాస నాయకులు కానుగుల మహేష్.. రూపొందించిన గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు.

కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా దయానంద్‌రెడ్డి

తుర్కయంజాల్ పురపాలిక, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా తుర్కయంజాల్‌కి చెందిన దాసరి దయానంద్‌రెడ్డి నియమితులయ్యారు.



పంటల పరిశీలన

యాచారం: యాచారం మండలం గున్‌గల్, మొగుళ్లవంపు, నందివనపర్తి గ్రామాలలోని వరి, కూరగాయలు, పండ్ల తోటలను వ్యవసాయ శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో ఎల్ కృష్ణ, చంద్రమోహన్, రామ్‌గోపాల్ వర్మ, కిరణ్‌బాబు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఐకి సత్కారం

మంచాల, న్యూస్‌టుడే: మంచాల సీఐగా బాధ్యతలు స్వీకరించిన మధును ఠాణా సిబ్బంది ఘనంగా సత్కరించారు. వివిధ పార్టీల నాయకులు, యువజన సంఘాల నాయకులు సన్మానించారు.

ప్రగతి పనులు ప్రారంభం

బాలాపూర్, న్యూస్‌టుడే: బడంగ్‌పేట శ్రీనిలయ కాలనీలో రూ.18 లక్షలతో చేపడుతున్న సీసీ రహదారి పనులను మేయర్ చిగురింత పారిజాత.. కార్పొరేటర్ ఎస్.అర్జున్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈ వినీల్‌కుమార్ గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.



బంజారాహిల్స్‌లోని రోడ్డు నంబరు 1లో ఏర్పాటైన అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ - న్యూస్‌టుడే, అసిఫ్‌నగర్



దుర్గాదేవిగా కుర్మాం పీఠం ప్రత్యంగిరా అమ్మవారు. - న్యూస్‌టుడే, ఆర్కేపురం



ఎరుపు రంగు చీరలో దుర్గాదేవిగా దర్శనమిచ్చిన పెద్దమ్మతల్లి - న్యూస్‌టుడే, జూబ్లీహిల్స్




నిమ్మకాయల దండలతో సుందరంగా బల్కంపేట ఎల్లమ్మ మూలవిరాట్- న్యూస్‌టుడే, సంజీవరెడ్డినగర్



స్వర్ణకిరీటంతో సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి - న్యూస్‌టుడే, బన్సీలాల్‌పేట్, రాణిగంజ్

సొంతూరులో మొక్కులు.. నగరంలో దోపిడీలు



- రాజధానిలో వరుస చోరీలకు పాల్పడుతున్న ధార్ ముఠా
- పోలీసుల నిఘా తగ్గడం వల్లేనని విమర్శలు

దోపిడీకి ముందు ఎంతో నిష్ఠగా గ్రామ దేవతకు పూజలు చేస్తారు. తమ పని విజయవంతంగా పూర్తవ్వాలని.. కేజీలకు కేజీల బంగారం దోచుకెళ్లాలని ప్రార్థిస్తారు. కత్తులు, ఇతర మారణాయుధాలతో రంగంలోకి దిగుతారు. ఎన్ని రోజులైనా.. ఎన్ని ఇళ్ల తాళాలు పగలగొట్టినా అనుకున్నది సాధించే వరకూ ఆ ప్రాంతాన్ని వదిలిపెట్టరు. అంతా అనుకున్నట్టు జరిగితే మళ్లీ సొంతూరుకు వెళ్లి దేవతకు మొక్కులు సమర్పిస్తారు. ఇదీ దొంగతనాలకు మారుపేరైన ధార్ ముఠా నేపథ్యం. వరుస దోపిడీలకు చిరునామాగా నిలిచే ధార్ గ్యాంగ్ నగరంపై మళ్లీ బుసలు కొడుతోంది. పలువురిపై పీడీ యాక్ట్ ప్రయోగించడం, పోలీసుల కట్టుదిట్టమైన చర్యలతో 2022 జూన్ నుంచి నగరం వైపు కన్నెత్తిచూడని ఈ ముఠా కొద్దిరోజులుగా నగర శివార్లలో తెగబడుతున్నారు.

పగలు రెక్కీ..: మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లా లోని తాండా, కుక్షి పరిధిలో కొన్ని ఆదివాసీ గ్రామాలకు చెందిన ఈ ముఠాలోని సభ్యులు వేర్వేరు రాష్ట్రాలను ఎంపిక చేసుకుని చోరీలు చేస్తుంటారు. ట్రావెల్ బస్సుల్లో కొంపల్లి, మేడ్చల్‌కు చేరుకుంటారు. పగలు రెక్కీ నిర్వహిస్తారు. పోలీసు గస్తీ తక్కువగా ఉండే ప్రాంతాల్లో తాళం వేసిన ఇళ్లలో చోరీలు చేస్తారు. ఒకవేళ ఎవరైనా అడ్డుపడితే రాళ్లతో దాడి చేస్తారు. మారణాయుధాలతో హతమార్చేందుకూ వెనుకాడరు.



తగ్గిన నిఘా..: నిఘా తగ్గడం వల్లే ధార్ ముఠా నగరంలో చోరీలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. మేడిపల్లి, అమీన్‌పూర్, మియాపూర్, హయత్‌నగర్, మేడ్చల్, సూరారం ప్రాంతాల్లో కదలికలు పెరిగాయి. శివారు ప్రాంతాల్లో రాత్రిపూట గస్తీ తగ్గించడం పై స్థానికులు, కాలనీ సంఘాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఈనాడు, హైదరాబాద్

తనిఖీల్లో చిక్కి.. గోదాముల్లో ముక్కి

పట్టుబడిన రేషన్ బియ్యంలో పాడవుతున్నదే ఎక్కువ



ఈనాడు, హైదరాబాద్: రేషన్ దందాలో పట్టుబడుతున్న బియ్యాన్ని ఏళ్లుగా గోదాముల్లో ఉంచడంతో మెట్రిక్ టన్నుల మేర పాడవుతోంది. రెండేళ్లలో రేషన్ దందా నుంచి 774.333 మెట్రిక్ టన్నుల బియ్యం, 59.146 మెట్రిక్ టన్నుల గోధుమలను హైదరాబాద్ జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇలా పట్టుకున్న బియ్యంలో ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ(ఎఫ్ఏక్యూ), నాన్ ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ(నాన్ ఎఫ్ఏక్యూ)గా విభజించి నాన్ ఎఫ్ఏక్యూ బియ్యాన్ని డిస్టిలరీ కంపెనీలకు విక్రయిస్తున్నారు. టెండర్లలో మంచి ధరకు కోట్ చేసిన వారికి అమ్ముతుంటారు. రెండేళ్లుగా విక్రయించకపోవడంతో చాలావరకు బియ్యం పాడైపోయింది. 774.33 మెట్రిక్ టన్నుల బియ్యంలో 644.088 మెట్రిక్ టన్నుల బియ్యం నాన్ ఎఫ్ఏక్యూ బియ్యం, 59.146 మెట్రిక్ టన్నుల గోధుమలలో 20.039 మెట్రిక్ టన్నులు నాన్ ఎఫ్ఏక్యూ ఉందని అధికారులు నిర్ధారించి తాజాగా టెండర్లు ఆహ్వానించారు. గతంలో కిలోకు రూ.15చొప్పున విక్రయించగా ఈసారి రూ.17నుంచి రూ.18వరకు వస్తుందని అధికారుల అంచనా.

అధికారులు దాడుల్లో పట్టుకున్న బియ్యం, గోధుమలు (మెట్రిక్ టన్నుల్లో)

సర్కిల్	సీజ్ చేసిన బియ్యం		సీజ్ చేసిన గోధుమలు	
	ఎఫ్ఏక్యూ	నాన్ ఎఫ్ఏక్యూ	ఎఫ్ఏక్యూ	నాన్ ఎఫ్ఏక్యూ
మలక్‌పేట్	2.711	117.980	1.030	4.323
యాకుత్‌పురా	2.870	251.995	15.000	9.541
చార్మినార్	9.200	57.556	3.150	0.000
నాంపల్లి	7.550	22.680	1.130	0.000
మెహిదీపట్నం	48.190	71.487	5.780	0.500
అంబర్‌పేట్	8.400	39.497	7.400	1.725
ఖైరతాబాద్	33.749	27.650	4.542	0.000
బేగంపేట్	6.350	40.243	0.350	3.950
సికింద్రాబాద్	11.225	15.000	0.725	0.000

సామాజిక మాధ్యమాలు.. మాటల మంటలు

నగర సైబర్‌క్రైమ్‌కు ఫిర్యాదుల వెల్లువ

ఈనాడు, హైదరాబాద్



- హఫీజ్‌పేట్ పరిధిలో గేటెడ్ కమ్యూనిటీకి చెందిన వాట్సాప్ గ్రూపులో కొందరు సభ్యులు, సూచనలిచ్చేవారు. ఇది నచ్చని కొందరు తమను ఉద్దేశించే ఇలా చేస్తున్నారంటూ ప్రతిఘటించి స్పందించటంతో గొడవ ముదిరి కొట్టుకునేంతగా మారింది.
- మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలను లక్ష్యంగా చేసుకొని వాట్సాప్, ఫేస్‌బుక్‌లో పేస్తున్న అభ్యంతరకరమైన పోస్టులపై సైబర్‌క్రైమ్‌లో 10కి పైగా కేసులు నమోదయ్యాయి.

ప్రాణ స్నేహితులను బద్ధశత్రువులుగా మార్చటం నుంచి శాంతిభద్రతల సమస్య సృష్టించే వరకూ సామాజిక మాధ్యమాలు వేదికలుగా మారాయి. వినియోగదారుల నవ్వులాట ఉత్సాహంలో గొడవలు సృష్టించేందుకు సోట నుంచి కొందరు మార్ఫింగ్ ఫొటోలు, తప్పుడు సమాచారంతో పోస్టులు చేశారు. దీన్ని పోలీసులు ముందుగానే గుర్తించటంతో అల్లర్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోగలిగారు. బంజారాహిల్స్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో ఐటీ సెల్ సామాజిక మాధ్యమాల్లో జరిగే విష్ప్రచారాన్ని గుర్తించి కట్టడి చేస్తోంది. అయినా ఏదో ఓ మాధ్యమాల్లో ఎదురయ్యే వ్యక్తిగత దూషణలతో బాధితులు ఫిర్యాదు చేస్తున్నారు. గతేడాది రాజకీయపార్టీలు, నాయకులను దుర్భాషలాడుతూ రూపొందించిన పోస్టులపై 15 కేసులు నమోదైతే.. ఈ ఏడాది ఆ సంఖ్య 200 దాటింది.

చూడకుండా ఫార్వర్డ్ చేసినా అంతే..

నల్గొండ జిల్లాకు చెందిన యువకుడు ఒక ప్రజాప్రతినిధికి వ్యతిరేకంగా కామెంట్స్ చేస్తూ మార్ఫింగ్ ఫొటోతో ఫేస్‌బుక్‌లో షేర్ చేశాడు. దాన్ని పూర్తిగా చదవకుండానే మరొకరు వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశారు. పోలీసుల వద్దకు వచ్చిన ఫిర్యాదుల్లో అధికశాతం చట్టాలపై అవగాహన లేకపోవటం వల్ల ఉంటున్నాయి. ఆ పోస్ట్ తాము రూపొందించకున్నా కేసు ఎలా నమోదు చేస్తారంటూ ప్రశ్నిస్తున్నారని ఒక ఇన్‌స్పెక్టర్ తెలిపారు. తప్పుడు సమాచారం, అసభ్యకర పోస్టులు, వీడియోలను పోస్టు చేస్తున్నవారి జాబితాలో 15-17 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలు ఉంటున్నారని మరో ఇన్‌స్పెక్టర్ ఆందోళన వెలిబుచ్చారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణ



డిజైన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: కొందుర్గు మండలానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఇందులో భాగంగా కలెక్టర్ శశాంకతో కలిసి గురువారం ఆయన ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. శంకుస్థాపన అనంతరం బహిరంగ సమావేశం ఉంటుందన్నారు. శంషాబాద్ డీసీపీ రాజేశ్, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, ఆర్డీవో వెంకటమాధవరావు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

వర్గీకరణ జరిగే వరకు నియామకాలొద్దు: మందకృష్ణ మాదిగ



బౌద్ధనగర్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు అన్ని ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. పార్సిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలులోకి వచ్చిన అనంతరమే పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టుల పరీక్షలను వాయిదా వేయాలన్నారు. ఇప్పటికే నిర్వహించిన గ్రూప్ 4 పరీక్ష ఫలితాలను వర్గీకరణ అయ్యేవరకు విడుదల చేయకుండా నిలిపివేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో నిజాయతీ, బాధ్యత లేదని విమర్శించారు. ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్‌లలో ఎస్సీ వర్గీకరణను ఎందుకు అమలు చేయలేదో చెప్పాలన్నారు. ఈనెల 16న వరంగల్‌లో రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ, మల్లికార్జున మాదిగ పాల్గొన్నారు.

ఉప్పల్ మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపు 12న

భారత్-బంగ్లాదేశ్ క్రికెట్ మ్యాచ్ నేపథ్యంలో నిర్ణయం

ఉప్పల్, న్యూస్‌టుడే: ఉప్పల్ స్టేడియంలో ఈనెల 12న భారత్-బంగ్లాదేశ్ టీ20 క్రికెట్ మ్యాచ్ ఈనేపథ్యంలో పలు మార్గాలలో ట్రాఫిక్‌ను మళ్లించనున్నట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఓ ప్రకటన విడుదల చేశారు. 12న సాయంత్రం 4నుంచి రాత్రి 11.30గంటల వరకు చెంగిచర్ల, బోడుప్పల్ వైపు నుంచి వచ్చే వాహనాలను ఉప్పల్‌లోని టొయోటో షోరూం ఎదురు నుంచి హెచ్‌ఎండీఏ భగాయత్ లే అవుట్ మీదుగా నాగోల్ వైపు మళ్లింపు. ●ఎల్బీనగర్, నాగోల్ నుంచి వచ్చే వాహనాలను నాగోల్ మెట్రో రైలు స్టేషన్ వద్ద యూటర్న్ తీసుకొని భగాయత్ లేఅవుట్ మీదుగా చెంగిచర్ల ఎక్స్ రోడ్డు వైపు మళ్లింపు. ●తార్నాక నుంచి ఉప్పల్ వైపు వచ్చే వాహనాలను హబ్సిగూడ ఎక్స్‌రోడ్డు నుంచి నాచారం వైపు, రామంతాపూర్ నుంచి వచ్చే వాహనాలను హబ్సిగూడ వీధి నం.8 నుంచి మెట్రో పిల్లర్ నం. 972 వద్ద యూటర్న్ తీసుకొని ఉప్పల్ ఎక్స్ రోడ్డు వైపు వెళ్లాల్సి ఉంటుంది.



సంధ్యవేళ.. అమ్మతో అలా..

రోజంతా ఇంట్లోనే ఉండే వారు సాయంత్రం వేళ సేదతీరేందుకు సాగర తీరానికి తరలివస్తుంటారు. నెక్లెస్‌రోడ్డులో ఓ మహిళ తన చిన్నారిని ఎత్తుకొని నడుస్తూ పరిసరాలను ఆస్వాదిస్తున్న చిత్రమిది.



పండుగ వేళ.. ప్రయాణికులకు ఎంత కష్టం

అసలే మహా నగరం.. ఆపై ట్రాఫిక్ వలయం.. మహాత్మా గాంధీ బస్‌స్టేషన్ వద్ద ట్రాఫిక్ నియంత్రణ కొరవడింది. రహదారి దాటేందుకు ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు.



కూడలికి కళ.. బొమ్మ భళా

సుందరీకరణలో భాగంగా కూడళ్లు కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. ఖాజాగూడ కూడలిలో నాపరాళ్లతో గోడ కట్టి వాటి ముందు ఏర్పాటు చేసిన మస్కట్‌లు ఆకట్టుకుంటున్నాయి.



సంద్రం కాదిది.. మన సాగరమేనండి

సందర్శకులు సముద్రతీరంలో సేద తీరుతున్నట్లు ఉంది కదూ.. హుస్సేన్‌సాగర్ వద్ద కనిపించిన చిత్రమిది. నెక్లెస్ రోడ్డులో రైల్వే స్టేషన్ ముందు కొన్ని గ్రిల్స్ తొలగించడంతో నగరవాసులు సాగర్ చెంత ఆహ్లాదంగా గడుపుతున్నారు.

ఒడిశాలో బాలుడి కిడ్నాప్.. రక్షించిన రాచకొండ పోలీసులు

ఈనాడు, హైదరాబాద్: ఒడిశాలో అపహరణకు గురైన బాలుడిని రాచకొండ పోలీసులు కాపాడారు. బాలుడు 12 రోజుల క్రితం అపహరణకు గురవ్వగా ఒడిశా పోలీసుల అభ్యర్థనతో రంగంలోకి దిగిన భువనగిరి ఎస్‌వోటీ బృందం 24 గంటల్లోనే కేసును ఛేదించింది. రాచకొండ సీపీ సుధీర్‌బాబు గురువారం ఓ ప్రకటనలో కేసు వివరాలు వెల్లడించారు. ఒడిశాలోని బలంగీర్ జిల్లాకు చెందిన పద్మిని మాజీ (35), నౌపడ జిల్లా కోమ్నా ఠాణాకు చెందిన దుర్యోధన్ బరిహా(30)తో సహజీవనం చేస్తోంది. దుర్యోధన్ యాదాద్రి జిల్లా బొమ్మలరామారం మండలానికి వచ్చి ఒక ఇటుక బట్టీలో పనిచేస్తున్నాడు. ఇద్దరూ ఒక చిన్నారిని అపహరించాలనుకున్నారు. పథకం ప్రకారం పద్మిని.. కోమ్నా పరిధిలో దంపతుల దగ్గర పనికి కుదిరింది. వారి కుమారుడి(5)ని గత నెల 29న



బాలుడు, అతడి తల్లితో రాచకొండ సీపీ సుధీర్‌బాబు, డీసీపీ రమణారెడ్డి, ఏసీపీ నరేందర్‌గౌడ్ తదితరులు

అపహరించి రైల్లో సికింద్రాబాద్‌కు, అక్కడి నుంచి బొమ్మలరామారంలో ఉంటున్న దుర్యోధన్ వద్దకు వచ్చింది. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కోమ్నా పోలీసులు ఈనెల 29న కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ప్రత్యేక బృందంతో బాలుడి గుర్తింపు

పద్మిని రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఉంటున్నట్లు అక్కడి పోలీసులు గుర్తించినా.. నిర్దిష్ట ప్రాంతం కనుక్కోలేక పోయారు. పోలీసులు దుర్యోధన్‌కి ఫోన్ చేసినా తనకు ఎవరూ తెలియదని బుకాయించాడు. దీంతో ఒడిశా పోలీసులు మంగళవారం రాచకొండ సీపీ సుధీర్‌బాబును సంప్రదించి కేసు వివరాలు చెప్పారు. బాలుడిని గుర్తించేందుకు ఐటీ సెల్, భువనగిరి ఎస్‌వోటీతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేయించారు. సాంకేతిక ఆధారాలతో బాలుడు, పద్మిని బొమ్మలరామారం పరిధిలో ఉన్నట్లు గుర్తించారు. తూముకుంట గ్రామంలో చిన్నారి ఆచూకీ లభ్యమైంది. పద్మిని, దుర్యోధన్‌ని అదుపులోకి తీసుకున్నారు. కోమ్నా పోలీసులు, బాలుడి తల్లిదండ్రులకు సమాచారమివ్వగా గురువారం కమిషనర్ కార్యాలయానికి చేరుకున్నారు. బాలుడిని తల్లికి అప్పగించారు. చిన్నారిని రక్షించిన బృందాన్ని కమిషనర్ అభినందించారు.

పరోపకారుడు.. విధికి తలవంచాడు




కేపీహెచ్‌బీకాలనీ: ఆపత్కాలంలో ఉన్న పలువురికి 26 సార్లు రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచాడు. ప్రేమించిన యువతిని తల్లిదండ్రులను ఒప్పించి కులాంతర వివాహం చేసుకున్నాడు. పరోపకారిగా పేరు తెచ్చుకున్న ఆ యువకుణ్ని రోడ్డు ప్రమాదం కబళించింది. అతని మంచితనాన్ని చూసైనా మృత్యువు కరుణించలేదని ఆ తల్లిదండ్రులు రోదించారు. కేపీహెచ్‌బీ ఎస్సై నజీర్‌మియా తెలిపిన వివరాలు.. వికారాబాద్ మండలం గోదమగూడకు చెందిన ఏనుగు అనంత్‌రెడ్డి(24) ఫొటోగ్రాఫర్. సామాజిక కార్యకర్త. ప్రాణాపాయంలో ఉన్నవారికి రక్తదానం చేశాడు. ఆగస్టు 11న అర్ధరాత్రి బైక్‌పై ఒంటరిగా ఉప్పల్ నుంచి కేపీహెచ్‌బీ వైపు వచ్చాడు. జేఎన్‌టీయూ సిగ్నల్ దాటాక బస్టాప్ వద్ద ద్విచక్ర వాహనంపై నుంచి పడిపోయాడు. తలకు తీవ్రగాయాలవగా, కాచిగూడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి కోమాలోనే ఉన్న అనంత్‌రెడ్డి ప్రాణాలు కోల్పోయాడు.

ఐటీ ఉద్యోగమిస్తామని డబ్బులు వసూలు చేసి మోసం

మాదాపూర్, న్యూస్‌టుడే: ఐటీ ఉద్యోగాల పేరుతో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ తమను మోసం చేసిందని పలువురు బాధితులు గురువారం మాదాపూర్ పోలీసులను ఆశ్రయించారు. మాదాపూర్ కావూరి హిల్స్‌లో ఉండే ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ యాజమాన్యం ఉద్యోగాలు ఇస్తామని ఒక్కొక్కరి వద్ద రూ.2.50 లక్షలు వసూలు చేసింది. డబ్బులు కట్టిన తర్వాత ఆఫర్ లెటర్ చేతికిచ్చి, వర్క్ ఫ్రం హోం అని చెప్పి ఆరు నెలలు కాలం వెల్లబుచ్చిన కంపెనీ యజమాన్యం, జీతాలు చెల్లించలేదు. దీంతో అనుమానం వచ్చిన ఉద్యోగులు కంపెనీ యాజమాన్యాన్ని నిలదీశారు. ప్రాజెక్టులు లేవని చెప్పిన కంపెనీ యజమాన్యం.. కొన్ని రోజులుగా కార్యాలయానికి రాకపోవడంతో మోసపోయామని తెలుసుకున్న ఉద్యోగులు మాదాపూర్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కాగా ప్రస్తుతం కేసు నమోదు చేయలేదని, మోసం రూ.కోట్లలో ఉండడంతో సైబరాబాద్ ఈఓడబ్ల్యూ విభాగంలో ఫిర్యాదు చేయాలని బాధితులకు సూచించినట్లు మాదాపూర్ సీఐ కృష్ణమోహన్ తెలిపారు.

రూ.6 కోట్ల బంగారం మాయం

ఎనిమిది మంది ఉద్యోగులపై కేసు



అదృశ్యమైన సుఖేతు షా

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఆభరణాల దుకాణంలో పనిచేసే ఉద్యోగులు దాదాపు రూ.6 కోట్ల బంగారం మాయం చేసిన ఘటన బంజారాహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. పోలీసులు వివరాల ప్రకారం.. రోడ్ నంబరు 10లోని శ్రీకృష్ణ జువెల్లర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్‌కేజేపీఎల్) ఇటీవల అంతర్గత ఆడిట్ నిర్వహించింది. సంస్థ ఉద్యోగులు ఉదయ్‌కుమార్, బబ్బూరి శ్రీకాంత్ బంగారు కడ్డీలు దొంగిలించి విక్రయించినట్లు గుర్తించారు. శ్రీకాంత్ వినియోగదారులకు బంగారం అందజేస్తానని నమ్మించి ఉదయ్‌కుమార్, మరికొందరు ఉద్యోగుల సాయంతో విక్రయాల సాగించినట్లు తెలుసుకున్నారు. శ్రీకాంత్‌ను విచారించగా అసలు విషయం బయటపెట్టాడు. మేనేజర్‌గా పనిచేసే సుఖేతు షా నేతృత్వంలో ఉదయ్‌కుమార్, చింటు, సత్య, అజయ్, టింకు, చంద్ర కలిసి ఈ మోసాలకు పాల్పడినట్లు అతడు తెలిపాడు. ఈ మేరకు హెచ్‌ఆర్ మేనేజర్ విజయ్‌కుమార్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సెక్షన్ 316(4), 318(4) బీఎన్‌ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కేసును గురువారం సీసీఎస్‌కు బదిలీ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ కెంఎం రాఘవేంద్ర తెలిపారు. మరోవైపు సుఖేతు షా భార్య శృతిషా తన భర్త ఈనెల 1నుంచి కనిపించడం లేదని బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయిదురోజులుగా తాను పనిచేసే ప్రాంతంలో డబ్బుల విషయంలో వేధిస్తున్నారని లేఖ, వీడియో రికార్డు ఇంట్లో ఉంచినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ. 3 వేల కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయాలి



నినాదాలు చేస్తున్న వేముల రామకృష్ణ, బీసీ విద్యార్థి సంఘం నేతలు

అంబర్‌పేట: ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు సంబంధించి రూ.3 వేల కోట్ల ఫీజు బకాయిలను విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, మెడిసిన్ చదువుతున్న 16 లక్షల మందికి చెల్లించాల్సిన రూ. 4500 కోట్ల ఫీజు బకాయిలలో రూ. 1500 కోట్లను మాత్రమే ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మిగిలిన బకాయిలను చెల్లించాలని గురువారం అంబర్‌పేటలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు బకాయిలను చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

గోసంరక్షణ బిల్లు ఆమోదించాలి



గోపూజలో జస్మత్‌పటేల్, రితీష్ జాగిర్దార్

కాచిగూడ: పార్లమెంటులో గోసంరక్షణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ గోసంరక్షణ సంస్థలు డిమాండ్ చేశాయి. గురువారం తెలంగాణ లా ఫర్ కౌ ఫౌండేషన్ ఛైర్మన్ జస్మత్‌పటేల్, ప్రాణిమిత్ర రితీష్ జాగిర్దార్, కమలేష్ మహారాజ్, మహంత్ ప్రశాంత్ దాస్‌జీ మాట్లాడారు.

అబ్దుల్లాపూర్‌మెట్: గోవును జాతీయ మాతగా ప్రకటించాలనే డిమాండ్‌తో గో ప్రతిష్ఠ ఆందోళన, గో ధ్వజ స్థాపన భారతయాత్రలో భాగంగా శంకరాచార్య జోతిష్య పీఠాధిపతి అవిముక్తేశ్వరానంద సరస్వతి స్వామి గురువారం జాఫర్‌గూడలో యుగ తులసి గో మహాక్షేత్రానికి విచ్చేశారు. యుగ తులసి ఫౌండేషన్ ఛైర్మన్ కె.శివకుమార్ ఘన స్వాగతం పలికారు.

కోయంబత్తూర్ విమానానికి బాంబు బెదిరింపు

శంషాబాద్, న్యూస్‌టుడే: 'కోయంబత్తూర్ నుంచి బయల్దేరిన ఇండిగో విమాన సర్వీస్‌లో బాంబు పెట్టామని గుర్తు తెలియని వ్యక్తులు విమానాశ్రయానికి మెయిల్ పంపించారు. భద్రతాధికారుల తనిఖీలు చేపట్టగా విమానంలో ఎలాంటి పేలుడు పదార్థాలు లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఎయిర్‌పోర్ట్ అధికారులు, ఆర్జీఐఏ పోలీసుల వివరాల ప్రకారం.. బుధవారం సాయంత్రం ఇండిగో ఎయిర్‌లైన్స్ 6ఈ-764 విమాన సర్వీస్ కోయంబత్తూర్ నుంచి 181 మంది ప్రయాణికులతో శంషాబాద్ బయల్దేరింది. ఈ విమాన సర్వీస్‌లో బాంబులున్నాయని ఎయిర్‌పోర్ట్‌కు మెయిల్ వచ్చింది. మెయిల్ వచ్చిన చిరునామా ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



రాజేంద్రప్రసాద్‌ను పరామర్శించిన నాగార్జున

రాజేంద్రప్రసాద్‌కు పరామర్శ

కేపీహెచ్‌బీకాలనీ: కుమార్తెను కోల్పోయిన సినీనటుడు రాజేంద్రప్రసాద్‌ను గురువారం పలువురు సినీ ప్రముఖులు పరామర్శించారు. నటులు అక్కినేని నాగార్జున, గోపిచంద్, శ్రీవిష్ణు, దర్శకుడు శ్రీను వైట్ల, ఎన్టీఆర్ కుమారుడు రామకృష్ణ, ఐపీఎల్ కౌన్సిల్ సభ్యుడు చాముండేశ్వరీనాథ్ నటుడి నివాసంలో ఆయనతోపాటు కుటుంబసభ్యులను ఓదార్చారు.

చికెన్ ధరలు		
ఫాంరేటు 109-00		డ్రెస్డ్ 190-00
రిటైల్ 131-00		స్కిన్‌లెస్ 216-00

ట్రాన్స్‌కో 1535 పవర్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడిగా కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి



రోనాల్డ్ రోస్‌కు జ్ఞాపిక అందజేస్తున్న కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, ట్రాన్స్‌కో, జెన్‌కో ప్రతినిధులు

అమీర్‌పేట, న్యూస్‌టుడే: ట్రాన్స్‌కో 1535 పవర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈమేరకు యూనియన్ సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు ఎం.ఎ.వజీర్, కార్యదర్శి డి.రాధాకృష్ణ తదితరులతో కలిసి గురువారం ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ రోనాల్డ్ రోస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు యూనియన్ ప్రతినిధులు జ్ఞాపికను బహూకరించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శిగా బండారి నగేష్‌ను, సలహాదారుగా రవి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా శ్రీనివాస్‌ను ఎన్నుకున్నామని, ఇతర కార్యవర్గాన్ని ప్రకటిస్తామన్నారు.

కొత్త చట్టంపై ధరణి బాధితుల ఆశలు

ధరణి | Dharani
Integrated Land Records Management System
Government of Telangana

ఈనాడు, హైదరాబాద్, శామీర్‌పేట్, యాచారం, న్యూస్‌టుడే: పట్టా భూములను.. ప్రభుత్వ భూములుగా.. రైతుల భూములను నిషేధిత భూములుగా రికార్డుల్లో చూపిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న ధరణి పోర్టల్ స్థానంలో రాబోతున్న కొత్త చట్టంతో ఉపశమనం లభిస్తోందేమోనన్న ఆశతో 'ధరణి'బాధితులు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం ఐదేళ్ల క్రితం ధరణి పోర్టల్‌ను ఆవిష్కరించిన మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలంలోనే సమస్యలున్నాయి. మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలోని పలు మండలాల్లో వందలమంది రైతులు, భూముల యజమానులు తహసీల్దార్, కలెక్టరేట్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ధరణి.. దరఖాస్తులు..

జిల్లా	దరఖాస్తులు	పరిష్కారం	తిరస్కరణ
రంగారెడ్డి	1.97 లక్షలు	1.78 లక్షలు	19 వేలు
మేడ్చల్	32 వేలు	28 వేలు	4 వేలు

పంట రుణాలు లేవు.. రైతుబంధు లేదు

– రవికిరణ్ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు, బొమ్మరాస్‌పేట, మేడ్చల్‌జిల్లా



ధరణి పోర్టల్ వచ్చిన కొత్తలో బొమ్మరాస్‌పేట్‌లోని రైతుల భూములకు బై నంబర్లుగా నమోదు చేయడంతో అవి ప్రభుత్వ భూముల ఖాతాలోకి వెళ్లాయి. 150 మంది రైతుల కుటుంబాలకు అన్యాయం జరిగింది. భూముల క్రయవిక్రయాలు కొనసాగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. బ్లాక్‌లిస్ట్‌లో ఉంచడంతో బ్యాంకులు పంటరుణాలు ఇవ్వడం లేదు. రైతుబంధు రావడంలేదు. భూమి కమిటీ సభ్యులు కొద్దినెలల క్రితం మా గ్రామానికి వచ్చి మా సమస్యలు విన్నారు. సమస్య మాత్రం పరిష్కారం కాలేదు.

మా భూములు ఖాళీ చేయండి అంటున్నారు

– రామచంద్రయ్య, కుర్మిద్ద, యాచారం మండలం



కుర్మిద్ద గ్రామంలోని సర్వే నం.92లో నలుగురు అన్నదమ్ములం నాలుగున్నర ఎకరాల భూమిని సాగుచేసుకుంటున్నాం. రెవెన్యూ శాఖ అధికారులు దశాబ్దాల క్రితమే మాకు ఈ భూములిచ్చారు. అసైనీల జాబితాలో ఉన్నాం. ధరణి పోర్టల్ వచ్చాక అందులో రికార్డుల ప్రకారం అవి అటవీశాఖ భూములుగా మారిపోయాయి. రైతుల భూములంటూ కలెక్టర్ కార్యాలయాలకు మేం చాలా సార్లు తిరిగినా ఫలితం లేదు. అటవీశాఖ అధికారులు వచ్చి మా భూములు ఖాళీచేయండని అంటున్నారు.

పథకాల అమలు తీరు బాగుంది...!



ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అధికారుల బృందం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: జీహెచ్ఎంసీలో అమలు చేస్తున్న పలు పథకాలను ఏపీ మున్సిపల్ అధికారులు ప్రశంసించారు. జీహెచ్ఎంసీ విధానాలు, అభివృద్ధి పథకాలను వారికి గురువారం పవర్ పాయింట్ ద్వారా తెలంగాణ మున్సిపల్ అధికారులు వివరించారు. జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరీష్, గీత రాధిక, సీసీపీ విభాగంలో సీఈ భాస్కర్‌రెడ్డి, ఫైనాన్స్ అడ్వయిజర్ శరత్ చంద్ర, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో ఎస్ఈ కోటేశ్వరరావు, టీపీ వాల్యుయేషన్ ఆఫీసర్ మహేష్ కులకర్ణి (గ్రేటర్ వరంగల్), ప్రజా సమస్యలను పరిష్కరించే తీరును ఏపీ మున్సిపల్ అధికారులకు వివరించారు. వీరిలో గుంటూరు కమిషనర్ పులి శ్రీనివాసులు (ఐఏఎస్), ఈఈ సుందరరామిరెడ్డి, ఏలూరు కమిషనర్ ఎ.భానుప్రతాప్, ఏఈ ఎలక్ట్రికల్ శేషగిరిరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంబూరి రవి, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ కలూరి వెంకట నాగరాజు, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలి

గోల్నాక: రాష్ట్రంలోని ఆలయాలకు స్వయంప్రతిపత్తిని కల్పించి.. అధికారుల జోక్యం లేకుండా చూడాలని భాజపా ధార్మిక సెల్ రాష్ట్ర కన్వీనర్ అన్నావజ్జుల సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. ఏపీలోని కూటమి ప్రభుత్వం ఆలయాలకు స్వయంప్రతిపత్తిని కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. గురువారం నింబోలిఅడ్డాలో ఆయన మాట్లాడారు.. ఆలయ సంప్రదాయాలు, ఆగమ, వైదిక వ్యవహారాలలో దేవాదాయ శాఖ అధికారులు జోక్యం చేసుకోవడం తగదన్నారు. ఆలయ వైదిక కమిటీ, ఆలయాల అభివృద్ధి ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలను చేపడుతారని పేర్కొన్నారు.

ప్రతిభ చూపిన అభ్యర్థులకు అభినందనలు

ముషీరాబాద్: డీఎస్సీ ఫలితాల్లో ప్రతిభ చూపి, ఉద్యోగానికి ఎంపికైన దిల్‌సుఖ్‌నగర్ రామయ్య శిక్షణ సంస్థ విద్యార్థులను సంస్థ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అభినందించారు. సంస్థలో శిక్షణ పొంది సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్న వారిని గురువారం సత్కరించారు. ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ విభాగాల్లో రాష్ట్ర, జిల్లాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన వారిలో 50శాతం మంది తమ వద్దే శిక్షణ పొందినట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

తల్లి ఒడి చేరిన పసికందు

పోలీసుల అదుపులో మహిళలు



సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో అపహరణకు గురైన పసికందు ఆచూకీ లభించింది. నలుగురు మహిళలు బుధవారం శిశువును అపహరించినట్లు సీసీ కెమెరాల్లో నమోదైన విషయం విదితమే. సంగారెడ్డి పట్టణ సీఐ భాస్కర్ 24 గంటల్లోనే కేసు ఛేదించారు. గురువారం హైదరాబాద్ బోరబండ పరిధి అల్లాపూర్‌లో నిందితుల్లో ఇద్దరు మహిళలను సంగారెడ్డి పోలీసులు పట్టుకున్నారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం వెల్లడిస్తామని సీఐ తెలిపారు.

10 బృందాలతో గాలింపు: మనూరు మండలం దూదిగొండకు చెందిన నసీమా ఈ నెల 9న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సిజేరియన్ ద్వారా ఆడ శిశువుకు జన్మనిచ్చింది. నసీమా తల్లి మునీబీ, అత్త హమీదాలు ఆసుపత్రి కారిడార్‌లో ఆ శిశువును పడుకోబెట్టగా నలుగురు మహిళలు అపహరించారు. సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా పోలీసులు తనిఖీలు పెంచారు. ఎస్పీ రూపేష్ పది బృందాలను నియమించారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా అల్లాపూర్‌లో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. శిశువును తల్లి ఒడికి చేర్చారు. శిశువులను అపహరించేందుకు నిందితులు పలుమార్లు రెక్కీ నిర్వహించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

యూజీసీ వేతనాలు వర్తింపజేయండి



యూజీసీ ఛైర్మన్ జగదీష్ కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంఘం ప్రతినిధులు

ఈనాడు, హైదరాబాద్, న్యూస్‌టుడే, సుల్తాన్ బజార్: ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఇరవై ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్న తమకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిర్దేశించిన వేతనాలను వర్తింపజేయాలని కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంఘం ప్రతినిధులు యూజీసీ ఛైర్మన్ మామిడాల జగదీష్ కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. నగరంలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనను కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంఘం ప్రతినిధులు ఉపేందర్, సనత్, శేఖర్‌రెడ్డి, యాదయ్య, కృష్ణవేణి, అనురాధ, రవికిరణ్‌లు గురువారం కలిశారు. 12విశ్వవిద్యాలయాల్లో 1445మంది విధులు నిర్వహిస్తున్నామన్నారు.

ఆవిష్కరణలు, పెట్టుబడి సాయానికి 'రాయల్ అలయన్స్'



అవగాహన పత్రంపై సంతకం చేస్తున్న మారియా లియోనార్, చిత్రంలో సందీప్ మఖ్తల

రాయదుర్గం, న్యూస్‌టుడే: ప్రపంచ వ్యాప్తంగా ఆవిష్కరణలను ప్రోత్సహించడం, పెట్టుబడి అవకాశాలను కల్పించే ఉద్దేశంతో టీ కన్సల్ట్ సంస్థ ఛైర్మన్ సందీప్ మఖ్తల, ఫిలిప్పీన్స్ రాజు సోదరి మారియా అమోర్ లియోనార్ టోరెస్ మస్చురా.. రాయల్ అలయన్స్‌ను ఏర్పాటు చేశారు. టీకన్సల్ట్ ద్వారా ఈ అలయన్స్ పనిచేయనుంది. ఈ మేరకు రాయదుర్గం టీ హబ్‌లో బుధవారం సందీప్, మారియా లియోనార్ అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. సందీప్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా రాచ కుటుంబాల సహకారంతో ఈ అలయన్స్ ముందుకు సాగుతుందన్నారు.

ఆదిభట్లలో రతన్‌టాటా విగ్రహం ఏర్పాటు చేస్తాం



నివాళులర్పిస్తున్న నిరంజన్‌రెడ్డి, యాదగిరి, టీసీఎస్ ఉద్యోగులు

ఆదిభట్ల: రతన్ టాటా కాంస్య విగ్రహాన్ని ఆదిభట్లలో ఏర్పాటు చేస్తామని పురపాలిక ఛైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. టీసీఎస్ ప్రధాన గేటు వద్ద రతన్ టాటా చిత్రపటానికి నివాళులర్పించారు. వైస్‌ఛైర్మన్ యాదగిరి, ఉద్యోగులు పాల్గొన్నారు.

నగరంలో ఈనాడు

- ◆ సికింద్రాబాద్ గురుస్వామి సెంటర్‌లో సా.6 గంటలకు 'బిహైండ్ బిర్యానీ' పుస్తకావిష్కరణ
- ◆ షాద్‌నగర్‌లో మ.2 గంటలకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్ ప్రారంభం
- ◆ ఎన్టీఆర్ గ్రౌండ్‌లో సా.6.30కు దుర్గాదేవి ప్రత్యేక పూజా కార్యక్రమం.

పండగ వేళ ప్రయాణ కష్టాలు

◆ సకాలంలో రాని స్పెషల్ బస్సులు ◆ ప్రైవేటు బస్సుల్లో భారీగా దోపిడీ



మియాపూర్‌లో ఎక్కితే ఎంజీబీఎస్ నుంచి కొట్టిన టికెట్

ఈనాడు, హైదరాబాద్: పండగ వేళ ఊర్లకు వెళ్లేవారికి ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. అదనపు బస్సులు ఏర్పాటు చేసినా సమయానికి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులకు చుక్కలు కనిపిస్తున్నాయి. మార్గమధ్యంలో కొన్ని బస్సులు బ్రేక్‌డౌన్ కావడంతో ప్రయాణికులు అసహనానికి గురయ్యారు. మియాపూర్, కూకట్‌పల్లి, ఎల్బీనగర్, గచ్చిబౌలి, ఉప్పల్, ఆరాంఘర్, శంషాబాద్ తదితర ప్రాంతాల నుంచి వేర్వేరు జిల్లాలకు వెళ్లే ప్రయాణికులు బస్సులు ఎక్కుతుంటారు. సాధారణంగా ఆయా ప్రాంతాలు లేదా అంతకు ముందు ఉన్న స్టాపుల నుంచి టికెట్లు తీసుకోవాలి. కానీ ఎంజీబీఎస్, జేబీఎస్ నుంచి ఛార్జీలు వసూలు చేస్తుండటంతో పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.


కొన్ని ఉదంతాలు... ◆ సంగారెడ్డికి వెళ్లేందుకు మియాపూర్‌లో బస్సు ఎక్కితే ఎంజీబీఎస్ స్టాప్ నుంచి టిక్కెట్ తీసుకోవడంతో ప్రయాణికులు కండక్టర్ మధ్య వాగ్వాదం జరిగింది. మధ్యలో కూకట్‌పల్లి స్టేజీ ఉన్నా ఎంజీబీఎస్ నుంచి టికెట్ ఎలా ఇస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై మియాపూర్ డిపో కంట్రోలర్‌ను అడిగితే కంప్యూటర్‌లో కూకట్‌పల్లి స్టేజీ ఫీడ్ చేయకపోవడంతో సమస్య ఏర్పడిందన్నారు. ◆ జనగాం, వరంగల్, యాదాద్రి వెళ్లేవారంతా ఉప్పల్ పాయింట్ నుంచి బస్సు ఎక్కుతుంటారు. ప్రత్యేక బస్సుల్లో ఉప్పల్ స్టాప్ నుంచి కాకుండా జేబీఎస్ స్టాప్ నుంచి టికెట్ తీసుకుంటున్నారు. ఇదేంటని కండక్టర్‌ను అడిగితే టిమ్ మెషీన్‌లో అలాగే ఉందంటూ వాగ్వాదానికి దిగారు. ◆ ప్రయాణికుల సౌకర్యార్థం హెల్ప్‌డెస్క్ నంబర్లు ఇచ్చినా...స్పందించే అధికారులు కరవయ్యారు. ఎంజీబీఎస్, దిల్‌సుఖ్‌నగర్ విచారణ కేంద్రాల నంబర్లకు గంటల తరబడి ఫోన్ చేసినా ఎవరూ తీయడం లేదంటూ ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు.

◆ కరీంనగర్, ఖమ్మం మార్గాల్లో సూపర్ లగ్జరీ బస్సులు మార్గ మధ్యంలో బ్రేక్‌డౌన్ అవడంతో ప్రయాణికులు అసహనానికి గురయ్యారు.

ప్రైవేట్‌లో దాదాపు రెట్టింపు

పండగవేళ ఎల్బీనగర్, గచ్చిబౌలి మీదుగా విజయవాడ, కాకినాడ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల నుంచి రెట్టింపు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. విజయవాడకు రూ.450 వరకు టికెట్ ఛార్జీలు ఉండగా రూ.600-700 వరకు ఛార్జీలు వేస్తున్నారు. కాకినాడకు రూ.800 ఉంటే రూ.1,200 వరకూ వసూలు చేస్తున్నారని ప్రయాణికులు వాపోయారు. శుక్రవారం ఛార్జీలు మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతుండటం గమనార్హం.







ఆధ్యాత్మిక సౌరభం..

భక్తజన పరవశం

గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ దేవతలకు విశిష్ట స్థానం ఉంది. వీరు కొలువైన ఆలయాలకు ఘన చరిత్ర సైతం ఉంది. భక్తుల పాలిట కొంగు బంగారమై విలసిల్లుతున్నాయి. ఆషాఢ ఉత్సవాలు, శరన్నవరాత్రులను వైభవంగా నిర్వహిస్తున్నారు. నిత్యం వేలాదిమంది దర్శించుకుంటూ మొక్కులు చెల్లించుకుంటున్నారు.

వ్యాధుల పీడ వదిలించిన తల్లి



అంబర్‌పేట, న్యూస్‌టుడే: నగరంలోని ప్రముఖ దేవాలయాలలో ఒకటైన అంబర్‌పేట మహంకాళి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారు రోజుకో రూపంలో దర్శనమిస్తున్నారు. ఏడున్నర దశాబ్దాలుగా నగరవాసులు మహంకాళిని భక్తిప్రపత్తులతో కొలుస్తున్నారు. 1948లో నగరవాసులు కలరా, ప్లేగు తదితర వ్యాధులతో బాధపడుతున్నారు. అమ్మవారికి పూజలు చేయడం ద్వారా ఆ వ్యాధులు దూరమవుతాయని భావించి.. బోనాలు, దసరా శరన్నవరాత్రులను నిర్వహించాలని అప్పటి అంబర్‌పేట గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఈ క్రమంలో అంబర్‌పేట దేవస్థాన సేవా సమితిని ఏర్పాటుచేసి గ్రామం నడిబొడ్డున 1950లో మహంకాళి ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. 1953 సెప్టెంబరులో సింహవాహిని అమ్మవారు విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

భక్తుల ఆరాధ్య దైవం.. మైసిగండి మైసమ్మ



ఆమనగల్లు, కడ్తాల్, న్యూస్‌టుడే: రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం మైసిగండిలో చారిత్రక మైసమ్మ ఆలయానికి నిత్యం భక్తుల తాకిడి ఉంటుంది. పూర్వం మర్రి చెట్టు కింద వెలసిన మైసమ్మ భక్తుల పూజలందుకునే వారు. ఆలయ వ్యవస్థాపక ట్రస్టీ, మాజీ ఎంపీపీ రామావత్‌నాయక్ దాతల సాయంతో ఆలయాన్ని అభివృద్ధి చేశారు. అనంతరం దేవాదాయ శాఖ పరిధిలోకి వెళ్లింది. ఆది, మంగళ, బుధ, శుక్రవారాల్లో భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. ఏటా కార్తిక మాసంలో అమ్మవారి జాతర, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు, శ్రీరామ నవమి ఉత్సవాలు. విజయదశమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు.

వరద కట్టడి చేసిన కట్టమైసమ్మ




రాంనగర్, న్యూస్‌టుడే: లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ ఆలయానికి ఘనచరిత్ర ఉంది. తెలంగాణలో పొలాలు, జలవనరులు ఉన్నచోట తప్పనిసరిగా కట్టమైసమ్మ ఆలయం ఉండటం రివాజు. నిజాం నవాబుల పాలన(1835-40)లో ఆలయాన్ని నిర్మించినట్లు చెబుతారు. 1907లో హైదరాబాద్‌లో వరదలు సంభవించినప్పుడు.. వాటిని ఆపడానికి అమ్మవారికి 'గంగపూజ' చేయించారని ప్రతీతి. అనంతరం వరదలు తగ్గుముఖం పట్టాయని అప్పటి నుంచి అలాంటి ఘటనలు పునరావృతం కాకపోవడానికి కట్టమైసమ్మ మహిమేనని భక్తుల నమ్మకం. నేటికీ గంగపూజను ఈ ఆలయంతోపాటు గండిపేట దగ్గరున్న మైసమ్మ ఆలయంలో మాత్రమే జరుపుతారు. అమ్మవారికి ఆషాఢ ఉత్సవాలు, దసరా శరన్నవరాత్రి ఉత్సవాలనూ ఘనంగా నిర్వహిస్తారు.

ఇక్కడ ఆర్మీ అధికారే.. పూజారి



బండ్లగూడజాగీర్, న్యూస్‌టుడే: గోల్కొండ కోటకు తూర్పు వైపున ఉన్న ఆరె మైసమ్మ ఆలయంలో పూజలను ఆర్మీ అధికారులే నిర్వహిస్తారు. ఈ ఆలయానికి సెప్టెంబరు 17, 1948తో అవినాభావ సంబంధం ఉంది. ఆనాడు భారత ఆర్మీ 'హైదరాబాద్ సంస్థానం'పై పోలీసుచర్య చేపట్టేందుకు నలుదిక్కులా మోహరించింది. గోల్కొండ కోటలోని నిజాంసైన్యం నుంచి వ్యతిరేకత ఉండటంతో.. భారత కమాండర్ చౌదరి, ఆయన బృందం ఆరె మైసమ్మ ఆలయం వద్ద ఆశ్రయం పొంది ప్రయత్నాలు మొదలుపెట్టింది. మకాయిదర్వాజ మీదుగా లోనికి వెళ్లాలని చౌదరికి కలలో ఆరె మైసమ్మ సూచించినట్లు, ఆ మేరకే ఆర్మీ కోటలోకి ప్రవేశించి నిజాంసేనలను కట్టడి చేసిందని ప్రతీతి. ఈ ఆలయ నిర్వహణ అంతా ఆర్మీ వారే చూసుకోవాలని, అమ్మవారి సేవలో నిరంతరం ఉండాలని కమాండర్ చౌదరి ఆర్మీ రికార్డులలో నమోదు చేశారు.







కేవీఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన బతుకమ్మ పోటీల్లో మొదటి బహుమతి అందుకున్న చంద్రకళకు టీవీ అందజేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, తదితరులు

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

పూల పండగతో పులకించిన హుస్సేన్‌సాగర్

నారాయణగూడ: 'బతుకమ్మను భవిష్యత్ తరాలకు అందిద్దాం, చెరువులను కాపాడుకొని జీవన వైవిధ్యాన్ని పరిరక్షించుకుందాం' అని రాష్ట్ర మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. గురువారం రాత్రి భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ వేడుకలు కనులపండువగా నిర్వహించారు. తెలంగాణ అమరవీరుల స్మారకం నుంచి మహిళలతో కలిసి మంత్రి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, సాంస్కృతిక శాఖ ముఖ్యకార్యదర్శి వాణీ ప్రసాద్, తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ అలేఖ్య పుంజాల, అరుణోదయ విమలక్క, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కాల్వసుజాత, మహిళా కార్పొరేషన్ ఛైర్మన్ శోభ, తదితరులు బతుకమ్మలతో ట్యాంక్‌బండ్ చేరుకున్నారు. బతుకమ్మకు చెరువుతో అనుబంధం ఉందన్నారు. విమలక్క మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, పర్యాటక శాఖ సంచాలకురాలు ఇలా త్రిపాఠి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మ సంబురం



వెంగళరావునగర్‌లోని మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ కమిషనరేట్‌లో డైరెక్టర్ కాంతివెస్లీ, కార్యదర్శి వాకాటి కరుణ, ఉమెన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ శోభారాణి



పద్మాలయ అంబేడ్కర్‌నగర్‌లో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



కృష్ణకాంత్‌పార్కు వద్ద వేడుకల్లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే గోపీనాథ్



గౌరీశంకర్‌నగర్‌లో..



బంజారాహిల్స్ ఇబ్రహీంనగర్‌లో మహిళలు, చిన్నారులు



ఎన్బీటీనగర్‌లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



ఖైరతాబాద్‌లోని రెండు పడక గదుల ఇళ్ల సముదాయం వద్ద



హెచ్ఎండీఏ మైదానంలో..



శ్రీకృష్ణానగర్‌లో వాసవీ ఇంటర్నేషనల్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో

ట్యాంక్‌బండ్‌పై సందడి













పంజాగుట్ట ఆనంద్‌నగర్ కాలనీ అమ్మవారి మండపంలో దాండియా కళాకారులు

దుర్గమ్మ వైభవం



జూబ్లీహిల్స్‌లోని సీతారామ స్వామి దేవాలయంలో దుర్గాదేవిగా పర్వతవర్ధినిదేవి

చెడును నిరోధించేందుకు ప్రయత్నించాలి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: సమాజంలో మంచి, చెడు తలపెట్టే రెండు వర్గాలూ ఉన్నారని, మంచికోసం పోరాడే వారు ఉన్నంత కాలం సమాజం బాగుంటుందని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గ్రంధి భవాని ప్రసాద్ అన్నారు. రాజకీయ నాయకులు అందరూ చెడ్డవారు కాదు, సమాజం కోసం జీవితం ధారపోసిన వారూ ఉన్నారని అన్నారు. సహ చట్టం ఆవిర్భావ దినం సందర్భంగా గురువారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలెక్షన్ వాచ్ కమిటీ ఆధ్వర్యంలో సహ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెడును ఎంత వరకు నిరోధించగలమో అంత వరకు ప్రయత్నం చేస్తూ ఉండాలని సూచించారు. సమితి జాతీయ ఛైర్మన్ డా. బొమ్మరబోయిన కేశవులు అధ్యక్షత వహించారు. సహ చట్టం కోసం పనిచేస్తున్న పలువురిని సత్కరించారు.



మాట్లాడుతున్న జస్టిస్ భవాని ప్రసాద్

సైకాలజీలో ఉపాధి అవకాశాలు ఎక్కువ

షేక్‌పేట, న్యూస్‌టుడే: మానసిక దృఢత్వంతోనే విజయం సాధించగలుగుతామని వక్తలు పేర్కొన్నారు. షేక్‌పేట జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల (జీనిట్స్)లో మనో జాగృతి సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా 'ఎడ్యుకేషన్ అండ్ ఎంప్లాయ్‌మెంట్ ఇన్ సైకాలజీ-100 ప్లస్ సైకాలజికల్ కెరీర్ పాత్స్' ఇతివృత్తంతో అంతర్జాతీ సదస్సు నిర్వహించారు. మార్ఫిక్ మైండ్స్ సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ డా.సుశీర్ కుమార్ పల్సపూర్ మాట్లాడుతూ.. సైకాలజీ రంగంలో ఉపాధి అవకాశాలు పెరిగాయని, యువత వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జాగృతి సంస్థ వ్యవస్థాపకురాలు డా.గీత చల్లా, డా. ఉదయ్ కుమార్ రెడ్డి, డా.శిప్రా గుప్తా, డా.బి.రాజగోపాల్, డా.వసుధారాణి, బీకే సుమలత, గంపా నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

హిమబిందుకు ఉత్తమ వైద్యురాలి పురస్కారం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: అమెరికా హూస్టన్‌లోని ప్రసిద్ధ మెథోడిస్ట్ హాస్పిటల్‌లో హృద్రోగ శస్త్ర చికిత్సల నిపుణురాలిగా సేవలందిస్తున్న డా.హిమబిందు చేబ్రోలుకు 'బెస్ట్ డాక్టర్ ఆఫ్ ఇయర్ 2023 పురస్కారాన్ని జోష్ నేషనల్ అకాడమీ అందజేసింది. ప్రసాద్ ల్యాబ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర బీసీ కమిషన్ పూర్వ ఛైర్మన్ డా.వకుళాభరణం కృష్ణమోహన్ రావు, విశిష్ట అతిథిగా పాటల రచయిత సుద్దాల అశోక్ తేజ, భూగర్భవనరుల నిపుణుడు, శాస్త్రవేత్త సి.ఆర్.ఎమ్ రావు పాల్గొన్నారు. సంజోష్, చిరంజీవులు, నృత్య గురువు కళ్యాణి పాల్గొన్నారు.

దొంగలను పట్టుకున్న యువకులకు డీసీపీ అభినందనలు

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: నడిచి వెళ్తున్న యువతి మెడలోంచి బంగారు గొలుసు తెంపుకొని పారిపోతున్న దొంగను ఇద్దరు యువకులు పట్టుకుని మధురానగర్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన మంగళవారం జయప్రకాశ్‌నగర్‌లో చోటు చేసుకుంది. దోపిడీకి పాల్పడిన తమిళనాడుకు చెందిన నితిన్‌ను పట్టుకున్న యువకులు తేజ, శివలను వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్ గురువారం తన కార్యాలయానికి పిలిచి అభినందించారు. అదనపు డీసీపీ హనుమంతరావు, మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వర్మ ఉన్నారు.



తేజ, శివలను అభినందిస్తున్న డీసీపీ విజయకుమార్

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348

బంజారాహిల్స్ న్యూస్‌టుడే :

? బంజారాహిల్స్ ఉదయనగర్ బస్తీలో బొడ్రాయి ప్రతిష్ఠించిన ప్రాంతంలో పలు వీధి దీపాలు వెలగడం లేదు. చీకటిపడిన తరువాత రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం.
– రాము, ఉదయనగర్

✓ సిబ్బందిని పంపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – సుష్మ, మున్సిపల్ ఏఈ (వీధిదీపాల విభాగం), సర్కిల్–18.

గవర్నర్‌కు అలయ్-బలయ్ ఆహ్వానం

అమీర్‌పేట: ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈనెల 13న అలయ్-బలయ్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి కావాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు అలయ్-బలయ్ కమిటీ ప్రతినిధులు గురువారం ఆహ్వాన పత్రికను అందజేశారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: మానసిక ఆరోగ్యంపై రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో గురువారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ ఉద్యానం వద్ద అవగాహన కల్పించారు. మంచి మానసిక ఆరోగ్యం సాధించడం ఎలా? అనే అంశంపై ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా గవర్నర్ రొటేరియన్ శరత్ చౌదరి, అధ్యక్షురాలు వనశ్రీ, కార్యదర్శి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



ప్లకార్డులతో రోటరీ క్లబ్ సభ్యులు

శ్రీవారి ఊరేగింపు



శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారికి ముత్యాల పందిరి ఉరేగింపు వైభవంగా నిర్వహించారు.
– న్యూస్‌టుడే, యూసుఫ్‌గూడ

మనముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి నియామకం

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా హైదరాబాద్ పాతబస్తీకి చెందిన బుద్దనబోయిన బిందుశ్రీ నియమితులయ్యారు. ఈమేరకు హైదర్‌గూడలోని మహాసభ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు డా.చొప్పరి శంకర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య ముదిరాజ్‌లు ఆమెకు నియామకపత్రాన్ని అందజేశారు.



బిందుశ్రీకి నియామకపత్రం ఇస్తూ..

అసోసియేట్ డైరెక్టర్ అదృశ్యం



చరణ్

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: చెన్నై నుంచి వస్తున్న తల్లిని తీసుకొని వస్తానంటూ వెళ్లిన అసోసియేట్ డైరెక్టర్ అదృశ్యమైన ఘటన బంజారాహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. బంజారాహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 13 లోని శ్రీసాయి మాన్షన్‌లో చెన్నైలోని పర్లవల్లం ప్రాంతానికి చెందిన సినీరంగంలో అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసే వైశ్య చరణ్, గొల్లపాటి అశ్విన్ కలిసి ఉంటున్నారు. గత నెల 30న చెన్నై నుంచి హైదరాబాద్ వస్తున్న తన తల్లిని బంధువుల ఇంటి వద్ద దించి వస్తానంటూ చరణ్ వెళ్లి తిరిగిరాలేదు. ఈనెల 4న తను ఆర్థిక ఇబ్బందులతో మానసిక ఒత్తిడి ఎదుర్కొంటున్నానని, తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు అశ్విన్‌కు మెయిల్ పంపించాడు. మెయిల్ ఆలస్యంగా గుర్తించిన అశ్విన్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ప్రత్యేక బృందంతో గాలిస్తున్నట్లు బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ కెంఎం రాఘవేంద్ర తెలిపారు.

పబ్, కెఫేలపై కేసు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న పబ్, కెఫేపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 36 లోని లోకో పబ్ సమయం మించిన తరువాత కొనసాగుతోందని గుర్తించిన జూబ్లీహిల్స్ పోలీసులు, మేనేజర్ ప్రదీప్‌కుమార్‌తోపాటు పబ్ నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. * జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 45లోని ట్రూ కాఫీ కెఫేకు సరైన పార్కింగ్ సౌకర్యం కల్పించకపోడంతో వాహనాలన్నీ రహదారిపై నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. విధుల్లో ఉన్న ట్రాఫిక్ ఎస్సై నర్సింహారావు జూబ్లీహిల్స్ పోలీసుకు ఫిర్యాదు చేయగా, నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒత్తిడితో బలవన్మరణం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: రెండేళ్లుగా మానసిక ఒత్తిడితో బాధపడుతున్న వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన బంజారాహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చంపేట ప్రాంతానికి చెందిన వాసు(36) రెండేళ్లుగా బంజారాహిల్స్ రోడ్ నంబరు 10లోని ఐపీఎస్ క్వార్టర్స్ సమీపంలో నివసిస్తున్నారు. కొంత కాలంగా వివిధ పోటీపరీక్షలకు హాజరుకాగా, ఎంపిక కాలేదు. అంతేకాకుండా తల్లిదండ్రుల మరణంతో కుంగిపోయాడు. మానసిక స్థితి బాగోలేకపోవడంతో కొన్నాళ్లుగా చికిత్స తీసుకుంటున్నారు. గురువారం ఇంట్లో ఫ్యానుకు తాడుతో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గమనించిన పొరుగు వారు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు నగరంలోని ఓ జోన్ డీసీపీకి బామ్మర్ది కావడంతో ఆయన అక్కడికి చేరుకున్నారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చండి



మాట్లాడుతున్న అల్లాదుర్గం సురేష్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ముదిరాజ్ సామాజికవర్గం అన్ని రంగాల్లో వెనుకబాటులో ఉందని ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు అల్లాదుర్గం సురేష్ పేర్కొన్నారు. వీరి అభివృద్ధికి బీసీ-డీ నుంచి బీసీ-ఏ లోకి మార్చాల్సిన అవసరం ఉందన్నారు. గురువారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌లకు విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా 56 ఏళ్లుగా ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయన్నారు. 2009లో బీసీ-ఏలో చేర్చగా కొందరు కోర్టుకు వెళ్లడంతో నిలిపివేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో ఈ అంశంపై హామీ ఇచ్చిందన్నారు. అంతకుముందు బీసీ కమిషన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సమావేశంలో సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహులు, గౌరవ అధ్యక్షులు ఎడ్ల బాబురావు, డా.ఆనందమూర్తి, ఉపాధ్యక్షుడు కటికల శ్రీహరి, నాయకులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

బోరబండ, న్యూస్‌టుడే: బస్తీ దవాఖానాల్లో సమస్యలుంటే తన దృష్టికి తేవాలని, సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని బోరబండ డివిజన్ కార్పొరేటర్ ఎం.డి.బాబాఫసియుద్దీన్ అన్నారు. సైట్-2 కాలనీ క్యాంపు కార్యాలయంలో బోరబండ ప్రాంతంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీదవాఖానాల వైద్యాధికారులతో ఆయన గురువారం సమీక్ష నిర్వహించారు. దవాఖానాల్లో అందే సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. బోరబండ, వినాయక్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు మమత, షేక్ మహబూబ్ సుభాన్, బస్తీదవాఖానాల వైద్యులు ప్రియాంక, అనురాగ, దివ్య పాల్గొన్నారు.



అలరించిన నృత్య ప్రదర్శనలు



ఉప్పల్: ఉప్పల్‌లోని శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు సందడిగా సాగుతున్నాయి. దసరా, బతుకమ్మను పురస్కరించుకొని గురువారం జయంతి నారాయణ శిష్య బృందం కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాకారులు సాత్విక, నైవేద్య, తేజస్వి, దన్విత, శ్రీనిధి, నిఖిల చాందిని, సృజన, భవ్య, స్వాతి, ఆరాధ్య, తదితరులు గణపతి స్తుతి, మండూక శబ్దం, నారాయణీయం, నటరాజస్తుతి, అన్నమాచార్య కీర్తన, త్యాగరాజ కీర్తన, తిల్లాన అంశాలపై చక్కటి నృత్యాలను ప్రదర్శించారు.

కూకట్‌పల్లి

ఎగిరిన పది నిమిషాల్లోనే వెనక్కి వచ్చిన దిల్లీ విమానం

శంషాబాద్: బయలుదేరిన పది నిమిషాల్లోనే ఓ విమానం వెనక్కి వచ్చిన ఘటన గురువారం శంషాబాద్ విమానాశ్రయంలో చోటుచేసుకుంది. ఆందోళనకు గురైన ప్రయాణికులు.. సురక్షితంగా లాండింగ్ కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఎయిర్‌పోర్ట్ అధికారుల కథనం ప్రకారం..విస్తారా ఎయిర్‌లైన్స్ యూకే-880 విమాన సర్వీస్ 143మంది ప్రయాణికులతో సాయంత్రం 6.30 గంటలకు దిల్లీకి టేకాఫ్ తీసుకుంది. విమానం ఎయిర్ కూలింగ్ వ్యవస్థలో చోటు చేసుకున్న సాంకేతిక లోపాన్ని గమనించిన పైలట్ వెంటనే ఏటీసీ అధికారులకు సమాచారం అందించాడు. వెనక్కి వచ్చిన విమానాన్ని అధికారులు ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. నిపుణులు తనిఖీ చేసి భారీ మరమ్మతులను గుర్తించడంతో ఎయిర్‌లైన్స్ ప్రతినిధులు విమాన సర్వీస్‌ను రద్దు చేశారు. 11 గంటలకు ప్రయాణికులను మరో సర్వీస్‌లో దిల్లీకి పంపించనున్నట్లు పేర్కొన్నారు.

పూలబొమ్మ.. సద్దుల బతుకమ్మ



గాయత్రీనగర్‌లో ఆటపాటలతో సందడి చేస్తున్న మహిళలు





భారీ బతుకమ్మతో ఎమ్మెల్సీ కుర్మయ్య గారి నవీన్‌కుమార్ కుటుంబసభ్యులు

కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీకాలనీ, మూసాపేట, అల్లాపూర్, న్యూస్‌టుడే: సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్ని తాకాయి. గురువారం చివరిరోజు గ్రామంలో ఆడిపాడిన మహిళలు రంగధాముని చెరువుకట్ట వద్ద వేడుకల్లో సందడిచేశారు. కేరళ, కూచిపూడి, దాండియా నృత్యాలు అలరించాయి. 15నుంచి 20అడుగుల బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ కుర్మయ్యగారి నవీన్‌కుమార్, ఎమ్మెల్యే కృష్ణారావు ప్రసంగించారు. భారీగా తయారుచేసిన కుర్మయ్యగారి నవీన్‌కుమార్, ఎంఎస్ భాస్కర్, అంజన్‌రావు, ఆంజనేయులు, డాక్టర్ చేతన్, నాగరాజు తదితరులకు ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు.





కేపీహెచ్‌బీలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి బండి రమేష్



గ్రామంలో మహిళలు



మూసాపేటలో కార్పొరేటర్ పగుడాల శిరీష



కేపీహెచ్‌బీ సర్దార్‌పటేల్‌నగర్‌లో..



బతుకమ్మతో ఎమ్మెల్యే కూతురు



కూకట్‌పల్లిలో వైద్యురాలు తదితరులు

తొందరలో ఫ్రీడం పార్కును ప్రారంభిస్తాం: ఎమ్మెల్యే



ఉద్యానాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: తొందరలో ఫ్రీడం పార్కును ప్రారంభిస్తామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం ఆయన బాలాజీనగర్‌లోని 2ఎకరాల స్థలంలో రూ.2కోట్లతో సీఎస్ఆర్ కింద ఫ్రీడం ఆయిల్ వారు అభివృద్ధి చేసిన ఉద్యానాన్ని పరిశీలించారు. తుది మెరుగులు వేగంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఆక్రమణకు గురయ్యే పరిస్థితి, అధ్వాన దుస్థితి నుంచి ఖాళీ స్థలాన్ని పరిరక్షించి ఈ పార్కును తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. ఫ్రీడం ఆయిల్ నిర్వాహకుడిని సన్మానించారు. డాక్టర్ సారికి వెంకట్రావు, మూసాపేట సర్కిల్ డీఈ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి దర్శనం.. భక్తుల నీరాజనం



ఓల్డ్‌బోయిన్‌పల్లి నల్లపోచమ్మ తల్లి విగ్రహానికి వెండి చేతులు బహూకరించిన మధుసూదన్‌గౌడ్ కుటుంబసభ్యులు



మూసాపేట చిత్తారమ్మ ఆలయంలో అమ్మవారి మెడలో రూ.1.41 లక్షల నోట్లతో తయారు చేసిన దండ



దుర్గాదేవి అలంకరణలో కేపీహెచ్‌బీ మూడో రోడ్డులోని శివాలయంలో కామాక్షమ్మవారు



సాయినగర్‌లోని భ్రమరాంబమల్లికార్జునస్వామి దేవాలయంలో అమ్మవారు



పర్వత్‌నగర్ కూడలిలో అమ్మవారి

కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీకాలనీ, మూసాపేట, అల్లాపూర్, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో దేవీశరన్నవరాత్రి వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా గురువారం 8వ రోజును పురస్కరించుకొని అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆయా ఆలయాలు కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాధ్యతలు చేపట్టిన కేపీహెచ్‌బీ ట్రాఫిక్ సీఐ



కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ ట్రాఫిక్ సీఐగా వి.జానయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. 2007 బ్యాచ్‌కు చెందిన జానయ్య మేడ్చల్ స్పెషల్ బ్రాంచ్ నుంచి బదిలీపై కేపీహెచ్‌బీ ట్రాఫిక్‌కు వచ్చారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలి



మాట్లాడుతున్న సీఐ నరసింహరాజు

బాలానగర్, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని, లేదంటే చట్టపరమైన చర్యలుంటాయని బాలానగర్ సీఐ నరసింహరాజు హెచ్చరించారు. గురువారం ఠాణా పరిధిలోని రౌడీషీటర్లతో సమావేశం నిర్వహించి జాగ్రత్తగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. ఎస్సైలు రామనారాయణ, హాజీ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవం.. వేంకన్న వైభవం



దేవాలయంలో ఉత్సవ మూర్తులకు అభిషేకం

బాలానగర్, న్యూస్‌టుడే: బాలానగర్ సాయినగర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రెండోరోజు గురువారం ఉదయం అభిషేకం, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, సామూహిక కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం కృష్ణావతార అలంకరణలో శేష వాహనంపై స్వామివారు పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

పండగ వేళ జీతాల కోసం ఎదురుచూపులు

కూకట్‌పల్లి: దసరా పండగ వేళ జీతాలు రాక జేఎన్‌టీయూ అనుబంధ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. ఫీజు రీయింబర్స్ వస్తేనే జీతాలిస్తామని యాజమాన్యాలు మెలిక పెట్టడంతో ఉద్యోగులు ఎవరికి మొర పెట్టుకోవాలో అర్థంకాక ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలువురు వర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు.

విశాలమైన స్థలంలో బతుకమ్మ

స్పందనకు వందనం

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ చౌరస్తాలో విశాలమైన స్థలంలో బతుకమ్మను ఏర్పాటుచేశారు. బతుకమ్మ వేడుకల్లో భాగంగా జీహెచ్‌ఎంసీ పేరిట ఉన్న బతుకమ్మను చౌరస్తాలో ఐలాండ్ మాదిరి విశాలమైన స్థలం అందుబాటులో ఉన్నా.. జాతీయ రహదారిలో పాదచారులు రహదారి దాటే విభాగిని, సిగ్నల్ దీపాల వద్ద ఇరుకైన స్థలంలో ఏర్పాటుచేశారు. ఈ విషయమై బుధవారం 'ఈనాడు' బతుకమ్మ ఉంచే స్థలం ఇదేనా శీర్షికన వార్త ప్రచురించింది. దీనికి స్పందించిన జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఐలాండ్ మాదిరి అభివృద్ధి చేసిన స్థలంలో బతుకమ్మను ఉంచారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

వివరాలు తెలపాల్సింది.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకే

కూకట్‌పల్లి, బాలానగర్, ఓల్డ్‌బోయిన్‌పల్లి, బాలాజీనగర్: 8008573418

కేపీహెచ్‌బీకాలనీ:8008573195, మూసాపేట:8008573423, అల్లాపూర్:9491124918

చెట్లకొమ్మల తొలగింపు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి మెట్రో స్టేషన్ సర్వీసు రోడ్డులో ఇటీవల చెట్లను కొట్టేసిన ఎలక్ట్రికల్ సిబ్బంది కొమ్మల గుట్టలను రోడ్డుపైనే వదిలేశారు. దీంతో అపరిశుభ్రత నెలకొని స్థానికులు ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. ఈ విషయాన్ని మూసాపేట సర్కిల్ పారిశుద్ధ్య అధికారుల దృష్టికి 'ఈనాడు' తీసుకెళ్లగా వారు సత్వరమే స్పందించి సిబ్బందితో చెట్లకొమ్మలను కొట్టేసి శుభ్రం చేయించి సమస్యను పరిష్కరించారు.

బస్టాప్ పరిసరాలు శుభ్రం

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ పరిధి బ్రాండ్ ఫ్యాక్టరీ పక్క రోడ్డులో బస్టాప్ పరిసరాలను జీహెచ్‌ఎంసీ సిబ్బంది శుభ్రం చేశారు. బస్టాప్ ప్రాంగణంతోపాటు పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకపోయింది. దీంతో ఇక్కడ ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. ఈ విషయమై 'ఈనాడు' మూసాపేట సర్కిల్ ఏఎమ్‌హెచ్‌వో కార్తిక్ దృష్టికి తీసుకెళ్లడంతో సిబ్బందిని పంపి బస్టాప్ పరిసరాలను శుభ్రం చేయించారు.



తొవ్విపోసి.. వదిలేసి

బాలానగర్, న్యూస్‌టుడే: బాలానగర్ నర్సాపూర్ చౌరస్తా నుంచి ఐడీపీఎల్‌కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిలో ప్రమాదకర పరిస్థితి నెలకొంది. కాలిబాట పక్కన వర్షపు నీరు నిలుస్తుండడంతో వెళ్లేందుకు వీలుగా ఇటీవల అధికారులు తవ్విపోశారు. రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. వర్షాలు పడినప్పుడు ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతుందని వాహనదారులు వాపోతున్నారు. సమస్యను పరిష్కరించాలని, తవ్విన రోడ్డు పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

అసంపూర్తి పనులు.. ప్రమాదకర పరిస్థితులు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే

ప్రశాంత్‌నగర్ వరద కాలువ నిర్మాణం పూర్తయ్యే దెన్నడో?

ఒక అభివృద్ధి పని చేపట్టినప్పుడు.. దాన్ని పూర్తిచేయాల్సిన బాధ్యత గుత్తేదారులదే. వాటిని పూర్తిచేయించాల్సిన.. ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సింది మాత్రం అధికారులే. కానీ, పనులు చేపట్టి.. మధ్యలో వదిలేయడం.. గుత్తేదారులకు అలవాటైంది. అధికారులు ప్రేక్షక పాత్రకు పరిమితమవుతున్నారు. పనులు అసంపూర్తిగా వదిలేయడంతో ప్రమాదకర పరిస్థితులు తలెత్తే ఆస్కారం ఉంటుంది. దఫాలుగా కొనసాగుతున్న కూకట్‌పల్లి డివిజన్ పరిధి ప్రశాంత్‌నగర్ వరద కాలువ కల్వర్టు పనుల గురించి తెలుసుకుందాం..



కల్వర్టు ఒకవైపు స్టీలు కట్టి వదిలేసిన కాలువ శ్లాబు



మరోవైపు ప్రమాదకరంగా ఉన్న మూతలు

అసలు చేశారు.. కొసరు మిగిల్చారు

ప్రశాంత్‌నగర్‌లో వర్షం పడితే.. వరద ముంచెత్తుతుంది. స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతూ వస్తున్నారు. ఇక్కడున్న వరద కాలువ పురాతనమైంది కావడం.. అది ధ్వంసమవడంతో.. చిన్న వర్షం పడినా రోడ్లు ముంపునకు గురవుతున్నాయి. దీనిపై 'ఈనాడు' కథనాలు ప్రచురించడంతో స్పందించిన అధికారులు ముంపు సమస్య నివారణకు వరద కాలువ పునరుద్ధరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆమోదం తీసుకున్నారు. కొన్ని మాసాల క్రితం ఈ పనులు మొదలుపెట్టి రాకపోకలకు వీలుగా చాలా వరకు పనులు పూర్తిచేశారు. పక్కాగా కాంక్రీట్‌తో కాలువ నిర్మించారు. దీంతో దాదాపుగా గతంలో తలెత్తిన వరద సమస్య తొలగిపోయింది. అసలు పనులు పూర్తయి ఇప్పటికే రెండు, మూడు మాసాలైంది. కానీ, మిగిలిన కొసరు మాత్రం అసంపూర్తిగా వదిలేశారు. రద్దీ రహదారి కావడంతో రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా.. ప్రమాదకరంగా మారింది.

జాప్యమెందుకు?

ప్రశాంత్‌నగర్ డబుల్ రోడ్డుకు ఇరువైపులా అసంపూర్తిగా శ్లాబు వదిలేశారు. వాస్తవంగా ఇది అత్యంత రద్దీ రహదారి. నెల రోజుల పాటు రెండు వైపులా గుంతలు వదిలేశారు. మరో నెల రోజులుగా ఒకవైపు స్టీలు కట్టి. . మరోవైపు బారికేడ్ పెట్టి చేతులెత్తేశారు. స్టీలు కట్టిన వైపు కనీసం జాగ్రత్తలు లేకపోవడం గమనార్హం. దశలవారీగా పనులు చేస్తూ.. మాసాల సమయం తీసుకుంటున్నా.. అధికారులు పట్టించుకోవడంలేదు. వీటికి కొనసాగింపుగా రెండువైపులా ఉన్న వరద కాలువల పునరుద్ధరణ కూడా ఇప్పటికే చేపట్టారు. ఈ పనులు కూడా మందకొడిగానే కొనసాగుతున్నాయి. వై జంక్షన్‌లో నిలుస్తున్న వరదను ఈ కాలువలోకి రప్పించేందుకు కొంత మేర రోడ్డు తవ్వి వదిలేశారు. వాస్తవంగా వినాయకచవితి పూర్తికాగానే పనులు మొదలుపెట్టాల్సి ఉన్నప్పటికీ. . జాప్యం జరుగుతూ వస్తుంది. ఈ పనులు వేగంగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


రాయదుర్గం మల్కం చెరువు వద్ద బతుకమ్మలతో మహిళలు

శేరిలింగంపల్లి

• శేరిలింగంపల్లి • పటాన్‌చెరు


చిట్కుల్‌లో బతుకమ్మ సంబరాలు



వాడవాడలా పూల వనం.. ఆడపడుచుల నీరాజనం



సద్దుల బతుకమ్మ ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మ పేర్చి.. మహిళలంతా ఒక్కచోట చేరి ఆడిపాడి సంబరాలు చేసుకున్నారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ ఆడిపాడారు. అనంతరం కొలనులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. -న్యూస్‌టుడే, బృందం


మల్కం చెరువు వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు


పటాన్‌చెరు సాకిచెరువు కట్ట వద్ద సందడి..


చందానగర్ గౌతమి నగర్ కాలనీ పార్కులో..


గోపన్‌పల్లి టీఎన్జీవోస్‌కాలనీలో భారీ బతుకమ్మ చెంత మహిళల ఆటాపాట..


పటాన్‌చెరులో బతుకమ్మలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి దంపతులు


తారానగర్ వేణుగోపాలస్వామి ఆలయంలో..


ఎల్లమ్మబండ శిల్పా బృందావన్ గేటెడ్ కమ్యూనిటీలో..


మియాపూర్ ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీలో..


అంభీర్ చెరువు వద్ద కోలాటం ఆడుతున్న ఎమ్మెల్యే గాంధీ


జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో..


టెలికాంనగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో..


చందానగర్ ప్రగతి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు


కొండాపూర్ రాఘవేంద్ర కాలనీలో..


ఆల్విన్‌కాలనీలో..

చిట్కుల్‌లో బతుకమ్మతో కాంగ్రెస్ నాయకుడు నీలం మధు దంపతులు




దుర్గాదేవి అవతారంలో బీహెచ్ఈఎల్ కనకదుర్గమ్మ


అమీన్‌పూర్‌లో..

మంగళగౌరీ.. వర ప్రదాయిని

మాదాపూర్, ఖెల్ (శేరిలింగంపల్లి), చందానగర్, పటాన్‌చెరు, ఆల్విన్‌కాలనీ, న్యూస్‌టుడే: దేవి శరన్నరాత్రి మహోత్సవాలను కన్నులపండువగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిని దుర్గాదేవిగా, మంగళగౌరీగా అలంకరించి పూజించారు. కొండాపూర్ శిల్పాపార్క్ కాలనీ రామలింగేశ్వర ఆలయంలో పండగ ప్రాశస్త్యం తెలిసేలా మహిళలు అమ్మవారి విభిన్న రూపాల అలంకరణతో నృత్యనాటిక ప్రదర్శించారు.


శిల్పాపార్క్ కాలనీ రామలింగేశ్వర ఆలయంలో నవదుర్గల అలంకరణలో మహిళల నృత్యనాటిక


అన్నపూర్ణ ఎన్‌క్లేవ్ సాయిబాబా ఆలయంలో..


ఆదిత్యనగర్ కమ్యూనిటీ హాల్‌లో మంగళగౌరీగా..


ఆల్విన్‌కాలనీ లాస్ట్ బస్టాప్ వద్ద మండపంలో..


మియాపూర్ గోకుల్ ప్లాట్స్ లో నవరాత్రి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

ప్రీమిథాన్- ద హోప్ రన్ వచ్చే నెల 17న


టీ షర్ట్, బ్రోచర్ ఆవిష్కరించిన డా.నితాషా బగ్గా, టీవర్క్స్ సీఈఓ జోగిందర్ తనికెళ్ల, నీరుస్ ఎండీ అవ్‌నిశ్, ఎక్స్‌ట్రామైల్ ఫౌండేషన్ ప్రతినిధి ప్రియా

రాయదుర్గం, న్యూస్‌టుడే: నెలలు నిండకుండానే జన్మించే శిశువుల సంరక్షణపై అవగాహనకు ఎక్స్‌ట్రామైల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వచ్చేనెల 17న 'ప్రీమిథాన్-ద హోప్ రన్ 2024' పేరుతో పరుగు నిర్వహిస్తున్నట్లు ఎక్స్‌ట్రామైల్ వ్యవస్థాపకురాలు డా.నితాషా బగ్గా తెలిపారు. రాయదుర్గం టీ హబ్‌లో గురువారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. 10, 5, 3 కిలోమీటర్ల విభాగాల్లో పరుగు ఉంటుందని చెప్పారు. టీ వర్క్స్ ప్రాంగణం నుంచి పరుగుల చేపడతామన్నారు. నెలలు నిండాకుండానే పుట్టిన పిల్లలకు సంరక్షణకు పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేసేందుకు నిధులు సమీకరిస్తామని తెలిపారు. నెలలు నిండకుండా జన్మిస్తున్న శిశువులను ప్రత్యేక పరిస్థితుల్లో సంరక్షించేందుకు భారీగా ఖర్చవుతుందన్నారు. అలాంటి వారికి తమ సంస్థ తరఫున సహకారం అందిస్తామన్నారు. ఇప్పటివరకు 197 మంది పసికందులను రక్షించామని చెప్పారు. టీవర్క్స్ సీఈఓ జోగిందర్ తనికెళ్ల, నీరుస్ ఎండీ అవ్‌నిశ్, ఎక్స్‌ట్రామైల్ ఫౌండేషన్ ప్రతినిధి ప్రియా తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పరుగు బ్రోచర్, టీ షర్ట్‌ను ఆవిష్కరించారు.

పూల కోసం వస్తే... సెల్‌ఫోన్లు కొట్టేశారు

ఆసిఫ్‌నగర్: గుడిమల్కాపూర్ హోల్‌సేల్ పూల మార్కెట్లో సెల్‌ఫోన్ దొంగలు రెచ్చిపోయారు. మార్కెట్‌లో రద్దీని తమకు అనుకూలంగా మలచుకుని పెద్దఎత్తున చరవాణులు చోరీ చేశారు. సద్దుల బతుకమ్మ, విజయదశమి నేపథ్యంలో రెండో రోజులుగా పూల మార్కెట్‌లో కొనుగోలుదారులతో కిక్కిరిసింది. రద్దీలో కలిసి పోయిన దొంగలు బుధ, గురువారాల్లో చెలరేగిపోయారు. గురువారం ఉదయం 10 గంటల వరకు దాదాపు 20 మంది సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. బాధితులంతా గుడిమల్కాపూర్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. బుధవారం మరో 20 మంది బాధితులు గుడిమల్కాపూర్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కొందరి వద్ద సెల్‌ఫోన్లకు సంబంధించిన బాక్సులు, బిల్లులు లేకపోవడంతో ఫిర్యాదు స్వీకరించలేదని సమాచారం. బుధ, గురువారాల్లో 28 మంది బాధితులు తమకు అధికారికంగా ఫిర్యాదులు చేశారని సౌత్ వెస్ట్ జోన్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి చెప్పారు. పండుగలు, పర్వదినాల సమయాల్లో సెల్‌ఫోన్ దొంగలు మార్కెట్‌లో సంచరిస్తుంటే పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

తనిఖీలు.. తాఖీదులు.. మారని తీరు

◆ హోటళ్లలో వెలుగుచూస్తున్న దారుణాలు

◆ ఆహార భద్రతా నిబంధనలు పాటించని నిర్వాహకులు

మియాపూర్, న్యూస్‌టుడే: మియాపూర్ జాతీయ రహదారిపై బొల్లారం చౌరస్తాలో ఉన్న రెండు ప్రముఖ హోటల్లో ఇటీవల జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయానికి చెందిన అధికారులు ఆహార పదార్థాల తనిఖీ నిర్వహించారు. అక్కడ ఆహారాన్ని నిల్వఉంచే విధానంతోపాటు ఎన్నో లోటుపాట్లు గుర్తించిన అధికారులు అపరిశుభ్ర వాతావరణంలో వినియోగదారులకు నాసిరకం, నిల్వ ఉంచిన ఆహారం వడ్డిస్తున్నట్లు గుర్తించి వారికి నోటీసులు జారీచేశారు. ఇదంతా ఒక ఎత్తైతే అదే హోటళ్లలో చందానగర్ సర్కిల్ ఫుడ్ సేఫ్టీ అధికారులు గతంలోనూ తనిఖీలు నిర్వహించి వారి లోటుపాట్లను గుర్తించి ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించాలని హెచ్చరించి నోటీసులిచ్చారు.

◆ ప్రస్తుతం అన్ని సర్కిళ్లలోనూ ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు అందుబాటులో ఉన్నారు. గతంలో కొద్ది మంది అధికారులు తనిఖీలు చేసేవారు. ప్రతి సర్కిల్‌కు సంబంధించిన అధికారి ప్రతి నెల 30-40 వరకు శాంపిళ్లు సేకరించడం లక్ష్యంగా పనిచేస్తున్నారు. ఆహార పదార్థాల నమూనాలను నాణ్యత నిర్ధారణకు ల్యాబ్‌కు పంపడంతోపాటు ఆ నివేదిక ఆధారంగా కేసులు నమోదు చేసి, అపరాధ రుసుం విధిస్తున్నారు.


మియాపూర్‌లోని హోటల్‌లో వంటగదిని పరిశీలిస్తున్న అధికారులు

అన్నింటిలోనూ లోపాలు

ఇటీవల టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీల్లో మియాపూర్, మదీనాగూడలోని ప్రముఖ హోటళ్లలో ఎన్నో లోపాలు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా ఆహారం నిల్వ ఉంచడం, గడువు ముగిసే తేదీతోపాటు, మాంసాహారం, కూరగాయలు ఇతర ఆహార పదార్థాలు నిల్వ ఉంచే విధానాల్లోనూ పూర్తి లోపాలున్నట్లు అధికారులు నిర్ధారించినట్లు తెలిసింది. నూనె, ఇతర మసాలా దినుసులూ నాసిరకంగా ఉన్నట్లు గుర్తించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- హృదయ, ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారి చందానగర్ సర్కిల్

ఆహార పదార్థాల విషయంలో ఫుడ్ సేఫ్టీ నిబంధనలు కచ్చితంగా పాటించాలి. లేదంటే కఠిన చర్యలు తీసుకుంటాం. అన్ని హోటళ్లను ప్రతినెలా తనిఖీ చేస్తున్నాం. మొదటిసారి హెచ్చరికలు జారీ చేస్తాం. తర్వాత తీరు మార్చుకోకుంటే కేసులు నమోదు చేయడంతోపాటు అవసరమైతే హోటళ్లను సీజ్ చేస్తాం.

◆ రెండోసారి తనిఖీల్లోనూ నిబంధనలు పాటించని వారిపై అదనపు కలెక్టర్‌కు స్థానిక ఫుడ్ సేఫ్టీ అధికారులు నివేదిక అందజేస్తారు. ఇంతజరుగుతున్నా కొందరు హోటల్ నిర్వాహకుల తీరులో ఎటువంటి మార్పు రావడంలేదని ఫుడ్ సేఫ్టీ విభాగ అధికారులు చెబుతున్నారు.

◆ ముఖ్యంగా తొలిసారి తనిఖీల్లో నోటీసులు అందజేసి మళ్లీ తనిఖీలు నిర్వహించినప్పుడు ఆహార పదార్థాల పరిశుభ్రత పాటిస్తున్నారా? లేదా? అన్న అంశాన్ని అధికారులు పరిగణనలోకి తీసుకుంటారు.

◆ సంబంధిత నివేదికలను జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయంలోని గెజిటెడ్ ఫుడ్ ఆఫీసర్‌కు స్థానిక అధికారులు పంపిస్తూ నాణ్యత ప్రమాణాలను నిర్ధారించుకుంటారు.

పరిశ్రమలో గాయపడిన కార్మికుడి మృతి

పటాన్‌చెరు: పరిశ్రమలో బాయిలర్ వద్ద పనిచేస్తూ వేడి నీరు పడి గాయపడిన కార్మికుడు చికిత్సపొందుతూ మృతి చెందాడు. బీడీఎల్ సీఐ స్వామిగౌడ్ వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం శేరిగూడెం గ్రామానికి చెందిన శంకర్ (38) పాశమైలారం పారిశ్రామికవాడ సింథోకెమ్ ల్యాబ్స్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈనెల 1న బాయిలర్ వద్ద పనిచేస్తుండగా బాయిలర్ తలుపు తెరిచినప్పుడు వేడి నీరు మీద పడింది. కాలిన గాయాలతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. శంకర్ భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

మూర్ఛతో గుర్తుతెలియని మహిళ..

పటాన్‌చెరు అర్బన్: మూర్ఛతో గుర్తుతెలియని మహిళ మృతిచెందింది. పటాన్‌చెరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు జాతీయరహదారి నుంచి వెంకటేశ్వరాకాలనీకి వెళ్లే రహదారిలో గురువారం ఉదయం గుర్తుతెలియని మహిళ(40) మూర్ఛ వచ్చి కిందపడిపోయి కొట్టుకుంటుండగా స్థానికులు 108 వాహనంలో పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మహిళ చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి సంబధీకులు ఎవరైనా ఉంటే 87126 56756లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

పార్కు స్థలం కాపాడాలని వినతి

శేరిలింగంపల్లి: సుదర్శన్ నగర్ కాలనీకి సంబంధించి 3477 గజాల విస్తీర్ణంలో ఉన్న పార్కు స్థలాన్ని కాపాడాలని జనం కోసం సంస్థ అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి కోరారు. శేరిలింగంపల్లి సర్కిల్ ఉపకమిషనర్ ముకుందరెడ్డికి వినతిపత్రం అందించారు. పార్కు స్థలంలో గతంలో అక్రమంగా ఎల్ఆర్ఎస్ చేశారని పేర్కొన్నారు. అక్రమ ఎల్ఆర్ఎస్‌నును రద్దుచేసి పార్కు స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకోవాలని కోరారు.

హిందూ శక్తి నిర్మాణానికి ఆర్ఎస్ఎస్ ధార్మిక సేవ


ఊరేగింపులో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

రామచంద్రాపురం రూరల్, న్యూస్‌టుడే: హిందూ శక్తి నిర్మాణానికి ఆర్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని విజేత సూపర్ మార్కెట్ ఎండీ జగన్మోహన్‌రావు అన్నారు. గురువారం రామచంద్రాపురంలో ఆర్ఎస్ఎస్ ఏర్పాటు జరిగి 99 ఏళ్లు పూర్తయి 100వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా జాతీయ రహదారి నుంచి రూట్ మార్చ్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రతి ఒక్కరూ ఐదు అంశాలపై సత్ప్రవర్తన కలిగి ఉండాలని చెప్పారు. సామాజిక సామరస్యత, కుటుంబ ప్రభోదన్, పర్యావరణ పరిరక్షణ, మన భాష- వేషధారణ, పౌర నియమాలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏలె శ్యాం కుమార్త ఉన్నారు.

నయనమనోహరం.. నృత్యాభినయం

మాదాపూర్, న్యూస్‌టుడే: శిల్పారామంలో గురువారం కూచిపూడి నృత్యం నయనమనోహరంగా సాగింది. నాట్యగురువు అనూషశ్రీనివాస్ శిష్యబృందం చూడ ముచ్చటైన నృత్యాభినయంతో కళాభిమానులను కట్టిపడేశారు. వారు ప్రదర్శించిన దశావతారం, తిల్లాన, గజవదన నృత్యాంశాలు అందరినీ అలరించాయి. అనంతరం టి. కె. సరోజ శిష్యబృందం, ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల బృందం సంయుక్తంగా ప్రదర్శించిన సంగీత విభావరి ఆకట్టుకుంది.




భాజపా సభ్యత్వ నమోదుకు ఆదరణ


సభ్యత్వాన్ని అందజేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రవికుమార్

మియాపూర్: భాజపా సభ్యత్వ నమోదుకు విశేష ఆదరణ లభిస్తుందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న సభ్యత్వ నమోదును ఆయన గురువారం భాజపా శేరిలింగంపల్లి ఇంఛార్జి రవికుమార్ యాదవ్‌తో కలిసి పరిశీలించారు. మియాపూర్, హైదర్‌నగర్, లింగంపల్లి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన శిబిరాల్లో పలువురికి ఆయన చేతుల మీదుగా భాజపా సభ్యత్వాన్ని అందజేశారు.

తల్లిదండ్రులకు తప్పిపోయిన బాలిక అప్పగింత

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: తప్పిపోయిన బాలికను పోలీసులు తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన దంపతులు ఇస్నాపూర్‌లో ఉంటూ కూలీ పనిచేసుకుంటున్నారు. వారి మూడేళ్ల కుమార్తె జానకి గురువారం సాయంత్రం ఇంటి వద్ద ఆడుకుంటూ వెళ్లి కనిపించలేదు. మార్కెట్ ప్రాంతంలో పోలీసులకు దొరకడంతో ఠాణాకు తీసుకొచ్చారు. పోలీసులు ఆ ప్రాంతంలో విచారించగా బాలిక తల్లిదండ్రులు వెతుకుతూ కనిపించారు. దీంతో వారిని ఠాణాకు పిలిపించి బాలికను అప్పగిపంచారు.


విజేత
Fresh Healthy Living
వినియోగదారులకు, మిత్రులకు
శ్రేయోభిలాషులకు మరియు
సిబ్బందికి
విజయదశమి శుభాకాంక్షలు
KHEERA ₹29 Vijetha Price PER KG
CABBAGE ₹29 Vijetha Price PER KG
BEET ROOT ₹34 Vijetha Price PER KG
COCONUT ₹35 Vijetha Price PER PC
PUMPKIN (DISCO MINI / RED / WHITE) ₹36 Vijetha Price PER KG
POTATO ₹49 Vijetha Price PER KG
MIRCHI (BLACK / GREEN) ₹49 Vijetha Price PER KG
TURAI (RIDGE GOURD) ₹55 Vijetha Price PER KG
BANANA RAW ₹59 Vijetha Price PER KG
BENDI / DONDA ₹59 Vijetha Price PER KG
ONION RED ₹65 Vijetha Price PER KG
TOMATO LOCAL ₹79 Vijetha Price PER KG
LEMON ₹149 Vijetha Price PER KG
KIRAN MELON ₹32 Vijetha Price PER KG
BANANA FRUIT ₹45 Vijetha Price PER KG
PAPAYA / ORANGE NAGPUR ₹59 Vijetha Price PER KG
APPLE SHIMLA ₹159 Vijetha Price PER KG
POMEGRANATE ₹299 Vijetha Price PER KG
ORIGINAL KIMIA DATES / ELEPHANT DATES KIMJO 400G BOX BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 310/320
SUNFEAST YIPPEE NOODLES ATTA 280G BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 112
BINGO NO RULZ MASALA CURLZ 80G / BINGO MAD ANGLES ACHAARI MASTI 130G BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 50
SUNFEAST DARK FANTASY CHOCO FILLS 600G BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 350
LAL SWEETS (ENTIRE RANGE) BUY 1 GET 1 FREE Vijetha Offer
HERSHEY'S MILKSHAKE CHOCOLATE 180ML BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 40
MANGALDEEP AGARBATTI SANDAL 160 STICKS BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 120
NIVEA BODY LOTION COCOA NOURISH 400ML / SOFT CREME LIGHT MOISTURIZER 300ML NOURISHING BODY MILK 600ML / BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 399-625
BRUT 200MLDEO (SELECTED RANGE) BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 399
MR MUSCLE TOILET CLEANER 500ML BUY 2 GET 1 FREE Vijetha Offer MRP ₹ 105
ODONIL ROOM SPRAY 240ML (ENTIRE RANGE) BUY 1 GET 1 FREE Vijetha Offer MRP ₹ 169
HERITAGE GHEE COW 1000ML POUCH ₹599 ONLY Vijetha Price MRP ₹ 685
RAAGA SUNFLOWER OIL 1LTR POUCH ₹125 ONLY Vijetha Price MRP ₹ 145
HERITAGE PANEER 200G ₹99 ONLY Vijetha Price MRP ₹ 120
DAAWAT SUPER BASMATI RICE 1KG ₹179 ONLY Vijetha Price MRP ₹ 232
AASHIRVAAD VERMICELLI NON ROASTED 850G ₹49 ONLY Vijetha Price MRP ₹ 75
AASHIRVAAD GULAB JAMUN MIX 175G ₹56 ONLY Vijetha Price MRP ₹ 145
HERITAGE DOODH PEDA 200G ₹99 ONLY Vijetha Price MRP ₹ 125
MCCAIN FRENCH FRIES 420G ₹80 ONLY Vijetha Price MRP ₹ 120
MAGGI NOODLES MASALA 560G ₹12 OFF ON MRP Vijetha Offer MRP ₹ 112
MINUTE MAID PET PULPY ORANGE 1LT ₹15 OFF ON MRP Vijetha Offer MRP ₹ 90
PARACHUTE COCONUT OIL 600ML ₹44 OFF ON MRP Vijetha Offer MRP ₹ 273
ARIEL MATIC LIQUID 3.2LTR POUCH (FRONT / TOP LOAD) ₹130 OFF ON MRP Vijetha Offer MRP ₹ 729/719
VIM SOAP ANTI SMELL 200G*5PC SET (PUDINA / NEEM) ₹15 OFF ON MRP Vijetha Offer MRP ₹ 130
OFFERS VALID FROM 11th TO 13th OCTOBER 2024 ONLY. VISIT OUR STORE FOR MANY MORE OFFERS
Download the App & get groceries delivered in 60 mins
SINCE 1999 In Customer Service
Vijetha Supermarkets Pvt. Ltd.
Telangana & Andhra Pradesh
vijethasupermarkets
VijethaSuperMarketsPvtLtd
Scan to download app
*T&C Apply.

కుత్బుల్లాపూర్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ స్పష్టం చేశారు. వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు గురువారం ఆయనను కలిసి వినతిపత్రాలు అందజేసిన సందర్భంగా మాట్లాడారు. మెరుగైన వసతులు కల్పించడంతోపాటు ప్రజల జీవన విధానాల్లో మార్పులేవాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యమన్నారు.


కరపత్రం స్వీకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

మార్కెట్ కమిటీ సభ్యులకు అభినందనలు

నిజాంపేట, న్యూస్‌టుడే: వ్యవసాయ, సహకార మార్కెట్ యార్డ్ మేడ్చల్ జిల్లా కమిటీకి నూతనంగా ఎన్నికైన సభ్యులను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొలను హన్మంత్‌రెడ్డి గురువారం అభినందించారు. బాచుపల్లిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బొమ్మలపల్లి నరసింహులు(ఛైర్మన్), డైరెక్టర్లు బిక్షపతి, వినోద్, శ్వేతలను ఆయన శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పాలకృష్ణ, నేతలు సంజీవరెడ్డి, రజాక్, రామారావు, బాల నర్సింహులు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సభ్యులతో హన్మంత్‌రెడ్డి

సద్దుల బతుకమ్మ.. సల్లంగ చూడమ్మ


కొంపల్లిలో కౌన్సిలర్ బైరి శ్రీవిద్య తదితరులు


స్ప్రింగ్‌ఫీల్డ్ కాలనీలో..


బాచుపల్లి హరితవనం కాలనీలో..


బౌరంపేట బస్టాప్ వద్ద ..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో గురువారం సద్దుల బతుకమ్మ పండగను వైభవంగా నిర్వహించారు. ప్రధాన కూడళ్ల వద్ద మహిళలు బతుకమ్మ ఆడుతూ పాటలు పాడారు. మహిళలు ఇళ్ల నుంచి వెంట తెచ్చుకున్న ప్రసాదాలను ఒకరికొకరు ఇచ్చి, పుచ్చుకున్నారు. కోనేర్లు, చెరువులు, తాత్కాలిక కొలనుల్లో భక్తిశ్రద్ధలతో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

– న్యూస్‌టుడే, దుండిగల్, పేట్‌బషీరాబాద్, జీడిమెట్ల, కుత్బుల్లాపూర్, నిజాంపేట


వేమనరెడ్డి కాలనీలో..


సంజయ్‌గాంధీనగర్‌లో..


చిత్తారమ్మ ఆలయ ప్రాంగణంలో ..


బౌరంపేట పెద్ద చెరువు వద్ద..



బతుకమ్మలతో యువతులు, చిన్నారి


శ్రీరాంనగర్ కాలనీలో..


బౌరంపేట కీర్తి హోమ్స్ వద్ద..


మల్లంపేట పోచమ్మ దేవాలయం వద్ద..


మహాదేవపూర్‌లో..


నిజాంపేటలో బతుకమ్మ ఆడుతున్న మేయర్ నీలారెడ్డి తదితరులు


బాచుపల్లిలో ..


దూలపల్లిలోని అశోక-అలా-మైసన్ గేటెడ్ కమ్యూనిటీలో..


శంభీపూర్‌లో..

మేమున్నాం.. మీకు తోడుగా..

కుత్బుల్లాపూర్ - 80085 73403, దుండిగల్ - 80085 73410
షాపూర్‌నగర్: 8008573404, పేట్‌బషీరాబాద్: 8008573405
నిజాంపేట: 8008573423, జీడిమెట్ల: 8008574405

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే:

? కైసర్‌నగర్‌లో ప్రధాన రహదారి ధ్వంసమైంది. మురుగు కాలువలు శిథిలం కావడంతో మురుగు దిగువకు వెళ్లే అవకాశం లేక పొంగిపొర్లి రహదారి మీదుగానే ప్రవహిస్తోంది. రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. – ఏకుల బాలకృష్ణ, కైసర్‌నగర్

✓ ఆ కాలనీలో రహదారులు, మురుగు కాలువల పునరుద్ధరణకు ఇటీవలే అంచనాలు రూపొందించాం. నిధులు మంజూరు కాగానే టెండర్లు నిర్వహించి పనులు చేపడుతాం.– కిష్టప్ప, ఈఈ గాజులరామారం సర్కిల్

? మెట్టుకానిగూడ రోడ్డులో వీధి దీపాలు సరిగా వెలగడంలేదు. రాత్రి అంధకారం నెలకొంటోంది. ఈ రహదారిపై రాకపోకలు సాగించే వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.– వెంకటేశ్‌గౌడ్, మెట్టుకానిగూడ.

✓ సిబ్బందిని పంపించి వెలగని దీపాలను పునరుద్ధరింపజేస్తాం.
– రఘుపతిరెడ్డి, డీఈ, ఎలక్ట్రికల్ విభాగం గాజులరామారం సర్కిల్

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం


ధనుంజయుడు

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం చెందగా, సహ డ్రైవర్ గాయపడ్డాడు. పేట్‌బషీరాబాద్ సీఐ కె.విజయవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం... మేడ్చల్ మండలం గుండ్ల పోచంపల్లి గ్రామానికి చెందిన ధనుంజయుడు(19), శ్రీరాములు(19) ప్రైవేటు గోదాములో డ్రైవర్లుగా పని చేస్తున్నారు. బుధవారం రాత్రి 10.30 గంటలకు వారు ద్విచక్రవాహనంపై గోదాము వైపు వెళ్తున్నారు. గుండ్లపోచంపల్లి సమీపంలో వెనుక నుంచి వచ్చిన డీసీఎం వాహనం వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ద్విచక్రవాహనాన్ని నడుపుతున్న ధనుంజయుడు కింద పడటంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వెనుక కూర్చున్న శ్రీరాములు కుడి చేయి విరిగింది. అతడిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాన్షీరామ్ ఆశయసాధనకు కృషి చేయాలి

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ ఆశయసాధనకు కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. సుందరయ్య కళానిలయంలో గురువారం రాత్రి తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ రాజ్యాధికార సాధన ఐకాస ఆవిర్భావం జరిగింది. ఈ సందర్భంగా ఐకాస రాష్ట్ర బాధ్యుడిగా డా.విశారదన్ మహారాజ్, ప్రతినిధులుగా రాఘవేంద్ర ముదిరాజ్, శ్రీహరి, శ్రీనివాస్‌యాదవ్, శివగౌడ్, వినోద్‌యాదవ్, హరీశ్‌గౌడ్, అబ్దుల్ రెహమాన్, సాయిబాబా, దుర్గాప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తొలుత వారంతా కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాలర్పించారు. ఈ సందర్భంగా విశారదన్ మహారాజ్ సహా ప్రతినిధులు మాట్లాడుతూ.. బహుజనులు రాజ్యాధికారాన్ని సాధించే దిశగా ముందుకెళ్తామని పేర్కొన్నారు.

అటకెక్కిన చెరువు సుందరీకరణ

● కట్ట బలోపేతం చేసి వదిలేశారు ● పేరుకుపోయిన తుంగ, గుర్రపు డెక్క

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: చెరువుల సుందరీకరణలో చిత్తశుద్ధి కొరవడుతోంది. ప్రతిపాదించిన పనులు సకాలంలో పూర్తిచేయకపోగా అర్ధాంతరంగా నిలిపివేయడం విమర్శలకు తావిస్తోంది. టెండర్లను ఆహ్వానించడంతోనే తమ పని అయిపోయినట్లుగా అధికారులు భావిస్తుండటంతో గుత్తేదార్లు ఇష్టారాజ్యంగా పనులు నిర్వహించారు.

ఇదీ పరిస్థితి

కుత్బుల్లాపూర్ సర్కిల్ హెచ్‌ఎంటీ కాలనీలో 20 ఎకరాల్లో హెచ్‌ఎంటీ చెరువు ఉంది. హెచ్‌ఎంటీ కంపెనీ ఆవిర్భావానికి ముందు ఈ తటాకం నిరంతరం నీటితో తొణికిసలాడేది. గ్రామ పంచాయతీ హయాంలోనే ఎగువ భాగంలోని ప్రభుత్వ భూముల్లో పలు బస్తీలు, కాలనీలు వెలిశాయి. వాటి మురుగు నీటి అవుట్‌లెట్లను ఈ చెరువు నాలాలోకి అనుసంధానం చేశారు. దీంతో మంచి నీటితో కళకళలాడిన చెరువు క్రమంగా మురికికూపంగా మారింది. 2000 సంవత్సరంలో జలయజ్ఞం కార్యక్రమంలో భాగంగా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కుత్బుల్లాపూర్ పురపాలక సంఘం పాలకవర్గం రూ.10 లక్షలతో సుందరీకరించడానికి శ్రీకారం చుట్టారు. చెరువు కట్టను బలోపేతం చేసి పూడిక తొలగించారు. అనంతరం నిర్వహణను గాలికి వదిలేయడంతో యథాస్థితికి చేరింది.


అరకొరగా కట్ట బలోపేతం


తటాకంలో పెరిగిన తుంగ

రూ.కోటితో టెండర్లు

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జీహెచ్‌ఎంసీ నీటి పారుదల విభాగం అధికారులు ఏడాది క్రితం ఈ చెరువును సుందరీకరించడానికి ముందుకు వచ్చారు. చెరువు కట్ట బలోపేతం, మురుగు మళ్లింపు కాలువ నిర్మాణం, గుర్రపు డెక్క తొలగించడం వంటి పనుల నిర్వహణకు రూ. కోటితో టెండర్లు నిర్వహించారు. పనులను దక్కించుకున్న గుత్తేదారు అరకొరగా చెరువు కట్టను బలోపేతం చేసి, ఇసుకకు బదులు రాతిపొడితో మురుగు కాలువ నిర్మించి చేతులెత్తేశాడు. చెరువులో ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లు, తుంగ, గుర్రపు డెక్క తొలగించలేదు. సంబంధిత అధికారులు స్పందించి చెరువు సుందరీకరణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు చేపట్టి.. అసంపూర్తిగా వదిలేసి

దుండిగల్, న్యూస్‌టుడే: ఒక అడుగు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కి అన్న చందంగా బౌరంపేటలో రెండు పడక గదుల ఇళ్ల భవన నిర్మాణ పనులు సాగాయి. చివరకు పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. గత ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం చేపట్టింది. ప్రస్తుతం ఈ పథకం అమలులో లేకపోవడంతో వాటి పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. కనీసం నిలిచిన నిర్మాణ పనులనైనా పూర్తిచేసి వాటిని నిరుపేదలకు అందజేయాలని స్థానికులు కోరుతున్నారు.

అడుగడుగునా ఆటంకాలు..

దుండిగల్ పురపాలిక పరిధి బౌరంపేటలో మొత్తం 1620 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సర్వే నంబర్ 166లో ఇళ్ల నిర్మాణానికి 10.19 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. 2017లో గుత్తేదారుకు పనులను అప్పగించారు. పనులు దక్కించుకున్న గుత్తేదారు ఆశించిన స్థాయిలో నిర్మాణాలు చేపట్టలేదు. అదే సమయంలో కేటాయించిన స్థలంపై వివాదం నెలకొంది. అధికారులు స్పందించి స్థల వివాదాన్ని పరిష్కరించారు. అయినా పనులు ముందుకు సాగకపోవడంతో గుత్తేదారును మార్చి 2020లో మరో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు.


బౌరంపేటలో రెండు పడక గదుల ఇళ్ల దుస్థితి

ప్రతి బ్లాక్‌లో 108 ఇళ్లు..

ప్రతి బ్లాక్‌లో 108 ఇళ్ల చొప్పున 1620 ఇళ్లను మొత్తం 15 బ్లాక్‌ల్లో నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం 820 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. వాటిలో కొన్ని పనులు చివరి దశలో ఉండగా.. మరికొన్ని ప్రారంభ దశలో ఉన్నాయి. గుత్తేదారుని మార్చిన తర్వాత పనులు కొద్దిగా ముందుకెళ్లిన పూర్తిస్థాయిలో నిర్మాణాలు జరగలేదు. విలువైన ప్రభుత్వ భూమి నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం బౌరంపేటలో బహిరంగ మార్కెట్‌లో ఎకరం స్థలం రూ.15 కోట్లకుపైగా ఉంది. ఇళ్ల నిర్మాణానికి రూ.150 కోట్లకుపైగా విలువచేసే భూమిని కేటాయించారు. ప్రభుత్వం స్పందించి ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని పురపాలిక వాసులు కోరుతున్నారు.

ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి

జవహర్‌నగర్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడిగా జవహర్‌నగర్‌కు చెందిన భారాస నాయకుడు జిట్టా శ్రీనివాస్‌రెడ్డిని నియమించారు. గురువారం ఉద్యమకారుల ఫోరం కమిటీ రాష్ట్ర ఛైర్మన్ చీమ శ్రీనివాస్ నియామక పత్రాన్ని అందజేశారు.

ఉచిత న్యాయ సహాయం పొందేందుకు టోల్ ఫ్రీ నంబర్

కాప్రా, న్యూస్‌టుడే: పేద మధ్యతరగతి ప్రజలకు న్యాయపరమైన సేవలను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబరు 15100ను ఆశ్రయించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బాలభాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయాన్ని అందించేందుకు దిల్లీలోని జాతీయ న్యాయసేవా సాధికార సంస్థ అందుబాటులోనికి తీసుకొచ్చిందని ఆయన పేర్కొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

ఉప్పల్, న్యూస్‌టుడే: ఉప్పల్‌లోని శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు సందడిగా సాగుతున్నాయి. దసరా, బతుకమ్మను పురస్కరించుకొని గురువారం జయంతి నారాయణ శిష్య బృందం కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాకారులు సాత్వి, నైవేద్య, తేజస్వి, ధన్విత, శ్రీనిధి, నిఖిల చాందిని, సృజన, భవ్య, స్వాతి, ఆరాధ్య, తదితరులు గణపతి స్తుతి, మండూక శబ్దం, నారాయణీయం, నటరాజస్తుతి, అన్నమాచార్య కీర్తన, త్యాగరాజ కీర్తన, తిల్లాన అంశాలపై చక్కటి నృత్యాలను ప్రదర్శించారు.

పారిశ్రామిక వాడల్లో దసరా సందడి


ముస్తాబైన జంట సర్కిళ్ల కార్యాలయాల పట్టణ ప్రణాళిక విభాగం

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: పారిశ్రామిక వాడల్లోని పలు కంపెనీల్లో ఆయుధ(యంత్ర) పూజలతో సందడి నెలకొంది. దసరా పండగకు ఒక్రెండు రోజుల ముందు నుంచే కంపెనీల్లో ఈ పూజలు నిర్వహించడం ఆనవాయితీ. గురువారం పలు కంపెనీల్లో యంత్ర పూజలు చేశారు. ఉదయం నుంచే యంత్రాలను శుభ్రం చేసి పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. వాటిలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు నూతన వస్త్రాలు ధరించి తమ కుటుంబాలతో పాల్గొన్నారు. జంట సర్కిళ్ల కార్యాలయాల పట్టణ ప్రణాళిక విభాగాలను పూలతో అలంకరించి దుర్గామాత పూజలు చేశారు.

కొండెక్కిన పూల ధరలు..

సద్దుల బతుకమ్మ, కంపెనీల్లో ఆయుధ పూజ నేపథ్యంలో పూల ధరలు కొండెక్కాయి. వ్యాపారులు రెట్టింపు ధరలకు విక్రయించారు. ప్రధాన మార్కెట్లలో, కూడళ్లు, రహదారులు, బస్టాపుల పక్కన విరివిగా పూల దుకాణాలను ఏర్పాటు చేశారు. నిన్నటి వరకు కిలో రూ.20-30 వరకు విక్రయించిన బంతి పూలు రూ.100-120, చామంతి పూలురూ.450-600 వరకు విక్రయించారు. సైజును బట్టి ఒక్కో గుమ్మడి కాయను రూ.100 నుంచి రూ. 150 వరకు విక్రయించారు. గునుగు, తంగేడు పూలకు డిమాండ్ పెరగడంతో చిరు వ్యాపారులు వాటి ధరలు కూడా రెట్టింపు చేసి విక్రయించారు.

మార్కెట్‌కు పండగ శోభ

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: మార్కెట్‌కు పండగ శోభ వచ్చింది. దసరా, సద్దుల బతుకమ్మ నేపథ్యంలో షాపూర్‌నగర్ మార్కెట్ కొనుగోలుదారులతో కిటకిటలాడింది. గ్రామీణ ప్రాంతాల నుంచి పూలను తీసుకొచ్చి రోడ్లపై విక్రయించారు. గుమ్మడి కాయలు విపరీతంగా వచ్చాయి.


షాపూర్‌నగర్‌లో రోడ్డు పక్కన పూల వ్యాపారులు

ఆదుకోవమ్మా.. ఆదిపరాశక్తి


మార్కండేయనగర్‌లో ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ


గాజులరామారం చిత్తారమ్మ దేవాలయంలో..


మల్లంపేట గడీల మైసమ్మ ఆలయంలో..


గాజులరామారం చిత్తారమ్మదేవి


దూలపల్లిలో దుర్గాదేవిగా..


బాచుపల్లి సాయి అనురాగ్‌కాలనీలో..


బాచుపల్లి హరితవనం కాలనీలో ..


జగద్గిరిగుట్టలో కార్పొరేటర్ జగన్ తదితరులు

పేట్‌బషీరాబాద్, దుండిగల్, నిజాంపేట, న్యూస్‌టుడే: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గురువారం దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమార్చన చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, నాయకులు, స్థానికులు భక్తిశ్రద్ధలతో దుర్గామాతకు పూజలు చేశారు.


ఎన్సీఎల్‌కాలనీలోని వేంకటేశ్వరాలయంలో ..


మల్లంపేట పోచమ్మ దేవాలయంలో..


పేట్‌బషీరాబాద్ కట్టమైసమ్మ ఆలయంలో


దుర్గాఎస్టేట్స్‌లోని ధైర్యలక్ష్మీగా..



క్లాక్‌టవర్ పార్కు.. కళావిహీనం

ట్రాఫిక్ సాకుతో నిరుపయోగం

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: నగర నడిబొడ్డున ఉన్న సికింద్రాబాద్‌లోని క్లాక్‌టవర్ పార్కులోకి సందర్శకులను అనుమతించకపోవడంతో కళావిహీనంగా మారింది. నిరుపయోగంగా ఉంది. రద్దీ ప్రదేశం కావడం, సందర్శకుల వాహనాల్లో వస్తే అక్కడే ట్రాఫిక్ ఇబ్బందులను కలిగే అవకాశాలు ఉంటాయని భావిస్తున్న అధికారులు పార్కింగ్‌ను సాకుగా చూపుతూ సందర్శకుల అనుమతిని నిలిపివేశారు. దీంతో సందర్శకులు నిరాశ చెందుతున్నారు. ఈ పార్కుకు చారిత్రక ప్రాముఖ్యత ఉంది. నిజాం కాలంలో ఈ పార్కును తీర్చిదిద్దారు. దీని ప్రాంగణంలో పెద్ద గోడ గడియారాన్ని 1910లో నెలకొల్పారు. 1969లో జరిగిన తెలంగాణ ఉద్యమానికి గుర్తుగా అమర వీరుల స్మారక స్తూపాన్ని నిర్మించారు. అయితే రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా 1989లో పార్కును నాలుగు వైపులా కుదించారు. పార్కును రీ డిజైన్ చేసి త్వరలో సందర్శకులు అందుబాటులోకి వచ్చేవిధంగా చర్యలు తీసుకుంటామని సికింద్రాబాద్ అర్బన్ బయోడైవర్సిటీ మేనేజర్ గణేష్ తెలిపారు.

● 2005లో క్లాక్‌టవర్ పార్కు ప్రాంగణంలో కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో రాజీవ్ గృహకల్ప స్తూపాన్ని ఆవిష్కరించారు. 2012లో జీహెచ్ఎంసీ రూ.80 లక్షలతో పార్కును పునర్నిర్మించింది. ల్యాండ్ స్కేపింగ్‌తోపాటు పచ్చిక బయళ్ల ఏర్పాటు, కళాత్మకంగా నిలిచే బెంచీలు, వాకర్లకు ట్రాక్ వంటి సదుపాయాలను కల్పించారు.

> క్లాక్‌టవర్ పార్కును అభివృద్ధి చేసినప్పటికీ, పిల్లల కోసం ఎలాంటి ఆట పరికరాలు ఏర్పాటు చేయలేదు. పార్కులో వాకర్లను అనుమతించాలని స్థానికులు కోరుతున్నారు.

సికింద్రాబాద్

• సికింద్రాబాద్ • కంటోన్మెంట్ • సనత్‌నగర్

చాత్తాద శ్రీవైష్ణవ సంఘ కార్పొరేషన్ ఏర్పాటుకు వినతి



సికింద్రాబాద్, న్యూస్‌టుడే: చాత్తాద శ్రీవైష్ణవ సంఘానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్ కోరారు. గురువారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. 60 రోజుల్లో కులగణన చేపడుతున్నట్లు సీఎం ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



దుర్గాదేవి అలంకరణలో బల్కంపేట ఎల్లమ్మ



అమీర్‌పేట కనక దుర్గా అమ్మవారు



సనత్‌నగర్ కనకదుర్గా అమ్మవారు



అమీర్‌పేట రాజరాజేశ్వరీ అమ్మవారు



ప్రకాశ్‌నగర్ శ్రీ భూలక్ష్మి అమ్మవారు



సింధీ కాలనీ సీతారామ స్వామి మఠం దేవాలయంలో



బీకేగూడ దాసారం బస్తీ మూర్తి ఆసుపత్రి వద్ద



వెస్ట్ మారేడుపల్లి అల్లాడి వెంకయ్యనగర్ శ్రీమైసమ్మ ఆలయంలో



లాలాపేటలో దుర్గామాతగా అమ్మవారు

కనక దుర్గాదేవిగా అమ్మవారు



బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకున్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్



న్యూబోయిగూడలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ

దేవీ శరన్నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆలయాల్లో గురువారం అమ్మవార్లను కనకదుర్గాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని కళాసిగూడలోని దుర్గామాత మండపంలో అమ్మవారిని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువతో ఘనంగా సన్మానించారు. సికింద్రాబాద్ సిటీలైట్ చౌరస్తా సమీపంలో ఓల్డ్ గ్యాస్‌మండి ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఏర్పాటు చేసిన గణపతి మండపంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు ప్యాడ్‌లను అప్పగించారు.

– న్యూస్‌టుడే, అమీర్‌పేట, సంజీవరెడ్డినగర్, మారేడుపల్లి, లాలాపేట, రెజిమెంటల్‌బజార్



కళాసిగూడలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



ఎస్సార్‌నగర్ జలమండలి కార్యాలయంలో జీఎం హరిశంకర్, అధికారులు



సనత్‌నగర్ దుర్గా మండపంలో బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెల్లాల రామ్మోహన్



గురుమూర్తినగర్ ఆలయంలో మాజీ కార్పొరేటర్ శేషుకుమారి



బేగంపేట కట్టమైసమ్మ ఆలయంలో ఛైర్మన్ సుభాష్ ముదిరాజ్, ఈఓ అంబుజ

తలసానికి శుభలేఖ అందజేత



సనత్‌నగర్, న్యూస్‌టుడే: ఈనెల 27న జరిగే తన కుమార్తె వివాహానికి హాజరుకావాలని కోరుతూ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు శుభలేఖను అందజేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి గురువారం మారేడుపల్లిలోని తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసానికి చేరుకుని శుభలేఖ ఇచ్చారు.

రామలీలా మైదానంలో రావణ దహనం రేపు

సనత్‌నగర్, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా విజయదశమి రోజైన శనివారం సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం ఆవరణలో రావణ దహనానికి ఏర్పాట్లు చేశారు. దేవస్థానం ఆవరణలోని రామలీలా మైదానంలో జరిగే శమీపూజ అనంతరం రావణ దహనం కోసం 45 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని తయారు చేయించారు. రాత్రి 7.30 గంటలకు రావణ దహన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని దేవస్థాన ఈఓ జి.సత్యనారాయణ, ఆలయ సమన్వయకర్త కాటం శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

మానసిక ఆరోగ్యం, చికిత్సలపట్ల అవగాహన కల్పించాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్



జస్టిస్ సుజోయ్ పాల్‌ను సన్మానిస్తున్న మానసిక చికిత్సాలయ సిబ్బంది

అమీర్‌పేట, న్యూస్‌టుడే: మానసిక ఆరోగ్యం, చికిత్సలపట్ల ప్రతీఒక్కరికీ అవగాహన కల్పించాలని హైకోర్టు న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ సుజోయ్ పాల్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల ముగింపు సందర్భంగా ఎర్రగడ్డలోని ప్రభుత్వ మానసిక చికిత్సాలయంలో రోగులు, రోగి సహాయకులకు, ఆసుపత్రి సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మానసిక ఆరోగ్య చట్టానికి సంబంధించిన విషయాలను వివరించారు. మానసిక అనారోగ్యానికి ఉచిత వైద్య సేవలు అందుకోవడం బాధితుల హక్కన్నారు. మహిళా, క్లోజ్డ్, ఫోరెన్సిక్ వార్డులను సందర్శించారు. న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి, జిల్లా సెషన్స్ జడ్జి పంచాక్షరి, సంజీవరెడ్డినగర్ ఏసీపీ వెంకటరమణ ప్రభుత్వ మానసిక చికిత్సాలయం సూపరింటెండెంట్ డా.అనిత, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.పద్మజ హాజరయ్యారు.

రాష్ట్ర గవర్నర్‌కు అలయ్-బలయ్ ఆహ్వానం



గవర్నర్‌కు పత్రిక ఇస్తున్న విజయలక్ష్మి

అమీర్‌పేట, న్యూస్‌టుడే: నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈనెల 13న నిర్వహించనున్న అలయ్-బలయ్ కార్యక్రమానికి హాజరుకావలసిందిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు అలయ్-బలయ్ కమిటీ ప్రతినిధులు ఆహ్వాన పత్రికను అందజేశారు. గురువారం రాజ్‌భవన్‌లో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె అలయ్-బలయ్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి, భాజపా జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యామ్‌సుందర్, గౌతంరావు, మాజీ ఎమ్మెల్యే, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామచంద్రారెడ్డి తదితరులు గవర్నర్‌కు ఆహ్వాన పత్రిక అందజేసినవారిలో ఉన్నారు.

'గాంధీ'లో వరల్డ్ మెంటల్‌డేపై అవగాహన



గాంధీ ఆసుపత్రి, న్యూస్‌టుడే: వరల్డ్ మెంటల్ డే సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం గాంధీఆసుపత్రిలో ర్యాలీ నిర్వహించి మానసిక ఆరోగ్యంపై అవగాహన నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజకుమారి, కళాశాల ప్రిన్సిపల్ ఇందిర, వైస్ ప్రిన్సిపల్ రవిశేఖర్, ఆర్ఎంఓ-1 శేషాద్రి, ఆర్ఎంఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోళ్ల నుంచి పూడికతీత

సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: 'ఇదో మురుగు రహదారి' శీర్షికతో 'ఈనాడు'లో గురువారం ప్రచురితమైన కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. బీకేగూడ నల్లపోచమ్మ దేవాలయం, పార్కు పరిసర ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టారు. పూడికలు తొలగించారు. మురుగునీరు సక్రమంగా వెళ్లేలా చేశారు.

తెలంగాణ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా డా.సింగం శ్రీనివాస్‌రావు



సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్(320ఎ) తెలంగాణ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా డా.సింగం శ్రీనివాస్‌రావు నియమితులయ్యారు. లయన్స్ భవన్‌లో గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ గవర్నర్ లయన్స్ డా.కోటేశ్వరరావు ఆయనకు శాలువతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

డా.కొండా నాగేశ్వర్‌కు విజయనందిని పురస్కారం



లాలాపేట, న్యూస్‌టుడే: ఉస్మానియా యూనివర్సిటీ సివిల్స్ అకాడమీ డైరెక్టర్ డా.కొండా నాగేశ్వర్‌కు శిఖరం ఆర్ట్స్ అకాడమీ.. విజయనందిని పురస్కారాన్ని ప్రదానం చేసింది. త్యాగరాజ గానసభలో గురువారం జరిగిన రాష్ట్రస్థాయి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి ఆయనకు అవార్డు అందజేశారు.

రతన్‌టాటాకు నివాళి

బౌద్ధనగర్, న్యూస్‌టుడే: రతన్‌టాటా దేశానికి చేసిన సేవలు అనిర్వచనీయమని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్ గౌడ్ అన్నారు. గురువారం పార్సిగుట్టలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.



వెస్టు మారేడ్పల్లి న్యూక్లబ్ అండ్ ఫ్యామిలీ స్పోర్ట్స్ క్లబ్‌లో



జయభారతి పాఠశాల వద్ద



ఎస్సార్‌నగర్ సి-టైపు కాలనీలో


సద్దుల బతుకమ్మ సందడి



జెక్ కాలనీలో తలసాని శ్రీనివాస్ యాదవ్

సద్దుల బతుకమ్మ వేడుకలు సోమవారం రాత్రి వాడవాడలా వైభవంగా మహిళలు నిర్వహించుకున్నారు. వివిధ రకాల పూలతో అందంగా తయారుచేసిన బతుకమ్మలను ఒకచోట పేర్చి వాటి చుట్టూ తిరుగుతూ ఆటాపాటలతో అలరించారు. డీజేలు పెట్టి బతుకమ్మ పాటలతో ఆయా ప్రాంతాలు హోరెత్తాయి.

– న్యూస్‌టుడే, సంజీవరెడ్డినగర్, రెజిమెంటల్‌బజార్, మారేడుపల్లి, సనత్‌నగర్, బేగంపేట, సికింద్రాబాద్, కంటోన్మెంట్, లాలాపేట



సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్ కాలనీలో నగర సీపీ సీవీ ఆనంద్



దాండియా ఆడుతున్న యువతులు



తార్నాక డివిజన్ శాంతినగర్ తక్షశిల పాఠశాల వద్ద అర్యవైశ్య ప్రతినిధులు



బేగంపేట మెట్రోభవన్‌లో..

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



కంటోన్మెంట్, న్యూస్‌టుడే: మతిస్థిమితం సరిగాలేని వ్యక్తి అదృశ్యమయ్యాడు. మారేడుపల్లి ఎస్సై లక్ష్మీనారాయణ వివరాల ప్రకారం... మారేడుపల్లి సెకండ్ లక్ష్మీనగర్ బస్తీకి చెందిన నర్సింగ్(47) గతంలో ఆటో నడిపేవాడు. కొద్దిసంవత్సరాలుగా అతని మతిస్థిమితం సరిగా లేక ఇంటివద్దే ఉంటున్నాడు. ఈనెల 3న ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు.

చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ 6, 7 ప్లాట్‌ఫాంపై ఈనెల 5న అపస్మారక స్థితిలో ఉన్న వృద్ధుడి (75)ని పోలీసులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. ప్రయాణికులు సమాచారం ఇవ్వగా అతన్ని 108లో గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతడు బుధవారం రాత్రి మృతిచెందాడు. అతని వివరాల తెలియరాలేదు.

కార్పెంటర్ అదృశ్యం

అడ్డగుట్ట, న్యూస్‌టుడే: ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. అడ్డగుట్ట సీఐ శంకర్ నాయక్ వివరాల మేరకు.. తుకారంగేట్ ఇంద్రలక్ష్మీనగర్‌కు చెందిన కె.బాలకృష్ణ (37) వృత్తి రీత్యా కార్పెంటర్. ఇతనికి మద్యం తాగే అలవాటుంది. సెప్టెంబర్ 28న ఇంట్లో బయటకు వెళ్లి తిరిగి రాలేదు.

ముగ్గురు సెల్‌ఫోన్ స్నాచర్ల అరెస్ట్

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ మొబైల్ ఫోన్ల స్నాచింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను ఉత్తరమండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు, మార్కెట్ పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర వివరాలు ప్రకారం... బహదూర్‌పల్లికి చెందిన ఓంకార్‌యాదవ్(18), సూరారానికి చెందిన సంజయ్‌గౌడ్(19), మరో బాల నేరస్తుడు.. చెడు వ్యసనాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించేందుకు సెల్‌ఫోన్ స్నాచింగ్‌ను ఎంచుకున్నారు. సంజయ్‌గౌడ్ తన యాక్టివా వాహనం నడుపుతుంటే బాలనేరస్తుడు, ఓంకార్‌యాదవ్ వెనుక కూర్చుని ఒంటరిగా వెళ్తున్న వారి ఫోన్లు లాక్కునేవారు. ఉత్తరమండలం టాస్క్‌ఫోర్స్, మార్కెట్ ఇన్‌స్పెక్టర్లు సైదులు, రాఘవేందర్, ఎస్సైలు జ్ఞానదీప్, శ్రీనివాసులు, సిబ్బందితో గురువారం అనుమానాస్పదంగా తిరుగుతున్న వీరిని అదుపులోకి తీసుకుని విచారించి నిందితుల నుంచి బైకు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించారు.

మల్కాజిగిరి

అల్వాల్ రైతు బజార్‌లో కూరగాయల ధరలు

అల్వాల్, న్యూస్‌టుడే: (గురువారం నాటివి.. కిలో రూ.లో) టమాటా 51, వంగ 35, బెండ 35, పచ్చిమిర్చి 35, కాలిఫ్లవర్ 23, క్యాబేజీ 23, క్యారెట్ 35, దొండ 35, బీర 40, ఉల్లి 34, సొర 19, పొట్ల 18, బీన్స్ 105, గోరుచిక్కుడు 35, చిక్కుడు 60, దోస 28, బీర 40, కాకర 35, చామగడ్డ 57, కీర 45, క్యాప్సికం 70, బీట్‌రూట్ 23, కందగడ్డ 55, చిలకడదుంప 40, మామిడి 105, మునగ 80, ముల్లంగి 7 (ఒకటి).

రామకృష్ణాపురంలో..

డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే: టమాటా కిలో రూ.51, వంగ 35, బెండ 35, పచ్చిమిర్చి 35, కాకర 35, బీర 40, క్యాబేజీ 23, బీన్స్ 105, క్యారెట్ 35, దొండ 35, చిక్కుడు 60, క్యాప్సికం 70, ఆలు 38, కీర 23, దోస 28, చామగడ్డ 40, అరటి 9, బీట్‌రూట్ 23, సొర 19, కాకర 35, చిలకడదుంప 42, మామిడి 105, మునగ 80.

చెత్త రిక్షాల పంపిణీ

అల్వాల్, న్యూస్‌టుడే: స్వచ్ఛ అల్వాల్‌కు ప్రజలు సహకరించాలని సర్కిల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం సర్కిల్ కార్యాలయం వద్ద కొత్తగా కేటాయించిన చెత్త రిక్షాలను ఎస్ఎఫ్ఏ (క్షేత్రస్థాయి పారిశుద్ధ్య పర్యవేక్షకులు)లకు పంపిణీ చేశారు. ప్రతి ఎస్ఎఫ్ఏకు రెండు రిక్షాలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. సర్కిల్‌కు మొత్తం 50 రిక్షాలు కేటాయించారని తెలిపారు.


రిక్షాల పంపిణీ కార్యక్రమంలో డీసీ శ్రీనివాస్‌రెడ్డి

మది నిండుగ.. ఉప్పొంగిన పూల పండుగ

ఘనంగా సద్దుల బతుకమ్మ ఉత్సవం

గౌతంనగర్, నేరేడ్‌మెట్, డిఫెన్స్‌కాలనీ, మౌలాలి, న్యూస్‌టుడే: రంగురంగుల పూలను ఒక తీరుగ పేర్చి..ఏమేమి పువ్వొత్తునే గౌరమ్మ..అంటూ మహిళలు పాటలు పాడుతూ..లయబద్ధంగా ఆడుతూ నిర్వహించిన సద్దుల బతుకమ్మ సంబరం కనువిందు చేసింది. మల్కాజిగిరి నియోజకవర్గ వ్యాప్తంగా మగువలు బతుకమ్మ ఆడిపాడారు. గురువారం సాయంత్రం అన్ని సామాజిక భవనాల వద్ద, ప్రధాన కూడళ్లలో, సఫిల్‌గూడ మినీట్యాంక్‌బండ్, బండచెరువుల వద్ద మహిళలు, యువతులు దాండియా, నృత్యాలు, కోలాటాలతో ఆకట్టుకున్నారు. ఇద్దరక్కచెల్లెండ్లు ఉయ్యాలో... ఒక్క ఊరికిస్తే ఉయ్యాలో.. ఒక్కడే మా అన్న ఉయ్యాలో...వచ్చన్న పోడు ఉయ్యాలో...అంటూ అక్కాచెల్లెళ్లు ఆడిపాడారు. తంగేడు పువ్వుల్లో ఉయ్యాలో...బతుకమ్మ పోతుంది సువ్వాయెలో..పోతేపోతిని గాని సువ్వాయెలో...మళ్ళొచ్చేడొస్తావు సువ్వాయెలో..యాడాదికి ఓ దినమో సువ్వాయెలో అంటూ ఆడిపాడారు.


మల్లన్న గుడిలో

★ సఫిల్‌గూడా మినీ ట్యాంక్ బండ్‌పై వందల సంఖ్యలో మహిళలు బతుకమ్మలను తీసుకొచ్చి ఆడిపాడారు. నిమజ్జనం ఘాట్‌లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కార్పొరేటర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో కృపాకాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్ద బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి.


మల్లికార్జున్‌నగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


గౌతంనగర్ డివిజన్ ఐఎన్ నగర్‌లో


బీహారీ బస్తీలో సంప్రదాయ వేడుకల్లో బీహారీలు


ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రాంగణంలో..


నేరేడ్‌మెట్‌లో..


సఫిల్‌గుడా మినీ ట్యాంక్‌బండ్‌పై..


మల్కాజిగిరిలో..


మౌలాలీ డివిజన్ శ్రామికనగర్‌లో


గౌతంనగర్‌లో..


మల్లికార్జున్‌నగర్‌లో నిమజ్జనం చేస్తున్న మహిళలు


మాజీ ఎమ్మెల్యే కనకారెడ్డి నివాస ప్రాంగణం వద్ద


అల్వాల్ శ్రీనివాస్‌నగర్ కాలనీలో..


కౌకూర్‌లో

మేమున్నాం.. మీకు తోడుగా..

మల్కాజిగిరి:80085 73378, అల్వాల్: 93911 06395
వినాయక్‌నగర్: 98498 60095, మౌలాలి: 80089 02818
గౌతంనగర్: 93475 56399 డిఫెన్స్‌కాలనీ: 84990 06641

మల్కాజిగిరి, గౌతంనగర్, అల్వాల్, డిఫెన్స్ కాలనీ, న్యూస్‌టుడే:

? మల్కాజిగిరి డివిజన్ విమలాదేవినగర్‌లో దోమల సమస్య తీవ్రంగా ఉంది. – రాజు, కాలనీవాసి

✓ మీ ప్రాంతంలో సమస్యను పరిశీలించి దోమల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. - నజీరుద్దీన్, పర్యవేక్షకుడు, సర్కిల్ మలేరియా విభాగం

? గౌతంనగర్ 22వ వీధిలో మ్యాన్‌హోల్ పొంగడంతో రహదారిపై మురుగు పారుతోంది. దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. – ప్రసన్న వెంకటేష్, గౌతంనగర్



✓ మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు నిర్వహిస్తాం. – నవీన్, జలమండలి మేనేజర్

? వాణీనగర్ మూడో వీధిలో చెత్తాచెదారం పేరుకుపోయింది. క్షేత్రస్థాయి సిబ్బందిని తొలగించమని కోరితే దురుసుగా సమాధానం చెబుతున్నారు. – శ్రీవత్సవ, వాణీనగర్

✓ చెత్త నిల్వలను డంపింగ్ యార్డుకు తరలిస్తాం. – నాగరాజు, పారిశుద్ధ్య నిర్వహణ సూపర్‌వైజర్

? కానాజిగూడలోని శివనగర్- టెలికాం కాలనీ మార్గం పొడవునా వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. – ప్రకాశ్, స్థానికుడు

✓ వ్యర్థాలు ఎత్తివేసేలా చర్యలు తీసుకుంటా. –ప్రభాకర్, పారిశుద్ధ్య అధికారి

? నేరేడ్‌మెట్ డివిజన్ పరిధి దేవినగర్ ప్రధాన మార్గం రామాలయం సమీపంలో రోడ్డు పక్కన చెత్తాచెదారం పేరుకుపోయింది. అపరిశుభ్రతతో ఇబ్బందులు పడుతున్నాం. – శ్రీనివాస్, దేవినగర్

✓ పరిశీలించి చెత్తాచెదారాన్ని డంపింగ్ యార్డ్‌కు తరలిస్తాం. –నాగరాజు, పారిశుద్ధ్య అధికారి

శోభాయమానంగా శ్రీవారి కల్యాణోత్సవం

గౌతంనగర్, న్యూస్‌టుడే: ఏడు కొండలవాడా..వెంకటరమణా గోవిందా..గోవిందా..అంటూ భక్తజనం పులకించి గళమెత్తి కీర్తిస్తుండగా గురువారం గౌతంనగర్ డివిజన్ మిర్జాలగూడ ఆలయంలో నిర్వహించిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితులు సంపత్‌కుమార్, శ్రీధరాచారి బృందం కల్యాణం జరిపించారు. భక్తులు గోవింద నామాలు ఆలపించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


కల్యాణ క్రతువులో వేద పండితులు

బాధిత కుటుంబ సభ్యులకు సాయం

డిఫెన్స్‌కాలనీ: నేరేడ్‌మెట్ డివిజన్ పరిధి సీబీఎన్ కాలనీ(వాంబే గృహాలు)లో నివసించే పసుల అనిల్ ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. స్పందించిన గుణిషాలు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు సంతోషి గురువారం అనిల్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం, 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో కల్పన. నరేష్, రామచందర్ పాల్గొన్నారు.

'బండచెరువు సమీపంలోని భూమి తమ స్వార్జితం'

మల్కాజిగిరి: తూర్పు ఆనంద్‌బాగ్ డివిజన్ ఆర్టీసీ కాలనీ బండచెరువు సమీపంలోని తమ భూములపై మాజీద్ షరీఫ్ చేస్తున్న ప్రచారం అసత్యమని డాక్టర్.జి.రాకేశ్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. అన్ని అనుమతులతో తన తండ్రి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డి ఇక్కడ తోట పెంచారని, షెడ్లను నిర్మించారని పేర్కొన్నారు. సంబంధిత వివరాలను ఆయన విలేకరులకు తెలియజేశారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల అందజేత

నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వినాయకనగర్ డివిజన్‌కు చెందిన రెండు కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి గురువారం తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. వినాయకనగర్‌కు చెందిన లక్ష్మీనారాయణకు రూ.31,500, మహేందర్‌రెడ్డికి రూ. 49,500 అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయనిధికి అర్హులైన వారు దరఖాస్తు చేస్తే వారికి నిధులు వచ్చేలా కృషి చేస్తానన్నారు. అందుకు తన కార్యాలయంలో ఇద్దరు వ్యక్తులను నియమించుకున్నట్లు తెలిపారు.

ఘనంగా సాయిబాబా పల్లకీసేవ

గౌతంనగర్: మల్కాజిగిరి సాయి సమాజ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సాయిబాబా సమాధి ఉత్సవాలు ఘనంగా జరుపుతున్నారు. గురువారం స్వామికి అభిషేకం, పల్లకీసేవ నిర్వహించారు. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం కూచిపూడి నాట్య గురువు డాక్టర్ పసుమర్తి శేషుబాబు బృందంచే నిర్వహించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దసరా


సూర్యనగర్ నవదుర్గ యువజన సంఘం ఉత్సవాల్లో ఎంపీ ఈటల రాజేందర్

అల్వాల్: చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దేవీ నవరాత్రి ఉత్సవాలు అనాదిగా నిర్వహిస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కానాజిగూడ, అల్వాల్, సూర్యనగర్ లో వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో ఆయన పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో భాజాపా నేతలు మాణిక్యరెడ్డి, అజయ్, యువజన సంఘం ప్రతినిధులు శ్రావణ్ కుమార్, ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

99.74 శాతం ఓటరు సర్వే పూర్తి

● 28న ముసాయిదా జాబితా ప్రచురణ ● అందుబాటులో లేని ఓటర్లు 12,720

గౌతంనగర్, న్యూస్‌టుడే: ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా మల్కాజిగిరి నియోజకవర్గంలో ఇంటింటి సర్వేను అధికారులు పూర్తి చేశారు. గుర్తించిన వివరాలను బీఎల్వోలు యాప్‌లో నమోదు చేశారు. అధికారుల లెక్కల ప్రకారం నియోజకవర్గంలో 99.74 శాతం సర్వే పూర్తయింది. త్వరలోనే ముసాయిదా జాబితాను సిద్ధం చేసి సర్కిల్ కార్యాలయంలోని నోటీసు బోర్డులో ఉంచనున్నారు.

ఆగస్టు 20న ప్రారంభమై.. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ఆధారంగా యువతకు ఓటు అవకాశాన్ని కల్పించడంతో పాటు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ చేపట్టేందుకు జీహెచ్ఎంసీ మల్కాజిగిరి అధికార యంత్రాంగం చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ ప్రక్రియ ఆగస్టు 20 నుంచి ప్రారంభమైనా.. గణేష్ నవరాత్రులు, ఇతర కారణాలతో నియోజకవర్గంలో తొలుత కొంత మందకొడిగా సాగింది. అనంతరం ప్రక్రియ పుంజుకోవడంతో సర్వే దాదాపుగా పూర్తికావొచ్చింది. అక్టోబరు 18 వరకు ఇంటింటి విచారణ, పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, ఓటరు జాబితాలో ఫొటోల మార్పు, పోలింగ్ కేంద్రాల హద్దుల నిర్ధారణ వంటి పలు అంశాలలో మార్పులకు అవకాశం ఉంది. కొందరి ఓటర్ల వివరాలు ఆన్‌లైన్‌లో లభ్యం కాకపోవడంతో వారిని పక్కన పెట్టి సర్వే కొనసాగించారు. చనిపోయిన వారు, చిరునామాలు మారిన వారు, ఇతర నియోజకవర్గాలకు వెళ్లిన వారి వివరాలను సంబంధిత కుటుంబ సభ్యుల నుంచి సేకరిస్తున్నారు. రెండుసార్లు నమోదైన వారి వివరాలను జాబితా నుంచి తొలగిస్తున్నారు.


గౌతంనగర్‌లో సర్వే చేస్తున్న బీఎల్వో

మల్కాజిగిరి నియోజకవర్గంలో..

★ మొత్తం ఓటర్లు –	5,11,971
★ సర్వే పూర్తయినవి –	5,10,657
★ అందుబాటులో లేనివారు –	12,720
★ ఇళ్లు మారినవి –	1,304
★ చనిపోయిన వారు –	1,563
★ ఫొటో గుర్తింపు సరిగా లేనివి –	756
★ రెండు సార్లు నమోదైన వారు –	273

జనవరి 2న తుది జాబితా విడుదల



–రాజు, ఉపకమిషనర్, మల్కాజిగిరి

ప్రజాస్వామ్య దేశంలో ఓటు వజ్రాయుధం లాంటిది. జనవరి 1, 2025 నాటికి 18 ఏళ్లు నిండనున్న యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఓటరుగా నమోదు చేసుకోవాలి. అక్టోబరు 19 నుంచి 28వరకు సమీకృత ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు ఏర్పాట్లు చేస్తున్నాం. 29న ఓటరు ముసాయిదా జాబితా విడుదలతో పాటు. అక్టోబరు 29 నుంచి నవంబరు 28 వరకు జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. 2025 జనవరి 6న తుది జాబితా విడుదలవుతుంది.

అమ్మలగన్నయమ్మ దుర్గ మాయమ్మ

గౌతంనగర్, మల్కాజిగిరి, నేరేడ్‌మెట్, అల్వాల్, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మల్కాజిగిరి నియోజకవర్గంలోని అమ్మవారి మండపాలు, ఆలయాల వద్ద గురువారం ప్రత్యేక పూజలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. దుర్గామాతగా అలంకరించారు. గౌతంనగర్ డివిజన్ జయగిరి లక్ష్మీ నర్సింహస్వామినగర్‌లోని మండపం వద్ద నాగప్ప కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గోపాల్‌నగర్ వరసిద్ధి వినాయక ఆలయంలో హోమం నిర్వహించారు. ★ పాత మల్కాజిగిరిలోని ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో, దుర్గాదేవిగా అలంకరించారు. జ్ఞాన సరస్వతీదేవాలయంలో మహిళలు కుంకుమార్చనలు చేశారు. ★ సఫిల్‌గుడా కట్టమైసమ్మ ఆలయంలో విజయదుర్గా హోమం ఘనంగా జరిగింది.


ఆనంద్‌బాగ్‌లోని లలితా పరమేశ్వరి దేవాలయంలో..


అన్నపూర్ణగా మారుతీనగర్‌లోని కాశీ విశాలాక్షి


అనంతసరస్వతీనగర్‌లో దుర్గామాతగా జ్ఞాన సరస్వతీదేవి


తూర్పుఆనంద్‌బాగ్‌లో కాశీ విశాలాక్షి గుడిలో..


ఉత్తమ్‌నగర్‌లో చండీ హోమం


అంబ, భవానీ ఆలయంలో..


జేఎల్ఎన్ఎస్‌నగర్‌లో భక్తులకు అన్నదానం


దీన్‌దయాల్‌నగర్‌లో


యాప్రాల్ సాయిబాబా ఆలయంలో శతచండీ హోమం

IN THE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE: MEDCHAL- MALKAJGIRI DISTRICT:: AT MEDCHAL
O.S.No.73 of 2023

Between:
A.M.Arunachalam & others ......Plaintiffs
AND
Smt.C.Hemalatha & others ......Defendants

To
1. C.Ramesh, S/o C.Narayan Singh, Aged about: 80 years, Occu: Business R/o H.No.1-32-118, Green Field, Indira Nagar Colony, Alwal, Medchal-Malkajgiri District.
2. J.Pratap Reddy, S/o J.Bucha Reddy Aged about: 58 years, Occu: Business R/o H.No.42-933, Jawahar Nagar Moula-Ali, Hyderabad.
3. P.Saheb Basha Khan, S/o Late P.Majid Khan, Aged about:52 years, Occu: Business, R/o H.No. 18-211, Hanumanpet, Malkajgiri, Malkajgiri Mandal, Ranga Reddy District
4. P.Chandra Shekar, S/o T.D.Pentaiah, Aged about:44 years, Occu:Business R/o 32-58/4/63, Bank Colony, R.K.Puram, Malkajgiri.
5. Vidala Suresh, S/o Vidala Raghavaiah, Aged about: 75 years, Occu:Business R/o Krishna Talkies Road, Suryapet, Nalgonda District, Telangana State. (Defendant Nos. 2 to 6)

Whereas the above named Plaintiffs filed the above said Suit OS No.73 of 2023 against you as Defendant Nos.2 to 6 and also against Defendant Nos.1 & 7 seeking for a declaration of their title and to declare the registered WILL and sale deeds as null and avoid and also for perpetual injunction and along with the suit the plaintiffs also filed IA No. 215 of 2023 for Ad-interim injunction and the suit along with IA stand posted to 18.10.2024 for your appearance.

You are therefore called upon to appear either in person or through advocate before the Hon'ble Court on 18.10.2024 at 10.30 a.m. failing which, the suit will be decided in your absence as per law.

[By Order of the Court]
Sd/- **[KATTA SANKARAIAH]** B.Com, B.L., ADVOCATE
Counsel for the Plaintiffs
Plot No. 19/1, H.No. 3-6-72, Road No. 25, Vivekananda Nagar Colony, Hyderabad-72. Ph.: **040-23061132,** Cell: **9391386614**

IN THE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE:: MEDCHAL- MALKAJGIRI DISTRICT:: AT MEDCHAL
O.S.No.72 of 2023

Between:
A.K.Subramanian & others ....Plaintiffs
AND
Smt.C.Hemalatha & others ...Defendants

To
1. C.Ramesh, S/o C.Narayan Singh, Aged about: 80 years, Occu:Business, R/o H.No.1-32-118, Green Field Indira Nagar Colony, Alwal, Medchal-Malkajgiri District.
2. J.Pratap Reddy, S/o J.Bucha Reddy, Aged about: 58 years, Occu: Business, R/o H.No.42-933, Jawahar Nagar Moula-Ali, Hyderabad.
3. P.Saheb Basha Khan, S/o Late P.Majid Khan Aged about:52 years, Occu:Business, R/o H.No. 18-211, Hanumanpet, Malkajgiri, Malkajgiri Mandal, Ranga Reddy District
4. P.Chandra Shekar, S/o T.D.Pentaiah, Aged about:44 years, Occu:Business R/o 32-58/4/63, Bank Colony, R.K.Puram, Malkajgiri.
5. Vidala Suresh, S/o Vidala Raghavaiah, Aged about: 75 years, Occu:Business R/o Krishna Talkies Road, Suryapet, Nalgonda District, Telangana State. (Defendant Nos.2 to 6)

Whereas the above named Plaintiffs filed the above said Suit OS No.72 of 2023 against you as Defendant Nos.2 to 6 and also against Defendant Nos.1 & 7 seeking for a declaration of their title and to declare the registered WILL and sale deeds as null and avoid and also for perpetual injunction and along with the suit the plaintiffs also filed IA No. 217 of 2023 for Ad-interim injunction and the suit along with IA stand posted to 18.10.2024 for your appearance.

You are therefore called upon to appear either in person or through advocate before the Hon'ble Court on 18.10.2024 at 10.30 a.m. failing which, the suit will be decided in your absence as per law.

[By Order of the Court]
Sd/- **KATTA SANKARAIAH,** B.Com, B.L.
Counsel for the Plaintiffs
Plot No. 19/1, H.No. 3-6-72, Road No. 25, Vivekananda Nagar Colony, Hyderabad-72. Ph.: **040-23061132.** Cell: **9391386614**

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందాం


కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న గీతామూర్తి

కాచిగూడ, న్యూస్‌టుడే: భారతీయ పండగల విశిష్టతను యువతరానికి తెలియజేయడంతోపాటు సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని భాజపా మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు గీతామూర్తి కోరారు. భవాని దీక్షను తీసుకున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు తుల్జాభవాని చిత్రపటం, పురాణపండ శ్రీనివాస్ విష్ణు సహస్ర నామ పారాయణం పుస్తకాలను అందజేసిన సందర్భంగా గురువారం ఆమె మాట్లాడారు. సనాతన ధర్మంలో ఆధ్యాత్మికతకు ప్రత్యేక స్థానం ఉందని ఆమె తెలిపారు.

ముషీరాబాద్

•ముషీరాబాద్ • అంబర్‌పేట

నేత్రపర్వంగా దుర్గా పూజ

రాంనగర్, న్యూస్‌టుడే: హైదరాబాద్ బెంగాలీ సమితి (హెచ్‌బీఎస్) ఆధ్వర్యంలో.. ఎన్టీఆర్ స్టేడియంలో 83వ దుర్గా నవరాత్రి ఉత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. ఐదు రోజుల పాటు జరిగే వేడుకల్లో భాగంగా రెండోరోజైన గురువారం కూడా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌బీఎస్ అధ్యక్షుడు మౌసుమీ చౌదరి, ప్రధాన కార్యదర్శి జోయ్ కుమార్ దత్తా, ఉపాధ్యక్షుడు బిస్వజిత్ ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.



ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ..

★ తీరొక్క పూలను పేర్చి.. సందడిగా ఆడిపాడి ★ నేత్రపర్వంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

ముషీరాబాద్, న్యూస్‌టుడే: తీరొక్క పూలను ఒక్కచోట పేర్చి.. వాటితో సుందరంగా తీర్చిదిద్దిన బతుకమ్మలతో మహిళలంతా సంతోషాల మధ్య సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పే బతుకమ్మ వేడుకలు గురువారం రాత్రి ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల పరిధిలో కనులపండువగా జరిగాయి. బస్తీలు, కాలనీల్లోని నివాసాల ముంగిట సహా అపార్ట్‌మెంట్ల ప్రాంగణాలు, ప్రధాన కూడళ్ల వద్ద సద్దుల బతుకమ్మ సంబరాలను అంబరాన్నంటేలా నిర్వహించారు. మహిళలు, యువతులు, చిన్నారులంతా సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను ఆడిపాడి సందడి చేశారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. చిత్తుచిత్తుల బొమ్మ.. శివుడి ముద్దుల గుమ్మ.. బంగారు బొమ్మ దొరికెనమ్మో ఈవాడలోన, ఒక్కేసి పువ్వేసి చందమామ ఒక్క జాములాయె చందమామ.. రామ రామ రామ ఉయ్యాలో.. ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ తదితర బతుకమ్మ పాటలు హోరెత్తాయి. ★ ముషీరాబాద్ చౌరస్తాలో శక్తిగణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ వాలీబాల్ క్రీడా మైదానంలో, ముషీరాబాద్ బాపూజీనగర్, బోలక్‌పూర్ డివిజన్‌లోని పద్మశాలి కాలనీ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లోభాగంగా.. మహిళలు బతుకమ్మ చుట్టూ ఘనంగా ఆడిపాడి వీడ్కోలు పలికారు. బతుకమ్మ ఆటలు, దాండియా నృత్యాలు, జానపదగీతాలతో పరిసరాలు హోరెత్తాయి. మిరుమిట్లు గొలిపే విద్యుత్తుకాంతుల మధ్య అర్ధరాత్రి వరకు సంబరాలు కొనసాగాయి. అనంతరం జీహెచ్‌ఎంసీ ఏర్పాటుచేసిన తాత్కాలిక నీటి కొలనుల్లో వాటిని నిమజ్జనం చేసి వాయనాలను పంచిపెట్టుకున్నారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకల్లో రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్, యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు. మహిళలతో కలిసి బతుకమ్మ, దాండియా నృత్యాలు చేసి ఉత్సాహపరిచారు.


ముషీరాబాద్‌లో బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్


చిక్కడపల్లిలో కాంగ్రెస్ నాయకురాలు అనిత


ముషీరాబాద్‌లో..


నల్లకుంటలో..

తెలంగాణలో గొప్ప పండగ బతుకమ్మ: కేంద్ర మంత్రి

బాగ్ లింగంపల్లి, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రజలకు గొప్ప పండగ బతుకమ్మ అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని కేబీఎన్ చౌరస్తా వద్ద అక్షర స్ఫూర్తి ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్, మహిళలతో కలిసి బతుకమ్మ, దాండియా ఆటలు ఆడి సందడి చేశారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ బతుకమ్మ ప్రపంచానికే తలమానికమన్నారు. కార్యక్రమంలో రాంనగర్ కార్పొరేట్ రవి చారి, భాజపా నేతలు గౌతంరావు, గుండగోని భరత్‌గౌడ్, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దాండియా ఆడుతున్న కె.లక్ష్మణ్, కిషన్‌రెడ్డి, గౌతంరావు తదితరులు


మహిళలతో ప్రేమ్‌నగర్, ఆజాద్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు లింగారావు, పాషా, రత్నాకర్, శ్రీకాంత్, మనోజ్‌యాదవ్


అంబర్‌పేటలో బతుకమ్మలతో మహిళలు


పటేల్‌నగర్‌లో బతుకమ్మలతో..


బతుకమ్మను నిమజ్జనం చేస్తున్న కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి


అడిక్‌మెట్ అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో..


ముషీరాబాద్ క్రీడా మైదానంలో..


బతుకమ్మను పేరుస్తున్న నల్లకుంట కార్పొరేటర్ అమృత


అంబర్‌పేటలో దాండియా ఆడుతున్న యువతులు


బాగ్‌లింగంపల్లిలో..

ఘనంగా మాతా జాగరణ

ముషీరాబాద్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ముషీరాబాద్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అమ్మవారి మండపం వద్ద భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జమాల్‌పూర్ ఆనంద్ ఆధ్వర్యంలో మాతా జీకి విశాల్ జాగరణ్ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గుదాదా భజన మండలి బృందం నిర్వహించిన భక్తిగీతాల ఆలాపన కార్యక్రమం ఆకట్టుకుంది. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.భగవంత్ రావు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్‌యాదవ్, భారాస నేతలు ముఠా జైసింహ, ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, కార్పొరేటర్లు పావని, సుప్రియగౌడ్, రచనశ్రీ, రవిచారి, భాజపా నేతలు రమేష్‌రామ్, పూసరాజు, సలాంది శ్రీనివాస్, ఆయూష్‌రాజ్ తదితరులతోపాటు భక్తులూ పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ★ భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలికాలనీలోని శ్రీసంజీవని హనుమాన్ ఆలయం వద్ద కూడా మాతా జాగరణను నిర్వహించారు. ప్రత్యేక పూజలు, భజన అనంతరం స్థానికులు దాండియా ఆడారు. ఆలయ కమిటీ ఛైర్మన్ నారేణ్ కృష్ణమూర్తి, ప్రతినిధులు బింగి సుదర్శన్, బింగి నవీన్, కృష్ణ, చంద్రమౌళి, గుండు సుధాకర్, వెంకటేశ్ పాల్గొన్నారు.


హాజరైన భారాస నేతలు ముఠా జైసింహ, శ్రీధర్‌చారి, శివ ముదిరాజ్ తదితరులు

ప్రత్యేక పూజలు.. అన్నదానాలు

ముషీరాబాద్, గాంధీనగర్, బాగ్‌లింగంపల్లి, నల్లకుంట, విద్యానగర్, బర్కత్‌పుర, న్యూస్‌టుడే: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల పరిధిలో వైభవంగా కొనసాగుతున్నాయి. 8వ రోజైన గురువారం చారిత్రక ముషీరాబాద్ మహంకాళి ఆలయంలోని అమ్మవారు మహిషాసురమర్ధిని, భోలక్‌పూర్ దేవునితోట భవానీశంకరాలయంలోని అమ్మవారు దుర్గాదేవి అలంకరణలలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్లకు ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు, కార్పొరేటర్లు, పోలీసు అధికారులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధప్రాంతాల్లోని మండపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాలను సైతం భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. మధ్యాహ్నం పలుచోట్ల అన్నదానం కార్యక్రమాలు చేపట్టారు. ★ భోలక్‌పూర్ డివిజన్ బాకారంలోని మల్లన్న స్వామి ఆలయంలో చండీహోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి, మాజీ ఛైర్మన్ ఉర్మిళ, మల్లికార్జున్‌రెడ్డిలతోపాటు యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్‌యాదవ్, నేతలు సుదేశ్, వై.పి.రాజు, లింగంగుప్తా, నర్సింగ్‌రావు పాల్గొన్నారు. ★ జవహర్‌నగర్ యంగ్‌మెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాతకు రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులకు రాతపుస్తకాలను పంపిణీ చేశారు. చిక్కడపల్లి ఏసీపీ రమేష్, సీఐలు సీతయ్య, రాంబాబు, ఎస్సై నాగరాజు, నేతలు ముఠా జైసింహ, జయేందర్‌బాబు పాల్గొన్నారు. ★ నల్లకుంట శంకరమఠంలోని శారదాంబ అమ్మవారు దుర్గామాతగా దర్శనమిచ్చారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


జవహర్‌నగర్‌లో విద్యార్థినికి రాతపుస్తకాన్ని అందజేస్తున్న కె.లక్ష్మణ్


భోలక్‌పూర్ రంగానగర్‌లోని అమ్మవారి వద్ద ముషీరాబాద్ సీఐ రాంబాబు


సుందరయ్య పార్కులో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో వాకర్స్ క్లబ్ ప్రతినిధులు వివేక్, వెంకటస్వామిగౌడ్, రమేష్‌రెడ్డి, నాగభూషణం


బర్కత్‌పుర చమన్ వద్ద అమ్మవారి మండపంలో భాజపా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు ఎన్.గౌతంరావు తదితరులు


జైస్వాల్‌గార్డెన్‌లో దుర్గాదేవి అలంకరణలో..


దుర్గానగర్‌లో పద్మావతి, దుర్గాప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న నరేందర్


కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణాగౌడ్, చందుపటేల్, లక్ష్మణ్‌గౌడ్


గోల్నాకలో కార్పొరేటర్ పద్మ, వెంకట్‌రెడ్డి

రాచకొండ పోలీసుల దసరా వేడుకలు


ఆయుధ పూజ చేస్తున్న సీపీ సుధీర్‌బాబు

అంబర్‌పేట: రాచకొండ పోలీసులు ముందస్తుగా దసరా వేడుకలను నిర్వహించారు. గురువారం అంబర్‌పేట పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో జరిగిన కార్యక్రమానికి రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు హాజరై ఆయుధ, వాహన పూజను నిర్వహించారు. అడ్మిన్ డీసీపీ ఇందిర, అదనపు డీసీపీ శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి


రామారావు, నాగేశ్వర్‌రావులకు పురస్కారాలను ప్రదానం చేస్తున్న వేణుగోపాలచారి, శ్రీనివాస్‌గుప్తా

గాంధీనగర్, న్యూస్‌టుడే: కళాకారులను సత్కరించి గౌరవించడం మనందరి బాధ్యత అని టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. దేవీ శరన్నరాత్రి ఉత్సవాలలో భాగంగా శిఖరం ఆర్ట్ థియేటర్స్, ఉప్పల ఫౌండేషన్‌ల సంయుక్తాధ్వర్యంలో 'నమోస్తుతే దుర్గే విజయ నంది' పురస్కారాల ప్రదానోత్సవం త్యాగరాయ గానసభలో గురువారం జరిగింది. వివిధరంగాల నుంచి ఎంపిక చేసిన ప్రముఖులకు.. కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారితో కలిసి అవార్డులను ప్రదానం చేసి సన్మానించాక ఆయన మాట్లాడారు. కళాకారుల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. వారిని మరింతగా ప్రోత్సహించేలా సాంస్కృతిక సంస్థలు పురస్కారాలను అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు ఉస్మానియ విశ్వవిద్యాలయం సివిల్ సర్వీసెస్ అకాడమి డైరెక్టర్ ప్రొ.కొండా నాగేశ్వరరావు, ప్రముఖులు లంకా లక్ష్మీనారాయణ, భానుప్రకాష్, రామారావు, ఐలయ్య, వెంకటనారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షణకు యువత కదలాలి

రాంనగర్: దేశ రక్షణ కోసం యువత ముందుకురావాలని భాజపా ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలేంద్ర శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం దోమలగూడలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ దేశాన్ని ప్రేమించాలన్నారు. దేశ రక్షణ కోసం ఇంటికి ఒకరుచొప్పున ఆర్ఎస్ఎస్‌లో చేరాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ముషీరాబాద్ నేతలు సాయికృష్ణ యాదవ్, బద్రీనారాయణ, నవీన్‌గౌడ్, వెంకటేశ్, పర్వీన్ కుమార్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరామ్ ఆశయసాధనకు కృషి చేద్దాం

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ ఆశయసాధనకు కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. సుందరయ్య కళానిలయంలో గురువారం రాత్రి తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ రాజ్యాధికార సాధన ఐకాస ఆవిర్భావం జరిగింది. ఈ సందర్భంగా ఐకాస రాష్ట్ర బాధ్యుడిగా డా.విశారదన్ మహారాజ్, ప్రతినిధులుగా రాఘవేంద్ర ముదిరాజ్, శ్రీహరి, శ్రీనివాస్ యాదవ్, శివగౌడ్, వినోద్‌యాదవ్, హరీశ్‌గౌడ్, అబ్దుల్ రెహమాన్, సాయిబాబా, దుర్గాప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తొలుత వారంతా కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

బతుకమ్మకుంట పరిరక్షణకు ఉద్యమిస్తా: వీహెచ్



విద్యానగర్: అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలోని బతుకమ్మకుంట ప్రభుత్వ స్థలమని.. అందులో మహిళలు బతుకమ్మలను ఆడేవరకు తాను ఉద్యమిస్తానని ఏఐసీసీ కార్యదర్శి వి.హనుమంతరావు స్పష్టం చేశారు. సంబంధిత ఉద్యమాన్ని అడ్డుకునేలా.. భారాస స్థానిక నేత ఒకరు తనపై పరువునష్టం దావా వేస్తానంటూ బెదిరించడం తగదన్నారు. అలాంటి బెదిరింపులకు భయపడబోనని చెప్పారు. గురువారం బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వీహెచ్ మాట్లాడారు. బతుకమ్మ కుంటలోని ప్రభుత్వ భూమి పరిరక్షణకు ఉద్యమిస్తుంటే సదరు నాయకుడు మాత్రం దాన్ని ప్రైవేటు స్థలమంటూ నిర్ధారించడాన్ని హనుమంతరావు ఆక్షేపించారు. బతుకమ్మకుంట ప్రాంతంలో అసలు కుంటలేదనడాన్ని కూడా తప్పుపట్టారు. సంబంధిత కుంటలో గతంలో తాను ఈత కొట్టానని, అంబర్‌పేట మహిళలు బతుకమ్మ సైతం ఆడారని వివరించారు. ఈ కుంటలోని ప్రభుత్వ భూమిని ప్రైవేటు భూమిగా చిత్రీకరించి ప్లాట్లు చేసి విక్రయించేందుకు కొందరు యత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. తాను ప్రజల మనిషినని.. ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని ఆయన చెప్పారు. నేతలు లక్ష్మణ్‌యాదవ్, శంబుల శ్రీకాంత్‌గౌడ్, రాంబాబు, రమేశ్, నారాయణస్వామి, జగన్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలపై అఖిలపక్ష సమావేశం


ఉప కమిషనర్ మారుతీదివాకర్, పార్టీల నేతలు

అంబర్‌పేట: ఓటర్ల జాబితాలపై అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించారు. గురువారం జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్ ఉప కమిషనర్ మారుతీదివాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి మహమ్మద్ అబ్దుల్ ఫరీద్, మీర్జా ముజాహిద్ అలీ బేగ్(కాంగ్రెస్), శ్రీహరి (భారాస), అజయ్‌కుమార్(భాజపా) తదితరులు హాజరయ్యారు.

రతన్‌టాటా మరణం తీరని లోటు


నల్లకుంటలో చిత్రపటం వద్ద నివాళులర్పిస్తూ..

కాచిగూడ, న్యూస్‌టుడే: పారిశ్రామికవేత్త రతన్‌టాటా మరణం మన దేశానికి, ప్రజలకు తీరని లోటని తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డా.రాజనారాయణ ముదిరాజ్ అన్నారు. గురువారం కుత్బిగూడలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ... దేశాభివృద్ధిలో కీలక పాత్రను పోషించిన ఆయన విస్తృతంగా సేవా కార్యక్రమాలను సైతం చేపట్టిన మానవతావాది అని కొనియాడారు. దుర్గా సెక్యూరిటీ మ్యాన్ పవర్ కన్సల్టెంట్ ఛైర్మన్ బండారి దయానంద్ మాట్లాడుతూ... దేశ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన రతన్‌టాటా నిరాడంబరతకు నిదర్శనమని తెలిపారు. డా.కేఆర్‌కే మూర్తి, చందర్‌ముదిరాజ్, డా.మేజర్ జయసుధ రతన్‌టాటాకు నివాళులర్పించారు.

గోల్నాక, న్యూస్‌టుడే: రతన్‌టాటాకు భారతరత్న పురస్కారం ఇవ్వాలని వ్యాపారవేత్త డా.అనూహ్యారెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆమె మాట్లాడుతూ... దేశ, విదేశాలలో అనేక పరిశ్రమలను స్థాపించి పలువురికి జీవనోపాధిని కల్పించిన మహోన్నత వ్యక్తి రతన్ టాటా అని కొనియాడారు. ఆయన మరణం బాధాకరమని తెలిపారు.

నల్లకుంట: ప్రపంచంలోనే గొప్ప పారిశ్రామిక వేత్త రతన్ టాటాను కోల్పోవడం విచారకరమని కాంగ్రెస్ పార్టీ నేతలు అన్నారు. ఆయన మృతి నేపథ్యంలో గురువారం నల్లకుంట శంకరమఠం మార్కెట్‌లోని పార్టీ సీనియర్ నేత హరినాథ్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన చిత్రపటానికి పలువురు నాయకులు నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలు గుర్తు చేశారు. నేతలు అజయ్‌కుమార్, కట్టెల సుభాష్, శరత్, భూదాన్ సాగర్, సీహెచ్.మురళి, శ్యామ్‌రావు, మధుసూదన్‌రెడ్డి, శ్రీధన్, శ్రవణ్ పాల్గొన్నారు.

కళాకారుల హృదయం సున్నితం


పురస్కార గ్రహీతలతో కేవీ రమణాచారి, త్రినాథరావు తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: కళాకారుల హృదయం సున్నితమని విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి అన్నారు. జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో.. గురువారం రాత్రి త్యాగరాయగానసభలో నాట్యగురువులు, రంగస్థల వ్యాఖ్యాతల పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన ప్రముఖులకు అవార్డులను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖులు సీహెచ్ త్రినాథరావు, పద్మశ్రీలత, సుధామయి, నిర్మలాప్రభాకర్, రేణుకాప్రభాకర్, శిరీష, అర్చన, రజిత, రమణ, మోహన్‌కృష్ణ, సుధీర్, సుమలత, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక రైళ్లొచ్చె.. ఇబ్బందులు తొలగె

కాచిగూడ స్టేషన్‌లో పెరిగిన ప్రయాణికుల రద్దీ


ప్లాట్‌ఫాంపై నిరీక్షిస్తున్న ప్రయాణికులు

కాచిగూడ, న్యూస్‌టుడే: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని ప్రముఖమైన కాచిగూడ స్టేషన్ నుంచి ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. పండగకు మరో రెండు రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో ప్రయాణికుల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. దీంతో స్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలన్నీ కిటకిటలాడుతున్నాయి. అన్ని రైళ్లకు టికెట్లు ముందుగానే రిజర్వ్ చేసుకున్నారు. టిక్కెట్లు దొరకని వారు జనరల్ బోగీలలో సొంతూళ్లకు పయనమవుతున్నారు.

★ ప్రస్తుతం కాచిగూడ స్టేషన్ నుంచి నాలుగు ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తెచ్చారు. వాటిల్లో కాచిగూడ-తిరుపతితోపాటు కాచిగూడ-హిస్సార్, కాచిగూడ-లాల్‌గఢ్(రాజస్థాన్), కాచిగూడ-నాగర్‌కోయిల్(తమిళనాడు) రైళ్లు ఉన్నాయి. విజయదశమి సమీపిస్తుండడంతో.. సాధారణంగా నడిచే ఎక్స్‌ప్రెస్‌లతోపాటు ప్రత్యేక రైళ్లు అంచనాకు మించి ప్రయాణికులతో కిక్కిరిసి వెళుతున్నాయి.

ఉప్పల్

•ఉప్పల్ •మేడ్చల్

అలరించిన నృత్య ప్రదర్శనలు



ఉప్పల్, న్యూస్‌టుడే: ఉప్పల్‌లోని శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు సందడిగా సాగుతున్నాయి. దసరా, బతుకమ్మను పురస్కరించుకొని గురువారం జయంతి నారాయణ శిష్య బృందం కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాకారులు సాత్వి, నైవేద్య, తేజస్వి, ధన్విత, శ్రీనిధి, నిఖిల చాందిని, సృజన, భవ్య, స్వాతి, ఆరాధ్య, తదితరులు గణపతి స్తుతి, మండూక శబ్దం, నారాయణీయం, నటరాజస్తుతి, అన్నమాచార్య కీర్తన, త్యాగరాజ కీర్తన, తిల్లాన అంశాలపై చక్కటి నృత్యాలను ప్రదర్శించారు.

మున్సిపల్ మైదానంలో దసరాకు భారీగా ఏర్పాట్లు

ఉప్పల్, న్యూస్‌టుడే: ఉప్పల్ దసరా ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ మైదానంలో దసరా ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందుముల పరమేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ అధికారులతో కలిసి మైదానంలో ఏర్పాట్లను పరిశీలించారు. దసరా రోజున జమ్మిపూజ, రావణ దహనం, పాలపిట్ట దర్శనం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఇందులో సమితి ప్రతినిధులు బాకారం లక్ష్మణ్, బజారు జగన్, తెల్కల మోహన్‌రెడ్డి, అంజయ్య తదితరులు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న పరమేశ్వర్‌రెడ్డి, ఇతర ప్రతినిధులు

మది నిండుగా.. పూల పండగ..



పర్వతాపూర్ స్పాంజిల్లాలో...

కీసర మాంకాళమ్మ గుడిలో..

కీసరలో ..

హబ్సిగూడలో..

కలెక్టరేట్‌లో బతుకమ్మలకు పూజ చేస్తున్న డీఆర్వో హరిప్రియ

ఉప్పల్‌లో ఆడుతున్న కార్పొరేటర్ రజిత

ఉప్పల్‌లోని శిల్పారామంలో

గుండ్లపోచంపల్లిలో

బ్యాంక్‌కాలనీలో ఆడుతున్న మహిళలు

శ్రీరామ్‌కాలనీలో..

ఎల్లారెడ్డిగూడలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మేడిపల్లిలో

దమ్మాయిగూడలో

శక్తి స్వరూపిణి నమో నమః

మల్లికార్జుననగర్‌లో

కీసరగుట్టలో

ప్రజాసాయిగార్డెన్‌లో శ్రీవాగ్దేవి

అన్నోజిగూడ

లక్ష్మీనారాయణ ఆలయంలో

జైజవాన్‌కాలనీలో

జమ్మిగడ్డలో

శ్రీదుర్గాదేవిగా నిమిషాంబికాదేవి

నాగారంలో ఎంపీ ఈటల

సత్యనారాయణపురంలో

పీర్జాదిగూడ

బృందావన్ కాలనీలో

గుండ్లపోచంపల్లిలో నైవేద్యం

శామీర్‌పేటలో..

అవుషాపూర్‌లో మాలధారులు

స్తంభాలున్నాయ్.. వెలుగులేవీ



రామంతాపూర్ సర్వీసు రోడ్డు ఇదీ

హబ్సిగూడ, న్యూస్‌టుడే: రామంతాపూర్ డివిజన్ శ్రీనగర్ కాలనీ నుంచి దేవేందర్‌నగర్ కాలనీకి వెళ్లే సర్వీసు రోడ్డులో విద్యుత్తు స్తంభాలను ఏర్పాటుచేశారు. కానీ వీధిలైట్లను పెట్టడం మరిచారు. రాత్రి వేళలో ఆప్రాంతం గుండా వెళ్లాలంటే ప్రజలు భయపడిపోతున్నారు.

పూలకు వస్తే... సెల్‌ఫోన్లు కొట్టేశారు

గుడిమల్కాపూర్ మార్కెట్లో రెండు రోజుల్లో 40 చరవాణుల చోరీ



ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: గుడిమల్కాపూర్ హోల్‌సేల్ పూల మార్కెట్లో సెల్‌ఫోన్ దొంగలు రెచ్చిపోయారు. మార్కెట్‌లో రద్దీని తమకు అనుకూలంగా మలచుకుని పెద్దఎత్తున చరవాణులు చోరీ చేశారు. సద్దుల బతుకమ్మ, విజయ దశమి నేపథ్యంలో రెండో రోజులుగా పూల మార్కెట్‌లో కొనుగోలుదారులతో కిక్కిరిసింది. రద్దీలో కలిసి పోయిన దొంగలు బుధ, గురువారాల్లో చెలరేగిపోయారు. గురువారం ఉదయం 10 గంటల వరకు దాదాపు 20 మంది సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. బాధితులంతా గుడిమల్కాపూర్ ఠాణాకు చేరుకుని ఫిర్యాదు చేశారు. బుధవారం మరో 20 మంది బాధితులు గుడిమల్కాపూర్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కొందరి వద్ద సెల్‌ఫోన్లకు సంబంధించిన బాక్సులు, బిల్లులు లేకపోవడంతో పోలీసులు ఫిర్యాదు స్వీకరించలేదని సమాచారం. బుధ, గురువారాల్లో 28 మంది బాధితులు తమకు అధికారికంగా ఫిర్యాదులు చేశారని సౌత్ వెస్ట్ జోన్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి చెప్పారు. పండుగలు, పర్వదినాల సమయాల్లో సెల్‌ఫోన్ దొంగలు మార్కెట్‌లో యథేచ్ఛగా సంచరిస్తుంటే పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సంక్షిప్త సమాచారం

నాచారం సెక్షన్ జలమండలి మేనేజర్‌గా సిరాజుద్దీన్

నాచారం, న్యూస్‌టుడే: నాచారం సెక్షన్ జలమండలి మేనేజర్‌గా మహమ్మద్ సిరాజుద్దీన్ నియమిస్తూ జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. మల్లాపూర్‌లోని జలమండలి సెక్షన్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా సైదయ్య

జవహర్‌నగర్: జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.సైదయ్య బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న నాగరాజు సీసీఎస్‌కు బదిలీపై వెళ్లారు. కుషాయిగూడ ట్రాఫిక్-1 ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సైదయ్య జవహర్‌నగర్ ఠాణా ఎస్‌హెచ్‌ఓగా వచ్చారు.

ఆస్తి పన్ను సవరిస్తాం: మేయర్

పీర్జాదిగూడ (బోడుప్పల్), న్యూస్‌టుడే :ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న ఆస్తి పన్ను విధానాన్ని సవరించాలని పాలక వర్గం నిర్ణయించినట్లు నగర మేయర్ అమర్‌సింగ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. పాలక వర్గ సమావేశంలో 53 అంశాలపై చర్చించినట్లు చెప్పారు. 2022 భువన్ సర్వే ఆధారంగా నగరంలో ఆస్తి పన్నుల పెంపుతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2016లో గ్రామపంచాయతీ అనుమతుల ప్రకారం నిర్మించిన ఇళ్లకు మార్కెట్ విలువ ప్రకారం పన్నులు వసూలు చేయాలని ప్రతిపాదించినట్లు చెప్పారు.

ఉచిత న్యాయ సహాయం పొందేందుకు టోల్ ఫ్రీ సంఖ్య

కాప్రా: ప్రజలకు న్యాయపరమైన సేవలను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబరు 15100ను ఆశ్రయించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బాలభాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలకు సమన్యాయాన్ని అందించేందుకు దిల్లీలోని జాతీయ న్యాయసేవా సాధికార సంస్థ అందుబాటులోనికి తీసుకొచ్చిందన్నారు.

వెలగని ఆకాశ దీపాలు



కీసర, న్యూస్‌టుడే: కీసర ప్రధాన చౌరస్తాలోని ఆకాశదీపాలు(హైమాస్ట్ లైట్లు) గత కొన్ని రోజులుగా వెలగడం లేదు. చౌరస్తాలోని దుకాణాల లైట్లు ఉన్నంత వరకు వెలుతురు ఉంటుంది. రాత్రి పది తర్వాత కటిక చీకటి నెలకొంటోంది. దీపాలు వేయాలని పుర అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదు.

అన్ని దానాలకన్నా.. అన్నదానం గొప్పది

నాగారం: శరన్నవరాత్రులను పురస్కరించుకొని దుర్గామాతలను నెలకొల్పిన నిర్వాహకులు పది రోజుల పాటు అన్నదానం చేయడం గొప్పదని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. గురువారం పట్టణ పరిధి రాంపల్లిలో దుర్గామాతను దర్శించుకున్నారు.

తామర పూలకు వెళ్లి మృత్యువాత



శామీర్‌పేట: బతుకమ్మకు తామర పూలను తెచ్చేందుకు వెళ్లిన వృద్ధుడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృత్యువాత పడిన సంఘటన శామీర్‌పేట ఠాణా పరిధిలో గురువారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబుబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం చిన్న వంగర గ్రామానికి చెందిన రంగు సోమయ్య(65) బతుకుదెరువుకు శామీర్‌పేట మండలంలోని చాపలబావి వ్యవసాయ క్షేత్రంలో కాపాలదారుడిగా ఉన్నాడు. బతుకమ్మలో పేర్చేందుకు అక్కడి నీటి గుంటలో తామర పూలను కోసేందుకు గురువారం వెళ్లి ప్రమాదవశత్తు నీట మునిగిపోయి చనిపోయాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో బీటెక్ విద్యార్థి దుర్మరణం



చేగుంట, న్యూస్‌టుడే: చదువుకుంటూనే.. తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్న ఓ యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందడం మెదక్ జిల్లా చేగుంటలో తీవ్ర విషాదం నింపింది. చేగుంట ఎస్సై చైతన్యరెడ్డి తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా రాయపోల్‌కు చెందిన గడ్డమీది మంజుల, కిషన్ దంపతులు చేగుంటలోని గజ్వేల్ మార్గంలో ఉంటూ పాత ఇనుప సామగ్రి వ్యాపారం చేస్తున్నారు. వీరికి అనిల్‌కుమార్(21), వినయ్ అనే ఇద్దరు సంతానం. అనిల్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర పరిధిలోని హోలీమేరీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం, చిన్న కుమారుడు ద్వితీయ ఇంటర్ చదువుతున్నారు. పండగ సెలవులకు అనిల్ ఇంటికొచ్చాడు. ఉదయం స్నేహితుడు సమీర్‌తో కలిసి పాత ఇనుప సామగ్రిని చిన్న లారీలో ఎక్కిస్తున్నాడు. ఇనుప నిచ్చెనను పైకి ఎత్తుతున్న క్రమంలో పైన ఉన్న 11 కేవీ విద్యుత్తు తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురై అనిల్ అక్కడికక్కడే మృతిచెందాడు. కళ్ల ముందు విగతజీవిగా పడిఉన్న కుమారుణ్ని చూసి తల్లిదండ్రులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే నార్సింగిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించడంతో శోకసంద్రంలో మునిగిపోయారు.

ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్య



ఉప్పల్, న్యూస్‌టుడే: అనుమానాస్పదస్థితిలో విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఉప్పల్‌లోని విజయపురికాలనీలో ఉండే పిల్లి దేవరాజ్ కుమారుడు అరూప్‌రాజ్(18) ఈ ఏడాదే ఇంటర్ పూర్తి చేశాడు. ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకును సాధించేందుకు కోచింగ్ తీసుకుంటున్నాడు. బుధవారం కూడా కోచింగ్‌కు వెళ్లి వచ్చాడు. అనంతరం స్నేహితులతో ఫుట్‌బాల్ ఆడేందుకు వెళ్లి రాత్రి 11.30గంటలకు ఇంటికి వచ్చి పడుకున్నాడు. గురువారం తెల్లవారుజామున 4గంటలకు తల్లి నయోమి అరూప్‌ను నిద్ర లేపేందుకు గదిలోకి వెళ్లింది. చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. వెంటనే కిందకు దించి 108లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకు, మంచి కాలేజీ వస్తుందో లేదోననే ఆందోళనతోనే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

మనోహరాబాద్, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులతో రెండు రోజుల క్రితం ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మనోహరాబాద్ ఎస్సై సుభాష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్‌కు చెందిన జమీల్(32)కు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. కీసరలో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ.. కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 4న సొంతూరుకు వచ్చేశాడు. ఏమైందని సోదరులు అడగ్గా.. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ భారంగా మారిందని, కుమారుడు అనారోగ్యం బారిన పడడంతో చికిత్స చేయించలేకపోతున్నానని తెలిపాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 7వ తేదీన పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. తొలుత తూప్రాన్ ప్రభుత్వాసుపత్రికి.. అనంతరం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి.. మెరుగైన చికిత్స కోసం సూరారంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమించి గురువారం ఉదయం మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి



నియామక పత్రాన్ని అందుకుంటూ...

జవహర్‌నగర్, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడిగా జవహర్‌నగర్‌కు చెందిన భారాస నాయకుడు జిట్టా శ్రీనివాస్ రెడ్డిని నియమించారు. ఈ మేరకు గురువారం ఉద్యమకారుల ఫోరం కమిటీ రాష్ట్ర ఛైర్మన్ చీమ శ్రీనివాస్ నియామక పత్రాన్ని అందజేశారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

మద్యం మత్తులో మహిళ: వాహనం ఢీకొని గాయాలు

జవహర్‌నగర్, న్యూస్‌టుడే: గుర్తుతెలియని మహిళ మద్యం మత్తులో రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని గాయపడింది. జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు ప్రధాన రహదారి మార్గంలోని భాగ్యనగర్‌కాలనీ సమీపంలో బుధవారం రాత్రి ఈ ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు.

పెద్దకర్మ



కీ॥శే॥ మొగపర్తి ఆశాజ్యోతి గారు

జననం : 04-02-1966 మరణం : 03-10-2024

(భర్త: కీ॥శే॥ మొగపర్తి మురళీధర్ బాబు గారు)

మంచితనానికి మారుపేరుగా నిలిచి, అందరి హృదయాలలో ప్రేమానురాగాలు నింపి, ఎల్లవేళలా మా ఆనందాన్ని కోరుకున్న మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమార్తెలు : శ్రీమతి మొగపర్తి హరిణి, కుమారి మొగపర్తి హర్షిణి

అల్లుడు : చిట్టెం అవినాష్ మనవరాలు: చిట్టెం మన్విత మరియు కుటుంబ సభ్యులు

పెద్దకర్మ : తేది.13-10-2024 ఆదివారం రోజున మా స్వగృహము నందు విల్లా నెం.19, సాకేత్ స్వర్ణ, సాకేత్ టౌన్‌షిప్, కాప్రా, హైదరాబాద్-62.

ఫోన్ : 9885358347, 9000333955